సంపుటి : 78 సంచిక : 05 పుటలు : 52

జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు కార్తిక బహుళ త్రయోదశి
వెల : ₹20/-
17-23 నవంబర్ 2025

వందే మాతరం..@ 150

వనితాశక్తికి వరల్డ్ కప్



జాగృతి వ్యవస్థాపక సంపాదకులు బుద్ధవరపు మహాప్రస్థానం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

RSS@
100
ఆర్.ఎస్.ఎస్. ఆవిర్భావమే హిందూ సమాజానికి ఒక మలుపు.
ప్రయాణమే ఒక పోరాటం. ఈ నూరేళ్ల చరిత్ర అసమానం.
సేవ, దేశభక్తియే ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా సాగుతున్న సంఘ ప్రస్థానం
నిరుపమానం. ధర్మరక్షణ కోసం జరిపిన సమరం మహోన్నతం.
భారత్‌ను విశ్వగురువుగా ప్రతిష్ఠించాలన్న మహదాకాంక్షతో
100 వసంతాలు పూర్తి చేసుకుంటున్న ఆర్.ఎస్.ఎస్.కు
సంఘ శతాబ్ది
శుభాకాంక్షలు
జి. కిషన్ రెడ్డి
కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి

నివాళి

స్వతంత్ర భారతదేశం చూసిన తొలితరం పత్రికా రచయిత, జాగృతి జాతీయ వారపత్రిక వ్యవస్థాపక సంపాదకుడు.. 1949 నుంచి దీపావళి - 2025 ప్రత్యేక సంచికను కూడా వీక్షించిన గొప్ప పాఠకుడు-

బుద్ధవరపు వేంకటరత్నం.

బీవీ రత్నం, శండిల వంటి కలం పేర్లతో ఆయన అన్ని సాహిత్య ప్రక్రియలను స్పృశించారు. వేంకటరత్నం మంచి కథకుడు, నవలా రచయిత, గేయకర్త, వ్యాసకర్త.

నిండు నూరేళ్లు జీవించి, తుది శ్వాస వరకు జాతీయ భావాలనే నమ్మారు.

ఆ అపారమైన జ్ఞాపకశక్తి నిండా ఆర్ఎస్ఎస్ జాడలే.

అటల్ బిహారీ వాజపేయి, దీనదయాళ్ ఉపాధ్యాయ వంటి వారితో కలసి నడచిన ఘనత వారిది.

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడి ఉన్న నిబద్ధత కూడా ఆయన సొంతం.

తెలుగు భాషను అమితంగా ప్రేమించిన హృదయం ఆయనది.

ఈ తరం జాతీయవాద పత్రికా రచయితలకు, సృజనాత్మక రచయితలకు ఆయన ఒక దిక్సూచి.

వారికి ఇదే 'జాగృతి' నివాళి.

వారి ఆత్మకు సద్గతులు కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ...

వ్యాసాలు.. పే. 26-28

బుద్ధవరపు వేంకటరత్నం
నవంబర్ 17, 1925
నవంబర్ 9, 2025



ఆచార్య శివప్రసాద్, జాగృతి ప్రస్తుత సంపాదక మండలి సభ్యులతో వేంకటరత్నం (వెనుక) వారి కుమారుడు శ్రీనివాసరావు (ఎడమ), అమృతోత్సవ భారతి (75 ఏళ్ల సందర్భం) సంచికను రత్నం గారికి అందిస్తున్న జాగృతి పరివారం

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

దాదాపు దశాబ్దకాలంగా పేలుళ్ల మాట వినపడకుండా భద్రత మధ్య ఉన్న దేశంలో నవంబర్ 10 సాయంత్రం, 6.50 ప్రాంతంలో జరిగిన పేలుడు జాతిని ఉలిక్కిపడేటట్టు చేసింది. కారులో అమర్చిన ప్రాణాంతక పేలుడు సామగ్రి పేలి 12 మంది చనిపోయారు, 20 మంది వరకు గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరగక తప్పదు. అంత తీవ్ర స్థాయి పేలుడు. పది అగ్నిమాపక యంత్రాలు వచ్చి, సమీపంలోని కార్ల మంటలు ఆర్పవలసి వచ్చింది. పేలుడు తీవ్రత, తీరుతెన్నులు అనూహ్యంగా, పాత వాటికి భిన్నంగా ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఎర్రకోట నుంచి ఏటా ఆగస్ట్ 15 సందర్భంగా ప్రధాని ప్రసంగించే చోటుకు సమీపంలోనే, ఒకటో నెంబర్ గేటు దగ్గర పేలుడు సంభవించింది. ఈ పేలుడు వెనుక జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ ఉందన్న అనుమానాలు వినిపిస్తున్నా, పాకిస్తాన్ హస్తం గురించి స్పష్టం కావలసి ఉంది. ఇప్పుడు ప్రజల ఎదురు చూపు దానికే. దాని పాత్రే నిజమైతే పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. భూటాన్‌లో ప్రధాని ఇచ్చిన ప్రకటనలో 'కుట్రదారులు' అన్న పదం ఉపయోగించారు. అమెరికా, ఇరాన్, భూటాన్, శ్రీలంక తదితర దేశాలు ఈ పేలుడు కుట్రను ఖండించి, మృతుల కుటుంబాల వారికి సానుభూతి ప్రకటించారు.

హరియాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక తెల్ల హ్యుండాయ్ ఐ20 కారు 10వ తేదీ ఉదయం 8 గంటల ప్రాంతంలో ఢిల్లీలో ప్రవేశించింది. చాలాచోట్ల చక్కర్లు కొట్టి, మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఎర్రకోట మెట్రోస్టేషన్ దగ్గర సుహేరీ మసీదు వద్ద ఆగింది. సాయంత్రం 6.20 ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గరకు నెమ్మదిగా చేరుకున్నాక పేలుడు సంభవించింది. పుల్వామా, జమ్ముకశ్మీర్‌లతో సంబంధం ఉన్నవారే దీనికి పాల్పడ్డారని అర్థమవుతూనే ఉంది. ఆ కారు ఏడు చేతులు మారింది, చివరికి పేలుడుకు ఉపయోగపడింది. ఇప్పటి వరకు వినిపించిన పేర్లను బట్టి ఇది ముమ్మాటికీ ఉగ్రదాడేనన్న అనుమానం కలగకమానదు. పుల్వామాకు చెందిన ఒక డాక్టర్ ఇందులో కీలకం. జైష్, అన్సార్ గజ్‌వత్ ఉల్‌హింద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగిన ఏడుగురు వ్యక్తులు, వారి వద్ద నుంచి 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలు హరియాణాలో స్వాధీనమైన కొన్ని గంటలకే ఈ విస్ఫోటం

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు కార్తిక బహుళ త్రయోదశి

లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

వందేమాతరం @ 150

ధారావాహిక నవల

గణపతిదేవుడు

- మత్తి భానుమూర్తి

నివాళి

ఆయన ప్రయాణం చరిత్రాత్మకం



జాగృతి

సంపాదకీయం

సంభవించింది. ఇది ప్రతీకారమనే ఎక్కువమంది అనుమానిస్తున్నారు. హరియాణా లోని ఫరీదాబాద్ కేంద్రంగా ఈ వ్యూహమంతా అమలయిందని అనుకోవచ్చు. ఆ బాంబు తయారీ పదార్థాలను ఎక్కడెక్కడ అమర్చవలసి ఉంటుందో విధ్వంసకులకు సమాచారం అందవలసిన తరుణంలో అరెస్టులు జరిగాయి. ఆ విధంగా పెద్ద విపత్తు నుంచి దేశం బయటపడింది. వైట్‌కాలర్ ఉగ్రభూతంగా చెబుతున్న ఈ కుట్రలో ఎక్కువ మంది వైద్యులు. కేసు జాతీయ దర్యాప్తు సంస్థ చేతికి ఇచ్చారు. ఢిల్లీ దాడికి బాధ్యుడు పుల్వామాకు చెందిన డాక్టర్ ఉమర్ మహమ్మద్ అని, ఐఎస్ఐ పథకంతో జైషే నిర్వహించిందని జమ్ముకశ్మీర్ మాజీ పోలీసు

ఢిల్లీ పేలుడు

డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ వైద్ నిర్మొహమాటంగా ప్రకటించారు. దీనిని బట్టి కశ్మీర్ ఉగ్రవాదం కొత్త పుంతలు తొక్కుతున్నదని దీనితో జాతీయ భద్రతకు పెను ముప్పేనని ఆయన హెచ్చరించారు కూడా. అమోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్, డిటొనేటర్ల సాయంతో ఈ పేలుడు జరిపారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

ఇలా ఉండగా, హైదరాబాద్ కేంద్రంగా బట్టబయలైన మరొక ఉగ్రకుట్ర గగుర్పొడిచే అంశాలను వెల్లడించింది. హైదరాబాద్ వైద్యుడు అహమ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అరెస్టు చేయడంతో చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. విధ్వంసం కోసం ఢిల్లీ, అహమ్మదాబాద్ లలోని పలు జనసందోహం ఉన్న ప్రదేశాలతో పాటు, లక్నోలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయాలపై కూడా ఇతడి ముఠా రెక్కీ నిర్వహించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. మొహియుద్దీన్ సయ్యద్‌కూ, ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్ ఉగ్రసంస్థ నాయకుడు ఖదీజాతో సంబంధాలు ఉన్నట్టు ముందే తేలింది. రైసిన్ అనే విష పదార్థం ద్వారా ఎక్కువ మారణకాండ సృష్టించాలన్నదే వీళ్ల పథకం. ఆ విషాన్ని మంచినీరు, ఆలయాలలో ఇచ్చే ప్రసాదాల ద్వారా విరజిమ్మాలని ఆ పథకం ఉద్దేశమని తేలింది. హైదరాబాద్‌లో ఒకరు, ఢిల్లీ తాజా పేలుళ్ల ఘటనలో అరెస్టయిన ఎనిమిది మందిలో ముగ్గురు వైద్యులే కావడం బాధ కలిగించే విషయం. వీరిలో డాక్టర్ షాహిన్ అనే మహిళా డాక్టర్ ఉన్నారు. ఈమెను లక్నోలో అరెస్టు చేశారు. ఢిల్లీ పేలుడు వెనుక ఉన్నట్టు భావిస్తున్న ఆ వైద్యులందరినీ ఉగ్రవాదం వైపు మళ్లించినవాడు ఇర్ఫాన్ అహమ్మద్ అనే ఒక మత గురువు.

ముస్లిం ఉగ్రవాదానికి ఉన్న రూపు, తత్వం, తీవ్రత ఘటన ఘటనకు మారుతున్నాయి. ఒకప్పుడు అవిద్యతో కొందరు ముస్లింలు ఉగ్రవాదాన్ని ఆశ్రయిస్తున్నారని బుద్ధితక్కువ మేధావులు నిరంతరం నమ్మించే ప్రయత్నం చేశారు. అది తప్పని తేలిపోయింది. ఢిల్లీ, అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయాల నుంచి నేరుగా కశ్మీర్‌లో ఉగ్రవాదానికి వెళ్లినవారు ఉన్నారు. మరి ఇప్పుడు! ముస్లిం వర్గానికి చెందిన వైద్యులు ఉగ్రవాద కార్యకలాపాలలో నేరుగా పాల్గొన్నారు. ఒక మతానికీ, ఉన్నత విద్యకీ ఇంతకు మించి సిగ్గుచేటయిన విషయం మరొకటి ఉంటుందా? దేశంలో వాతావరణం మారాలి. ఆలోచనా విధానం మారాలి. ఇది ప్రభుత్వ వైఫల్యం, నిఘా వర్గాలు నిద్ర పోతున్నాయా? అంటూ విరుచుకు పడేవారు ఇలాంటి నరహంతక రాక్షస క్రీడలు ఆపాలని ఉగ్రవాద ముఠాలకు కూడా ఒక మాట చెప్పరేమి? మంచినీటిలో, ఆలయాలలో పంచే ప్రసాదాలలో విషం కలిపి, ఎక్కువ సంఖ్యలో మరణాలు సంభవించేటట్టు చేయాలనుకునే ద్రోహులను ఏమనాలి? వారిని కాపాడుతున్నవారినీ, వారి ఓట్ల కోసం ఎంత దిగజారి మాట్లాడడానికైనా వెనుకాడని వారినీ ఏమని పిలవాలి? ★



36లో

కథ

ఆప్త కదంబం

- ఇంద్రగంటి నరసింహామూర్తి



కేరళలో పేదరిక నిర్మూలన జరిగిందా? (జాతీయం) - 12
'పన్‌డే' మాతరం (ప్రతిభ) - 14
జాతీయ జలాల్లోకి మత్స్యకారులకు అనుమతి (ఆంధ్రప్రదేశ్) - 17
అణ్వస్త్ర పోటీకి తెరలేపుతున్న ట్రంప్!! (అంతర్జాతీయం) - 24
చూపులన్నీ ఆమె వైపు! (మహిళ) - 30
ఎస్ఐఆర్ అంటే అంత గుబులు ఎందుకో? (చర్చ) - 32
ప్రకటిత భారతీయం.. పీయూష్ (నివాళి) - 34
ఆ నిషేధం తరువాత కాంగ్రెస్‌లో నిర్వేదం (ఆర్ఎస్ఎస్-100) - 40
హాకీకి శతవసంతాల హేల (క్రీడ) - 43
సమాజానికి ఇస్తున్న సందేశం ఏమిటి!? (సినిమా) - 50

గీత రచయిత

'వందేమాతరం...' అదొక గేయంలోని తొలి పదబంధం మాత్రమే కాదు. ఒక సమర నినాదం. ఆత్మవిస్మృతి నుంచి విముక్తమవుతున్న జాతి ఆత్మకు గొంతు. మాతృభూమీ! నీకు వందనం– అంతే దాని అర్థం. కానీ దానికి మతం రంగు అద్దారు. భారతజాతిలో జాతీయ భావాల ఆవిష్కారాన్ని భరించలేని శక్తుల వక్ర భాష్యమది. అయినా, ఖండిత భాగాలే చదువుతున్నా.. ఈనాడు వందేమాతరం దేశం పాడుకుంటున్న జాతీయగీతం. 'మూడు ఉద్యమాలు సృష్టించిన ఒక

వందేమాత

విదేశీ పాలన నుంచి దేశాన్ని విముక్తం చేయడానికి జరిగిన మహోద్యమాన్ని ఐక్యం చేసిన గీతమే, 'వందేమాతరం సుజలాం సుఫలాం...' బంకించంద్ర చటర్జీ అనే జాతీయవాద ప్రవక్త సరిగ్గా 150 ఏళ్ల క్రితం నవంబర్ 7, 1875న అక్షరబద్ధం చేశారు. అక్షయ నవమి శుభ ఘడియలలో ఆయన కలం నుంచి వందేమాతర గీతం ప్రభవించిందని చెబుతారు. స్వరాజ్య సమరానికి ఉత్తేజాన్ని ఇచ్చిన గీతం. అలాగే స్వతంత్ర భారతదేశ జాతీయగీతం కూడా.

ఆనందమఠంలోని గేయం

ఈ గీతం బంకించంద్ర ప్రఖ్యాత నవల 'ఆనంద మఠం'లో కనిపించే గీతం. మొదట 'బంగదర్శన్' సాహిత్య పత్రికలో ధారావాహికంగా వెలువడిన ఆనందమఠం నవల 1882లో పుస్తక రూపంలో వెలువడింది. నిజానికి ఆ గేయాన్ని బంకింబాబు (1838–1894) నవల కోసం రాయలేదు. 1870లో రాసిన గేయాన్ని తరువాత నవలలో చేర్చారు. ఆనందమఠం నవల ఇతివృత్తం 18వ శతాబ్దంలో వంగదేశమే కేంద్రంగా సాగిన సన్యాసి తిరుగుబాటు. ఎందుకీ తిరుగుబాటు? బక్సర్ యుద్ధం తరువాత (1765) బెంగాల్‌లో పన్ను వసూలు అధికారం ఈస్టిండియా కంపెనీకి వచ్చింది. ఈ అధికారాన్ని రాబర్ట్ క్లయివ్ రెజాఖాన్ అనేవాడికి అప్పగించాడు. అంటే బెంగాల్‌కు వాస్తవ పాలకుడు ఇతడే. తొలి గవర్నర్ జనరల్ వారన్‌హేస్టింగ్స్ రెజాఖాన్‌ను తప్పించి, కలెక్టర్లను నియమించి పన్ను వసూలు చేయించాడు. పైగా పది శాతం పెంచాడు. ఈస్టిండియా కంపెనీ వచ్చిన తరువాత బెంగాల్ దారుణ దుర్భిక్షాన్ని ఎదుర్కొన్నది (1763–1800) కూడా అప్పుడే. దీనికి ఎదురైన ప్రతిఘటనలలో ఒకటి సన్యాసీ తిరుగుబాటు. దశనామి నాగాలు అనే సన్యాసులు ఇందులో కీలకం. ఇదే ఇతివృత్తంగా సాగే నవల ఆనందమఠం. ఏడు ఎనిమిది వందల ఏళ్లగా ఉన్న ఆత్మవిస్మృతిని ఖండఖండాలుగా చీల్చే పదబంధాలు ఆ గేయంలో ఉన్నాయి. మట్టికీ, మనసుకీ మధ్య ఒక వారధిని నిర్మించే తాత్వికత ఆ గేయంలో సుస్పష్టం. అందుకే జాతీయతను మేల్కొలిపింది. దేశమాతను స్మరించుకోవడం కొత్త శక్తిని ఆవాహన చేసుకోవడమేనన్న స్పృహను ఆ గేయమే కలిగించింది. భారతీయుల కళ్లు తెరిపించి ఆత్మ గౌరవమనే అరుణోదయాన్ని దర్శింపచేసింది. భారతదేశ బానిసత్వం వెనుక ఉన్నది స్వయంకృతా పరాధం. అనైక్యత, ఆత్మ గౌరవ విస్మరణ, ఆత్మ విస్మృతులను జాతీయ ఆత్మ ద్వారా, భారతీయత ద్వారా పున:ప్రతిష్ఠించే గొప్ప ప్రయత్నం ఆ గేయంలో కనిపిస్తుంది.

బంకించంద్ర

కవి జీవించిన కాలం, ఆ కాలం పట్ల ఆ కవి లేదా రచయితకు ఉన్న స్పృహ ఆయన రచనలను ప్రభావితం చేస్తాయి. వందేమాతరం గీతానికీ, ఆ గీతం నిక్షిప్తమైన ఆనందమఠం నవలకు ఇదే వర్తిస్తుంది. బంకించంద్ర చటర్జీ జూన్ 27,1838న జన్మించారు. బెంగాల్‌లోని 24 పరగణాలలోని కాంటాలపడ ఆయన స్వస్థలం. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం సమయానికి ఆయన నవయువకుడు. తరువాత ఆయన ఆధునిక బెంగాలీ సాహిత్యంలో మకుటం లేని మహారాజు అయ్యారు. హృదయాలను కదలించే, కదలిన హృదయాలు ఏకాత్మతో సాగే విధంగా ఆయన రచించిన గేయమే వందేమాతరం. ఆయన భారత్ స్వతంత్ర దేశం కావడానికి ఏమి కావాలో ఒక దృష్టి కలిగినవారు. అది కూడా సానుకూల దృక్పథాన్ని నిర్మించుకున్నారాయన. దేశాన్ని ఆయన దశప్రహరణ ధారిణి దుర్గ రూపంలో దర్శించారు. ఆనందమఠం నవల కంటే చాలాముందే ఈ పాట పుట్టిందని ముందే అనుకున్నాం. ఒకసారి బంకించంద్రుడు రైలులో తన స్వస్థలానికి వెళుతున్నారు. దారంతా పచ్చదనంతో, సరస్సులతో అద్భుతంగా ఉంది. ఆ సమయంలో ఈ గీతం ఆయన గుండెలో జనించింది. పాట పుట్టిన ఏడేళ్లకు గాని అది ప్రపంచం ముందుకు రాలేదు. ఆ పాట సంగతి బంకింబాబు మొదట బారిసాల్‌లో ప్రస్తావించారు. అప్పుడు అది బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలకు ఆలవాలంగా ఉండేది. ఇంకొక చిన్న ఉదంతం కూడా బంకింబాబులో ఆత్మ గౌరవాన్ని మేల్కొల్పిందంటారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఏదో పని మీద బెర్హంపూర్ వెళ్లి తిరిగి వస్తుంటే, ఆయన ఎక్కిన పల్లకి వల్ల కలెక్టర్ పాల్గొన్న క్రికెట్ ఆటకు ఆటంక మైంది. దీనితో కలెక్టర్ కర్నల్ డఫిన్ బంకింబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించాడట. 1880 తరువాత దేశంలో కొత్త చైతన్యం అంకురిస్తున్నది. అప్పటికి సరిగ్గా పాతిక సంవత్సరాల క్రితం జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాట నినాదాలు

వాతావరణంలో నేను పుట్టి, పెరిగాను. ఆ మూడు ఉద్యమాలు కూడా చైతన్యాన్ని తట్టి లేపినవే. అందులో రెండవది బంకించంద్ర చటర్జీ. బెంగాలీ సాహిత్యంలో వచ్చిన చైతన్యానికి ఆయనే ఆద్యుడు' అన్నారు రవీంద్రనాథ్ టాగూర్ (ది రెలిజియన్ ఆఫ్ ది ఆర్టిస్ట్, 1924). 1937లో నెహ్రూ తదితర కాంగ్రెస్ నేతలు ఆ మహా గేయాన్ని ఖండించినా గడచిన 150 ఏళ్లు ఆ గేయం భారత జాతికి ఐక్యతా సూత్రంగానే పనిచేస్తోంది.


తొలి ఆలాపన

రం @150

ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. రాజకీయంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా కొత్త చింతన ఆరంభమైంది. వలస పాలన మీద వైముఖ్యం రూపుకడుతున్నది.

చిత్రం ఏమిటంటే ఈ గేయం రాసినప్పుడే ఆయన కుమార్తె, మిత్రులు ఇంత కఠిన పదాలతో అది కూడా బెంగాలీ, సంస్కృతం కలిపి ఇంత కఠినంగా రాస్తే ఎవరికి అర్థమవుతుంది అని ప్రశ్నించారట. ఇది ఆశువుగా రాసిన పాట. కానీ దీనిని జనం ఎంతగా ఆదరిస్తారో చూసే అవకాశం నాకు ఉండకపోవచ్చు. కానీ ఈ పాటను ప్రతి భారతీయుడు కూడా వేదమంత్రంలా పఠిస్తాడు అని ఆనాడే చెప్పారట.వందేమాతర గేయం బెంగాలీ, సంస్కృతాల సంగమం. నాటి ప్రముఖ సంగీత విద్వాంసుడు పంచేతగఢ్ జదునాథ్ భట్టాచార్య ఈ పాటకు మొదట బంకించంద్ర కోరిక మేరకు బాణీ కట్టారు. తరువాత ఎందరో వేర్వేరు బాణీలు కట్టారు.

తొలి ఆలాపన

ఈ గేయాన్ని 1896 నాటి కలకత్తా కాంగ్రెస్ సభలలో మొదటిసారి గానం చేసిన వారు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్. 1905 నాటి బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమానికి ఆ గేయమే మార్చింగ్ సాంగ్ అయింది. బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమం ఆరంభమైన తరువాత ప్రతి ఆదివారం ఉత్తర కలకత్తాలోని వందేమాతరం సంప్రదాయాలయంలో ప్రభాత భేరీ పేరుతో సామూహికంగా పాడేవారు. కొన్నిసార్లు రవీంద్రకవీంద్రుడు కూడా పాల్గొన్నాడు. 1905 నవంబర్ లోనే బెంగాల్‌లోని రంగపూర్‌లో ఈ గీతం పాడిన 200 మంది విద్యార్థులకు ఒక్కొక్కరి మీద రూ. 5 జరిమానా విధించారు. మొదట దీనిని అరవిందుడు బెంగాల్ జాతీయ గీతమని కీర్తించారు. జాతిని కదిలిస్తున్న ఈ గీతాన్ని ఆనాడు బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం నిషేధించింది. అదే తరువాత భారతదేశానికి జాతీయ గీతమై అలరారుతోంది. 1906లో బిపిన్‌చంద్రపాల్ సంపాదకునిగా వందేమాతరం పత్రిక ఆవిర్భవించింది. తరువాత ఇందులోనే అరవింద్ ఘోష్ చేరారు. 1907లోనే ఆ గీతం చరిత్రలో మరొక మలుపు కనిపిస్తుంది. జర్మనీలోని స్టట్టర్‌గార్ట్ అనే చోట ఆ ఆగస్ట్ 22న జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ సమావేశంలో మేడమ్ కామా భారత జాతీయ పతాకం పేరుతో ఒక జెండా ఎగరవేశారు. దాని మీద దేవనాగరి లిపిలో వందేమాతరం అని రాశారు. ఒక్కసారిగా ఆ పదబంధం ప్రపంచ ప్రజల దృష్టికి వెళ్లింది.

1907లో రవీంద్రుడి చేత హేమేంద్ర మోహన్ బోస్ ఈ పాట పాడించి రికార్డు చేశారు. బోస్ గ్రామఫోన్ తయారు చేసిన తొలి భారతీయుడు. ఆ సంవత్సరమే మరొకరు కూడా ఆ పాట పాడారు. 1906లో కూడా ఆ పాట రికార్డు రూపంలో వచ్చింది. నారాయణచంద్ర ముఖర్జీ పాడారు. సత్యభూషణ్ గుప్తా అనే ఆయన కూడా పాడారు. ఆనాడు కలకత్తాలో జరిగిన ప్రతి రాజకీయ, సాంస్కృతిక సభలకు ముందు, నాటకాలకి ప్రార్థనా గీతంగాను వందేమాతరమే పాడేవారు.భారత జాతీయ కాంగ్రెస్ బెంగాల్ శాఖ ప్రాంతీయ సమావేశం ఇదే బారిసాల్‌లో ఏప్రిల్ 14, 1906లో జరిగింది. విభజనకు వ్యతిరేకంగా పోరాడతామని అక్కడ ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. విభజనకు విత్తనాలు వేసిన కర్జన్ దిష్టిబొమ్మను దహనం చేయడమే కాకుండా, వందేమాతరం అంటూ ప్రజలు నినదించారు. దానితో వందేమాతరం అంటూ పలకరించుకోవడం, ఆ గేయం పాడడం కూడా జిల్లా కలెక్టర్ నిషేధించాడు. బారిసాల్ సమావేశం జరుగుతున్న

పాలూస్కర్ కృషి

పాలూస్కర్ హిందుస్తానీ సంగీతం ప్రపంచంలో ఒక విప్లవం. జాతీయోద్యమంతో ఆ సంగీత ప్రపంచాన్ని అనుసంధానం చేయడమే కాదు, కచేరీలలో, సాధనలో కొత్త మార్గాలను ప్రవేశపెట్టారు. హిందుస్తానీ సంగీత కుటుంబం నుంచి వచ్చిన పాలూస్కర్ సంగీత సాధనకు మొదటిసారి అందరికీ అందుబాటులో ఉండే విధంగా పాఠశాలను నెలకొల్పారు. అంతవరకు ఆలయాలకు పరిమితమైన సంగీతం బయట ప్రపంచంలోకి వచ్చింది. అలా జాతీయోద్యమంలో భాగమైంది. ఆగస్ట్ 18,1872న పాలూస్కర్ మహారాష్ట్రలోని రాజ సంస్థానం కురుంద్‌వాడ్‌లో జన్మించారు. తండ్రి దిగంబర్ గోపాల్ పాలూస్కర్ ప్రముఖ కీర్తనాచార్యుడు. అంటే భక్తిగీతాలకు ప్రసిద్ధి చెందినవారు. తండ్రి ప్రభావం కొడుకు మీద పడింది. ఈయన పదో ఏట గోకులాష్టమి జరిగే ఉత్సవంలో పాల్గొని చిన్న ప్రమాదానికి గుర య్యారు. దానితో కంటి చూపు పాక్షికంగా దెబ్బ తిన్నది. ఆ తర్వాత తన జీవితమంతా సంగీతానికే అంకితం చేశారు. తొలి సంగీత పాఠాలు బాల కృష్ణబువ ఇచ్చాలికరంజికర్ వద్ద సాగింది. బాలకృష్ణబువ గ్వాలియర్‌కు చెందిన ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు ఉస్తాద్ కరీంఖాన్ శిష్యుడు.

2003లో బీబీసీ ప్రపంచ వ్యాప్త సర్వే ఒకటి నిర్వహించింది. విశ్వవ్యాప్తమైన పది గేయాలు ఏవి అనే అంశం మీద జరిగిన సర్వే అది. మొత్తం 7000 పాటలు వచ్చాయి. 155 దేశాలు, ద్వీపాల లోని ప్రజలు ఈ సర్వేలో పాల్గొన్నారు. మొదటి పది గీతాలలో రెండవదిగా వందేమాతరం ఎంపికయింది. ఇంత గొప్పగా హృదయాలను కదిలించే పాట కాబట్టే భారత స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపింది. ★

భారత్ దేశీయ సాంకేతికత, వస్తువులు, సేవలతో తన సమస్యలను పరిష్కరించుకోవడంలో 'స్వ' నుండి 'స్వదేశీ' స్ఫూర్తిని వేడుకగా జరుపుకుంటుంది! బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా 'స్వరాజ్యం' కోరుతూ ఐక్య భారతదేశం కోసం పోరాడిన అందరు స్వాతంత్ర్య సమరయోధుల మనసులను ఆకర్షించిన జాతీయగీతం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 1875లో బంకించంద్ర చటోపాధ్యాయ ఈ గీతాన్ని రాశారు. ఇది పూర్తి స్వేచ్ఛ కోసం, విదేశీ పాలన, వస్తువులు, సేవలను తిరస్కరించడం కోసం హంస గీతంగా మారింది.

ఈ గీతం అంతర్గత, బాహ్య సవాళ్లను అధిగ మించి, 140 కోట్ల జనాభా కలిగిన ఐక్య, అభివృద్ధి చెందిన దేశానికి ప్రేరణగా ఉపయోగపడుతుంది.

ఇటీవల జబల్‌పూర్‌లో మూడు రోజుల సమావేశం నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కేంద్ర కార్యనిర్వాహక మండలి 'వందేమాతరం' స్ఫూర్తిని వేడుకగా జరుపుకోవడానికి, దానిని పునరుద్ధరించడానికి ఒక సంవత్సరం పాటు ప్రచారం చేయాలని ప్రకటించింది. దీనిని మొట్ట మొదట 1896లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించినప్పుడు ప్రతినిధులు ఆకర్షితులయ్యారు. ఇది బ్రిటిష్ వారిని వ్యతిరేకించే ఒక 'మంత్రం' గా మారింది. మహర్షి అరబిందో, మేడమ్ భికాజి కామా వంటి దిగ్గజాలు, విఖ్యాత కవి సుబ్రమణ్య భారతి, లాలా హర్‌దయాళ్, లాలా లాజపతిరాయ్ వంటి సమరయోధులు, దయానంద సరస్వతి వంటి సంస్కర్తలు కూడా దీనిని ఆలపిం చారు. మహాత్మా గాంధీ తోటి స్వదేశీయులకు స్వాతంత్ర్య సమరయోధులకు రాసిన లేఖలలోనూ, ప్రజలను పలకరించడానికి 'వందేమాతరం'ను నేర్పుగా ఉపయోగించారు.

1975లో 'వందేమాతరం' 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పుడు, అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అంతర్గత అత్యవసర పరిస్థితిని విధించారు. పౌరుల ప్రాథమిక, ప్రజాస్వామ్య హక్కులను తుంగలో తొక్కారు. కాంగ్రెస్ నేతృత్వం లోని ప్రభుత్వం 'వందేమాతరం' గీతాలాపనపై ఆంక్షలు విధించింది. పార్లమెంటు ఉభయ సభలు సహా చాలా ప్రజాస్వామ్య సంస్థలను రద్దు చేసింది. రెండేళ్ల పాటు వెర్రి అప్రజాస్వామిక పాలన చేస్తూ అధికారంలో ఉండటానికి రంగం సిద్ధం చేసుకుంది.

అందువల్ల, న్యూఢిల్లీలో నేరపూరిత పాలన భారాన్ని చవిచూసిన యావత్ సంఘపరివార్, 50 సంవత్సరాల తర్వాత 'వందేమాతరం' స్ఫూర్తిని వాడవాడలా వినిపించాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. వందేమాతరం జాతీయ గీతం జనగణమనకు దీటుగా కులం, మతం, లింగం, ప్రాంతం, విశ్వాసం ప్రాతిపదికగా సమాజపు ప్రాథమికాలను బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్న విభజన శక్తులకు వ్యతిరేకంగా యావత్ దేశ పౌరులను తిరిగి ఏకం చేసేందుకు ప్రయత్నిస్తుంది.

వందేమాతరం విదేశీ శక్తులతో సంబంధాలు కలిగి ఉన్న విధ్వంసక శక్తులకు వ్యతిరేకంగా 'స్వ', భారతీయత స్ఫూర్తిని తిరిగి రగిలించే గొప్ప

కె.ఎ.బదరీనాథ్
డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్,
సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్
హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.

స్థలం వరకు సురేంద్రనాథ్ బెనర్జీ, బిపిన్‌చంద్రపాల్, అరవింద ఘోష్ వంటివారు ఊరేగింపుగా వెళ్లారు. నిరాయుధులు జరుపుతున్న ఆ ఊరేగింపు మీద పడి పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ వార్త బెంగాల్‌ను వేడెక్కించింది. అప్పుడే ముస్లిం మతోన్మాదం కూడా వేళ్లూనుకున్నది కాబట్టి ఇది హిందూధర్మాన్ని కీర్తించే పాట అంటూ విమర్శలు రాకపోలేదు. అయినా భారత జాతీయ కాంగ్రెస్ 1937 నుంచి ఈ గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయ గీతంగా స్వీకరించింది. వందేమాతరం గేయం ప్రాచుర్యం పొందక ముందు గాడ్ సేవ్ ది కింగ్/క్వీన్ అనే పాట పాడేది భారత జాతి.

ఆగస్ట్ 15, 1947 ఉదయం ఆకాశవాణి ఈ గేయాన్ని ప్రసారం చేసింది. పండిట్ ఓంకార్‌నాథ్ ఠాకూర్ పాడారు. జనవరి 24,1950న రాజ్యాంగం అమలులోకి రావడానికి రెండు రోజుల ముందు జనగణ మన అధినాయక గీతంతో పాటు వందే మాతరం కూడా రాజ్యాంగ పరిషత్ ఆలపించింది. జనవరి 24, 1950న భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూరాజేంద్ర ప్రసాద్ వందేమాతరం గీతం

'స్వ'కు ప్రేరణ!

సామర్థ్యాన్ని కలిగి ఉంది.

వందేమాతరం గ్రామాల నుంచి నగరాల వరకు మొత్తం దేశంలోని ప్రజల్లో తాము భారతదేశానికి చెందినవారమనే భావన కలిగించగలదు. దేశ నాగరికత విలువలను పునరుజ్జీవింపజేయగలదు. దాని వైవిధ్యాన్ని వేడుకగా జరుపుకోగలదు. దేశాన్ని ఐక్యంగా ఉంచగలదు. భారత్‌ను ఇతర దేశాలు కూడా ముందుకు సాగడానికి ఒక పటిష్టమైన మార్గాన్ని చూపించే అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలదు.

ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హొసబలే కొన్ని వర్గాలలోని తేడాలను పక్కనపెట్టి జాతీయ పునరుజ్జీవనం, అభివృద్ధి, భారతదేశంలో సమ్మిళిత శ్రేయస్సును తీసుకురావడానికి ప్రాతిపదికగా 'స్వ' స్ఫూర్తిని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

'స్వ'లో దేశీయ వనరులు, ప్రతిభ, ఆలోచనలు, ఆవిష్కరణలు ఉంటాయి. అది భారతీయతను నిర్వచించే సాంకేతికతపై ఆధారపడటం ఉంటుంది. ఉదాహరణకు, వాట్సాప్‌కు వ్యతిరేకంగా శ్రీధర్ వెంబు ప్రవేశపెట్టిన సొరట్టె మన ప్రాథమిక కమ్యూనికేషన్ మాధ్యమం కావచ్చు. ఉదాహరణకు, రష్యా ఎస్‌జే-100 విమానాలను నిర్మించడం కంటే ప్యాసింజర్, యుద్ధ విమానాలకు చోదక శక్తినిచ్చే మన స్వంత కావేరీ ఇంజిన్‌ను నిర్మించడం మన ప్రాధాన్యతగా ఉండాలి.

దత్తాత్రేయ హొసబలే చెప్పినట్లుగా, 'స్వ' లేదా 'స్వదేశీ' అనేది భారత్ దృక్కోణం నుండి పూర్తి వేరుపడిపోకూడదు. దీని అర్థం దేశీయ వనరులు, దేశీ ప్రతిభ, స్వదేశీ సాంకేతికతలు, ఆవిష్కరణలు, మానవ మేధస్సుపై పూర్తిగా ఆధారపడాలని.

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, రక్షణ రంగంలో ఉత్పాదకత నుండి సమాచార సాంకేతికత వరకు, స్వావలంబన అనేది కంటెంట్ లేదా ప్రక్రియలలో ఇలా అన్నింటా ఒక కీలకమైన పదం- కీ వర్డ్‌గా మారాలి. స్వచ్ఛమైన 'స్వదేశీ' పంథా ప్రపంచంలో అనేక భాగస్వామ్యాలతో మిళితమై, భారత్ తన సామాజిక-ఆర్థిక పునరుజ్జీవనం కోసం చేపట్టిన ప్రచారానికి వేగాన్ని పెంచుతుంది.

అమెరికా ఒత్తిడికి గురైన రష్యా భారత్‌కు రాకెట్లు, క్షిపణులకు శక్తినిచ్చే క్రయోజెనిక్ ఇంజిన్ల సాంకేతికతను నిరాకరించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. రష్యన్ అంతరిక్ష సంస్థ గ్లావ్‌కాస్మోస్ క్రయోజెనిక్ ఇంజిన్ల సాంకేతికతను తిరస్కరించడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో 1994లో చేసుకున్న ఒప్పందాన్ని సవరించింది. సరఫరాను తొమ్మిది ఇంజిన్లకే పరిమితం చేసింది. అయినప్పటికీ ఇస్రో శాస్త్రవేత్తలు ప్రపంచ అంతరిక్ష శక్తులను అధిగమించారు. అంతరిక్ష రంగంలో ఆధిపత్యం చెలాయించారు.

ఇందులో ప్రధాన సానుకూల అంశం ఏమిటంటే, నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పరివార్ చేపట్టిన 'వందేమాతరం' ప్రచార కార్యక్రమంలో భాగం పంచుకోవడం. ఇందుకు నిదర్శనంగా నవంబర్ 7, శుక్రవారం నాడు, అక్షయ నవమి రోజున ప్రధాన మంత్రి మోదీ స్వయంగా 'వందేమాతరం' స్ఫూర్తిని దేశ ప్రజలలో తిరిగి రగిలించారు.

గత నెలలోనే, కేంద్ర మంత్రివర్గం ఒక తీర్మానం ద్వారా వచ్చే ఏడాది నవంబర్ 7 వరకు 'వందే మాతరం'ను వేడుకగా జరుపుకోవాలని నిర్ణయించింది. పాలనా యంత్రాంగం ప్రతీ స్థాయిలోనూ 'స్వదేశీ'ని ఒక 'మంత్రం'గా స్వీకరించి నట్లయితే ఈ ప్రచారం మరింత ప్రయోజనకరంగా మారుతుంది.

భారత్ ప్రతి రంగంలోనూ 'స్వ' స్ఫూర్తిని వర్తింపజేస్తే, అభివృద్ధి చెందిన దేశాల్లో జపాన్ లేదా జర్మనీని అధిగమిస్తూనే, ఆర్థిక రంగంలో అగ్ర స్థానం కోసం చైనా, అమెరికాలకు గట్టిపోటీని ఇవ్వడం కష్టసాధ్యం కాదు.

పాలనా సంస్కరణల నుండి భారత ప్రజల విభిన్న భాషలను వినియోగించుకోడం వరకు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, వాటి నాయకత్వం ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ★

గురించి చెప్పిన మాటలు అద్వితీయమైనవి. వందేమాతర గేయం జాతీయోద్యమానికి ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని, జనగణమనతో సమానంగా ఆ గేయానికీ గౌరవం ఉండాలని ఆయన రాజ్యాంగ పరిషత్‌లో స్పష్టం చేశారు. ఉత్తర భారతదేశంలో పండిత్ విష్ణుదిగంబర్ పాలూస్కర్ (1872-1931) ఈ పాటను గానం చేసి ఉర్రూతలూగించేవారు. తెలుగు ప్రాంతంలో కౌతా రామశాస్త్రి పాడేవారు.

అరవిందులు వందేమాతర గేయానికి ఇచ్చిన కొత్త భాష్యం అపూర్వమైనది. ఆ గేయం ఇప్పుడు

ఆనందమఠం నవల నుంచి బయటపడి స్త్రీపురుష భేదం లేకుండా, శిశువులకు సహా పెదాల మీద నడయాడుతున్నది' అని సోదరి నివేదిత వ్యాఖ్యానించారు. వందేమాతరం గీతం నుంచి ఎలాంటి ప్రేరణ పొందాలో గొప్పగా వ్యాఖ్యానించినవారు బ్రహ్మబాంధవ ఉపాధ్యాయ. ఆయన జీవితమంతా సన్యాసాశ్రమంలో ఉన్నారు. ఆనందమఠం నవలలో చిత్రించినట్టుగానే ప్రతి ఇంటి నుంచి ఒకరు వచ్చి దేశం కోసం త్యాగం చేయాలి. అలాగే ప్రతి తండ్రి తన సంతానంలో ఒకరిని మాతృభూమి సేవ కోసం

Enriched with Vitamins A,D&E
PRIYA GOLD
FORTIFIED
WITH VITAMIN A&D
ప్రియా గోల్డ్
రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్
రిఫైండ్ రైస్ బ్రాన్ ఆయిల్
ఫిల్టర్డ్ వేరుశెనగ (పల్లీ) నూనె
కమ్మదనాల
అమ్మ చేతి
అద్భుతం!
A product from
SANTHOSHIMATHA GROUP OF INDUSTRIES
MOBILE : 9848160792
Website : www.priyagoldoils.com
Availabe Packs : 500ml | 1 Ltr Pouch | 1,2,3 & 5 Ltr Pet Bottle | 5Litre HDPE Jar

ముఖపత్ర కథనం

120 ఏళ్ల నుంచి వ్యతిరేకమే

వందేమాతరం గీతం మీద ముస్లింల వైఖరి దాదాపు 120 సంవత్సరాల నుంచి ఒకే విధంగా ఉంది. 1908లో ముస్లిం లీగ్ వందేమాతరం ఆలాపనను వ్యతిరేకించింది. ఆ సంవత్సరం జరిగిన లీగ్ వార్షిక సమావేశాలు సయ్యద్ ఇమామ్ అధ్యక్షతను జరిగాయి. దేశాన్ని మాతృభూమిగా పూజించడాన్ని ఇస్లాం అంగీకరించదని అతడు ప్రకటించాడు. అదే వైఖరీ నేటికీ ఉంది. వందేమాతర గీతం పాడడం ఇస్లాం విశ్వాసాలకు శుద్ధ వ్యతిరేకమని అంటున్నాయి జమ్ముకశ్మీర్ ముస్లిం మత సంఘాలు.

అల్లా ఒక్కడే భగవంతుడు అన్న తమ విశ్వాసానికి ఈ గీతంలో వ్యక్తమైన భావనలు వ్యతిరేకమని ఆ సంఘాలు చెబుతున్నాయి. అల్లా అనే సృష్టికర్తను విశ్వసించడం ఒక్కటే తమకు ముఖ్యమని మిగిలిన ఏ విషయాలూ తమకు అంగీకార యోగ్యం కావని తెగేసి చెబుతున్నాయి. వందేమాతర గీతం జన్మించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నవంబర్ 7న ఉత్సవాలు నిర్వహించాలంటూ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కశ్మీరీ ముస్లిం మత సంఘాలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరడం ఈ దృష్టితోనే. ఇలాంటి ఉత్సవం నిర్వహించమంటూ లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం పట్ల ముతాహిదా ఎ ఉలేమా (జమ్ముకశ్మీర్ లోని ముస్లిం మత సంఘాల ఐక్యవేదిక) నాయకుడు మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. నవంబర్ 7న జమ్ముకశ్మీర్ ప్రాంతంలోని అన్ని పాఠశాలలలో సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతోత్సవాలు నిర్వహించాలని ఆ ఆదేశంలో పేర్కొన్నారు. వీటికి విద్యార్థులు, పాఠశాల సిబ్బంది కూడా హాజరు కావాలని ఆదేశించారు.

ఇలా ముస్లిం బాలబాలికలను వందేమాతరం ఉత్సవాలకు హాజరు కావాలని ఆదేశించడం వారి విశ్వాసానికి అన్యాయం చేయడమే కాకుండా, అంగీకారయోగ్యం కూడా కాదని మిర్వాయిజ్ ఎక్స్ ఖాతాలో వ్యాఖ్యానించాడు. ఇలాంటి చర్యలు ముస్లింలు మెజారిటీగా ఉన్న ప్రాంతం మీద ఆర్ఎస్ఎస్ హిందూ భావజాలాన్ని రుద్దడం కోసం ఉద్దేశించినవేనని ఆయన విమర్శించాడు. కానీ వందేమాతర గీతం 1875లో జనం ముందుకు వస్తే ఆర్ఎస్ఎస్ యాభయ్ ఏళ్ల తరువాత ఆవిర్భవించింది. ★

అర్పించాలి అని చెప్పారు.

వందేమాతరం గేయం తీవ్ర జాతీయోద్యమ కారులను, సంస్థలను మరింతగా ప్రభావితం చేసింది. బెంగాల్ కేంద్రంగా 1902లో సతీశ్‌చంద్ర బోస్ అనుశీలన్ సమితి అనే విప్లవ సంస్థను నెలకొల్పారు.

మేడం కామా

ఈ సంస్థల సభ్యులకు ఒక నియమం ఆనందమఠం నవల కరతలామలకంగా ఉండడం. తరువాత ఇదే సంస్థ ప్రేరణతో మహారాష్ట్ర, పంజాబ్, మద్రాస్ ప్రావిన్స్‌లలోను విప్లవ సంస్థలు జన్మించాయి. పులీన్‌బిహారీ దాస్, పి. మిత్రా, బాబూరావ్ సావర్కర్, వినాయక్ దామోదర్ సావర్కర్, మదన్‌లాల్ ధింగ్రా, డాక్టర్ హెడ్గెవార్, జతీంద్రనాథ్ ముఖర్జీ, ఎంఎన్ రాయ్, రాస్ బిహారీ బోస్, భగత్‌సింగ్, చంద్రశేఖర ఆజాద్, వీవీఎస్ అయ్యర్ విప్లవోద్యమాలలో మమేకమైనవారే. మేడమ్ కామా రూపొందించిన జాతీయ పతాకం మీద వందేమాతరం అని దేవనాగరి లిపిలో రాయించారు. 1905లో కవయత్రి సరళాదేవి చౌదురాణి బెనారస్ కాంగ్రెస్ సమావేశాలలో పాడారు. లాలా లాజ్‌పతి రాయ్ లాహోర్ నుంచి ప్రారంభించిన పత్రిక పేరు వందేమాతరం.

అయితే 1915 నుంచి కాంగ్రెస్ సమావేశాలలో వందేమాతరం గానాన్ని విష్ణు దిగంబర్ పాలూస్కర్ ఒక సంప్రదాయంగా ప్రవేశపెట్టారు. 1923లో కాకినాడ కాంగ్రెస్ సమావేశాలకు పాలూస్కర్ హాజరయ్యారు. అయితే ఆ సభలకు అధ్యక్షత వహించిన మౌలానా మహమ్మద్ అలీ ఆ పాట పాడేందుకు వ్యతిరేకించాడు. అయితే పాలూస్కర్ అధ్యక్షుడి మాట పక్కన పెట్టి గానం చేశారు. సహాయ నిరాకరణోద్యమంలో ముస్లింలను తృప్తి పరచడానికి డాక్టర్ మహమ్మద్ ఇక్బాల్ పాట సారే జహాసె అచ్చా పాడించడం మొదలుపెట్టారు. అయితే అప్పటికి ముస్లింలు తృప్తి పడలేదు. వందేమాతరం పూర్తిగా ఆపేసి, ఇక్బాల్ పాటనే ఉంచాలని కోరారు.

ఆ రకంగా 1937 కేవలం మొదటి రెండు చరణాలు పాడడం మొదలయింది. 1938లో మహ్మద్ అలీ జిన్నా కూడా వందేమాతరం గేయం తొలగించాలని నెహ్రూకు ప్రతిపాదించాడు. మళ్లీ ఇంకొక అడుగు వెనక్కి వేసి కాంగ్రెస్ బషీర్ అహమ్మద్ గీతాన్ని పాడించడం మొదలుపెట్టారు. ఇంకా ఇంగ్లిష్‌లో ఖురాన్ ప్రార్థన కూడా మొదలు పెట్టారు. ఆఖరికి దేశం విడిపోయినా వందేమాతరం గురించి ముస్లిం లీగ్‌లకు ఉన్న అభ్యంతరాలను గౌరవించడం కాంగ్రెస్ మానలేదు.

నెహ్రూకూ, ఆయన భక్తులకూ చాలా విషయాలు ఇష్టం లేదు. కానీ అవన్నీ జాతికి జవజీవాలను కూర్చేవి. చైతన్యం కలిగించేవి. వారసత్వ ప్రతీకలు. 150 ఏళ్లలో దేశానికి వందేమాతరం చేసిన సేవ ఏమిటి? ఈ దేశం ఒక్కటిగా కదలడానికి అంత స్ఫూర్తిగా పాత్ర నిర్వహించింది. నవంబర్ 7న జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు వందేమాతరం అంటే భారతజాతికి ఒక మంత్రశక్తి. ఒక కల, ఒక సంకల్పం.

– జాగృతి డెస్క్

సామాజిక సంస్కరణలు, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లో దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే బాగా ముందున్నట్టు కేరళ గణాంకాలు, రికార్డులు ప్రతి ఏటా తెలియజేస్తుంటాయి. నిజానికి ప్రపంచంలో మరే అగ్రరాజ్యంలోనూ లేనంతగా కేరళ రాష్ట్రం ఈ అంశాల్లో దూసుకుపోతున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ప్రతి ఏటా నవంబర్ 1 న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవాల రోజున చెబుతోన్న ఈసారి నవంబర్ 1న జరిగిన 69వ రాష్ట్రావతరణ దినోత్సవాల్లో పినరాయి విజయన్ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించినట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో నిరుపేదరికాన్ని పూర్తిగా నిర్మూలించమని ఆయన గణాంకాలతో సహా వివరించారు.

కేరళలో పేదరిక ని

రాష్ట్రంలో ఈ అతి పేదరికాన్ని నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా కృషి చేస్తోంది. నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, పంచాయతీలు, ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సామాజిక సేవా సంస్థల సహాయ సహకారాలతో విజయన్ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా నిరుపేదరికాన్ని నిర్మూలించడానికి గట్టిగా కృషి చేస్తోంది. పినరాయి విజయన్ నాయకత్వంలో వామపక్ష కూటమి (ఎల్.డి.ఎఫ్) రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2021 మే నెలలో జరిగిన మొదటి మంత్రివర్గ సమావేశంలో ఈ 'అతి పేదరిక నిర్మూలన కార్యక్రమా'నికి అంకురార్పణ జరిగింది. వాస్తవానికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కార్యక్రమాలు రూపొందించడమన్నది మొదటి నుంచి జరుగుతూ వస్తున్నదే. మొదటగా 1973-74లో అప్పటి ప్రభుత్వం ప్రజల సహకారంతో రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడానికి నడుం బిగించింది. ఆ ప్రభుత్వం అతి కష్టం మీద పేదరికాన్ని 59.8 శాతానికి తగ్గించగలిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వారు కూడా అనేక సంవత్సరాలు పేదరికం మీద పోరాటాలు జరిపిన తర్వాత 2011 నాటికి 11.3 శాతానికి తగ్గింది.

పేదరికంపై పోరాటం

నీతి ఆయోగ్ సంస్థకు చెందిన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (2023) కూడా కేరళలో పేదరికం చాలావరకు తగ్గినట్టు, పేదల్లో అధిక సంఖ్యాకులు అన్ని విధాలా పురోగతి సాధించినట్టు ప్రకటించింది. ఇక్కడ కూడు, గూడు, గుడ్డకు అవకాశం లేక నానా అవస్థలూ పడుతున్న వారి సంఖ్య చాలా తక్కువ సంఖ్యలో ఉన్నట్టు కూడా అది తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ గణాంక వివరాలు ప్రకారం, కేరళలో కూడు, గూడు, గుడ్డకు నోచుకోని వారి సంఖ్య మొత్తం పేదల జనాభాలో 0.55 శాతమే ఉన్నట్టు రికార్డులు తెలియజేస్తున్నాయి. ఈ విషయంలో జాతీయ సగటు 14.96 శాతంగా నమోదై ఉంది. కేరళలో పేదల సంఖ్య, పేదరికం స్థాయి జాతీయ సగటు కంటే బాగా తక్కువగా ఉన్నట్టు కేరళ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది.



రాష్ట్రంలో పేదరికాన్ని అంచనా వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక విశిష్టమైన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఏ పేదవాడూ తనకు తానుగా వచ్చి తన పేదరిక వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉండదు. పేదరికాన్ని అంచనా వేయడానికి, పేదల సంఖ్యను స్వయంగా అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లక్షల మంది సుశిక్షిత ఉద్యోగులను నియమించింది. ఈ ఉద్యోగులకు స్థానిక సంస్థలే కాకుండా, ప్రజా ప్రయోజనాల కోసం ఇదివరకే నియమించిన కుటుంబశ్రీ వధకం కార్యకర్తలు కూడా సహకరించాల్సి ఉంటుంది. పేదరికంగా బాగా ఎక్కువగా కూరుకుపోయి ఉన్న వ్యక్తుల్ని గుర్తించడం వీరికి అప్పగించిన లక్ష్యం. ఒక్కసారి కాకుండా అనేక పర్యాయాలు సర్వే చేసిన తర్వాత నిరుపేద కుటుంబాలను గుర్తించారు. రాష్ట్రంలో 64,006 కుటుంబాలు పరమ పేదరికంలో కొట్టుమిట్టాడు

ర్మూలన జరిగిందా?

ఆషామాషీ విషయం కాదు. ఒకసారి సహాయం చేసినా, కొద్ది కాలం పాటు వదలకుండా సహాయం చేసినా పేదరికం తొలగిపోయే దురవస్థ కాదు. అనేక ఏళ్ల పాటు, కనీసం ఒక తరం వృద్ధిలోకి వచ్చే వరకూ పేదరిక నిర్మూలన కార్యక్రమం కొనసాగాల్సిన అవసరం ఉంటుంది. పైగా, కేరళకు సంబంధించి నంత వరకూ రాష్ట్రంలో అనేక గిరిజన జాతులు నిరుపేదరికం కంటే కనాకష్టమైన స్థితిలో ఉన్నాయి. రాష్ట్రంలో గిరిజన జనాభా ఇంకా మౌలిక అవసరాలకు, సౌకర్యాలకు దూరంగానే ఉండడం జరుగుతోంది. రాష్ట్రంలో నిరుపేదరికాన్ని నిర్మూలించామని చెప్పుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తొందరపడుతున్నట్టు కనిపిస్తోంది. కొత్తగా మరికొన్ని కుటుంబాలు పేదరికంలోకి దిగజారకుండా చర్యలు తీసుకోవడం కూడా అందని మాని పండుగానే ఉంది. అన్ని వైపుల నుంచి, అన్ని కోణాల నుంచి

తున్నట్టు గుర్తించారు. ఈ కుటుంబాల్లోని వ్యక్తుల సంఖ్యను బట్టి మొత్తం 1,03,099 మంది వ్యక్తులు కూడు, గూడు, గుడ్డ వంటి మౌలిక విషయాలకు ఆమడ దూరంలో ఉన్నట్టు తెలిసింది. ఆహారం, ఆరోగ్యం, జీవనం, ఇల్లు వంటి నాలుగు మౌలిక సౌకర్యాలకు వీరు నోచుకోవడం లేదని ఈ అధ్యయనంలో అర్థమైంది.

విభిన్న కార్యక్రమాలు

వాస్తవానికి, ఈ పేదల అవసరాలన్నీ ఒకే విధంగా లేవు. ఒక్కొక్క కుటుంబం పరిస్థితి ఒక్కో విధంగా ఉంది. అందరికీ ఒకే విధమైన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు చేపట్టడం వల్ల ఉపయోగం లేదని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పేదల విషయంలో విభిన్న సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కొక్క నిరుపేద కుటుంబానికి ఒక్కో సూక్ష్మ సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టవలసి వచ్చింది. ఒక్కొక్క నిరుపేద కుటుంబాన్ని కలుసుకుని, వారి అవసరాలను గుర్తించి, వారికి గుర్తింపు పత్రాలను జారీ చేయడానికి ప్రభుత్వానికి ఆరేడు నెలల కాలం పట్టింది. ఎవరికి ఎటువంటి ఇల్లు అవసరం, ఎటువంటి జీవనం అవసరం, ఆరోగ్యం ఏ స్థాయిలో ఉంది, వారు ఎటువంటి ఆహారాన్ని తీసుకుంటున్నారు, ఎటువంటి వస్త్రాలను ధరిస్తున్నారు వగైరా విషయాలను అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక తరహా సంక్షేమాన్ని చేపట్టడం ప్రారంభించింది.

కాగా, అతి పేదరికాన్ని నిర్మూలించడం నిరుపేదరికాన్ని నిర్మూలిస్తామని కేరళ ప్రభుత్వం అనేక పర్యాయాలు ప్రకటించింది. కానీ, పేదరికం నాలుగైదేళ్లలో మటుమాయమయ్యే అవకాశం లేదు. పేదరికం నుంచి బయటపడాలని, ప్రభుత్వ సౌకర్యాలను, కార్యక్రమాలను, వథకాలను ఉపయోగించుకుని అభ్యున్నతి సాధించాలన్న తాపత్రయం నిరుపేదల నుంచి కూడా వ్యక్తం కావలసిన అవసరం ఉంది.

సమగ్రాభివృద్ధికి దూరం

రాష్ట్రంలోని వేలాది నిరుపేద కుటుంబాలకు ఆహారం, ఆరోగ్యం, జీవనం, ఇల్లు అందించడానికి కోట్లాది రూపాయల ఖర్చుతో పథకాలు, కార్యక్రమాలు చేవడుతున్న ప్రభుత్వం వారికి ఉచిత విద్యనందించడానికి, వారికి తగ్గ ఉపాధి కల్పించ డానికి కూడా పెద్ద ఎత్తున కృషి చేయాల్సి ఉంటుంది. కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ఉపాధికల్పనలో మాత్రం అట్టడుగు స్థితిలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 'కేరళ మోడల్' ప్రస్తుతం ఎదుగూ బొదుగూ లేకుండా ఆగిపోయి ఉందని, ఉపాధి కల్పనకు అవకాశాలే కనిపించడం లేదని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో ఉపాధి కల్పనకు అవకాశాలు లేకపోయినా, సంపద సృష్టి స్తంభించిపోయినా పేదరిక నిర్మూలన సాధ్యం కాదని, మరో రెండు మూడేళ్లలో మరింత ఎక్కువ సంఖ్యలో పేద కుటుంబాలు పెరిగే ప్రమాదం కూడా ఉందని విమర్శకులు భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కొన్ని ప్రాథమిక సదుపాయాల ప్రాజెక్టులను, హైటెక్ హరిత పరిశ్రమల నిర్మాణాన్ని చేపట్టింది. దీనివల్ల పేదలకు, నిరుపేదలకు కొద్దిపాటి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పేదల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, పేద కుటుంబాలలోని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడ నైపుణ్య కేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరిగింది. సంక్షేమాన్ని, అభివృద్ధిని కలగలిపి పథకాలు, కార్యక్రమాలు చేపట్టడం వల్ల పేదరికాన్ని, నిరుపేదరికాన్ని నిర్మూలించడం మరింత తేలికవుతుందని, సామాజిక భద్రత విషయంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని ఆర్థిక, సామాజిక నిపుణులు ప్రభుత్వానికి సూచించడం జరుగుతోంది. ఇందుకు తగ్గట్టుగా నిరుపేద నిర్మూలన పథకాన్ని కొద్దిగా మార్చే పక్షంలో ఫలితాలు మరింత ప్రోత్సాహకరంగా ఉంటాయని కూడా టీవీ చర్చల్లోనూ, యూట్యూబ్ ఛానల్స్‌లోనూ నిపుణులు ప్రభుత్వానికి సూచించడం జరుగుతోంది.

ప్రజలకు సంబంధించిన పథకాలు, కార్యక్రమాల్లో కొద్దిపాటి లోపాలు, లొసుగులు ఉండడం సహజం. అతి పేదరిక నిర్మూలన కోసం తాము చేపట్టిన సంక్షేమ పథకాలు, సామాజిక కార్యక్ర మాలు కాలం గడిచే కొద్దీ, అనుభవాలను పండించుకుంటున్న కొద్దీ మార్పులు, చేర్పులకు లోనవుతాయని, అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్య సూత్రాలను అమలు చేయడానికి, వాటిని పటిష్ఠం చేయడానికి తాము చేస్తున్న కృషిని శంకించవద్దని, తమ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవాలని విజయన్ ప్రభుత్వం గత నవంబర్ 1న జరిగిన అధికారిక రాష్ట్రావతరణ కార్యక్రమంలో ప్రజలను, నిపుణులను అభ్యర్థించింది. పేదరిక నిర్మూలన కోసం, ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమానికైనా పార్టీలకు, సిద్ధాంతాలకు అతీతంగా తమ మద్దతు తప్పకుండా ఉంటుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ప్రకటించారు. నిరుపేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందా అన్నది వేచి చూడాల్సిన విషయం.

జి.రాజశేఖర్
సీనియర్ జర్నలిస్ట్

‘వన్‌డే’

తల్లిగా పూజలందుకునే భారతమాత మాతృశక్తికి చిహ్నంగా నిలిచింది. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడం ద్వారా ఈ దృక్పథాన్ని స్పష్టంగా ప్రదర్శించింది. ఈ విజయం కేవలం క్రీడా విజయం కాదు. ఇది భారతీయ సంస్కృతి, సామాజిక ఆత్మలో నిక్షిప్తమై ఉన్న మహిళాశక్తికి నిదర్శనం. నవంబర్ 2, 2025న నవీ ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్టేడియంలో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టు తొలిసారిగా మహిళల ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది.

ముంబై నుండి ఢిల్లీ వరకు, మోగా నుండి మీరట్ వరకు, హిమాచల్ ప్రదేశ్ నుండి హరియాణా వరకు, భారత్‌మాతా కీ జై నినాదాలు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించాయి.

మోదీ ప్రభుత్వం పంచ ప్రోత్సాహకాలు

మోదీ ప్రభుత్వం (2014 నుండి) భారత మహిళల క్రికెట్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించింది. ఇది కేవలం ఆర్థిక మద్దతు కాదు సామాజిక సాధికారత, సమానత్వంతో పాటుగా యువతకు ప్రేరణలా మారింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మాటలు, సమావేశాలు, విధానాల ద్వారా మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించారు. 2025లో మొదటి వన్డే వరల్డ్ కప్ విజయం ఈ ప్రయత్నాల ఫలితం నుంచి ఉద్భవించింది. ఈ మద్దతును పాలసీ మార్పులు, బీసీసీఐ మద్దతు, వ్యక్తిగత సమావేశాలు, ఫిట్‌నెస్ ప్రమోషన్, భవిష్యత్ ప్రణాళికలు అనే ఐదు ప్రోత్సాహాలుగా విభజించవచ్చు.

1. సమాన జీతాలు, ఆర్థిక సమానత్వం

మోదీ ప్రభుత్వ కాలంలో బీసీసీఐ (భారత క్రికెట్ బోర్డు) మహిళల క్రికెటర్లకు పురుషులతో సమాన మ్యాచ్ ఫీ అమలు చేసింది. అక్టోబర్ 27, 2022న బీసీసీఐ కార్యదర్శి జయ్ షా ఈ చారిత్రక నిర్ణయాన్ని ప్రకటించారు. మహిళా క్రికెటర్లకు టెస్ట్ మ్యాచ్‌కు రూ. 15 లక్షలు, ఓడీఐకి రూ. 6 లక్షలు, టీ-20కు రూ. 3 లక్షలు జీతం ఇచ్చారు. ఇది మహిళలకు మొదటి సెంట్రల్ కాంట్రాక్ట్‌లలో 7% మాత్రమే ఉండేది. ఈ మార్పు మహిళల క్రికెట్‌ను ప్రొఫెషనల్‌గా మార్చింది. “ఇది వివక్షకు వ్యతిరేకంగా మొదటి అడుగు” జయ్ షా చెప్పారు. ఈ నిర్ణయం మిథాలీ రాజ్ లాంటి మాజీ కెప్టెన్ల ప్రశంసలు అందుకుంది. ఫలితంగా, మహిళల జట్టు ప్రదర్శన మెరుగుపడింది. 2025 వరల్డ్ కప్ విజయానికి దారి తీసింది. ఈ సమానత్వం మహిళల క్రికెట్‌కు కోట్ల రూపాయల మద్దతు తెచ్చిపెట్టింది. ఆటగాళ్లు ఆర్థికంగా స్వతంత్రులయ్యారు.

2. విమెన్స్ ప్రీమియర్ లీగ్-డబ్ల్యూపీఎల్‌కు మద్దతు

మోదీ ప్రభుత్వం డబ్ల్యూపీఎల్ అమలులో కీలకమైన పాత్రను పోషించింది. 2023లో బీసీసీఐ ప్రారంభించిన డబ్ల్యూపీఎల్‌కు ప్రభుత్వం పెద్ద పెట్టుబడులు, పన్ను రాయితీలు, మీడియా ప్రమోషన్ ఇప్పించింది. ఈ లీగ్ మహిళా క్రికెటర్లకు కోట్ల రూపాయల ఒప్పందాలు తెచ్చిపెట్టింది. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ వంటి ఆటగాళ్లు రూ. 3-4 కోట్లు సంపాదించారు. మోదీ ప్రభుత్వం “బేటీ బచావో, బేటీ పడావో” పథకం ద్వారా గ్రామీణ బాలికలకు క్రికెట్ శిక్షణ ఇచ్చింది. డబ్ల్యూపీఎల్ అకాడమీలు స్థాపించింది. ప్రభుత్వ మద్దతుతోనే 2025లో డబ్ల్యూపీఎల్-2026కు మరిన్ని ఫ్రాంచైజీలు, బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్ పెరిగాయి. ఇది మహిళల క్రికెట్‌ను భారీ జనాదరణ సాధించేలా చేసింది. రాధా యాదవ్, రేణుకా సింగ్ లాంటి గ్రామీణ ఆటగాళ్లు స్టార్లుగా మారారు.

3. వరల్డ్ కప్ విజేతలతో వ్యక్తిగత సమావేశాలు, ప్రశంసలు

మోదీ ప్రభుత్వం మహిళా క్రికెటర్లను జాతీయ హీరోలుగా చూస్తుంది. ప్రధాని మోదీ 2017 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత మొదటి సమావేశం నుండి, 2025లో మొదటి వరల్డ్ కప్ విజయం తర్వాత నవంబర్ 5న లోక్‌కల్యాణ్ మార్గ్ గృహంలో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో జట్టుతో సమావేశమయ్యారు. జట్టు ధైర్యాన్ని ప్రశంసించారు. “మీరు మూడు ఓటముల తర్వాత కమ్‌బ్యాక్ చేసి చరిత్ర సృష్టించారు” అని కొనియాడారు. ఆయన దీప్తి శర్మ ట్యాటూపై “హనుమాన్ జీ కా ట్యాటూ?” అని అడిగి, జట్టును నవ్వించారు. స్మృతి మంధానకు “థేల్” ఇచ్చి, అమన్‌జోత్ కౌర్ క్యాచ్‌ను ప్రశంసించారు. ఈ సమావేశం రెండు గంటలు జరిగింది. మోదీ మాటలు ఆటగాళ్లకు ప్రేరణగా మారాయి. నవంబర్ 6న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గృహంలో కూడా

మాతరం

బేటీలు ఆడితే దేశం గెలుస్తుంది

మోదీ ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల మహిళల క్రికెట్ భారతదేశంలో జనాదరణ సాధించింది. 2025 వరల్డ్ కప్ ఫైనల్‌కు 86,000 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. గ్రామీణ బాలికలు (శ్వేతా సెహ్రావత్) నుండి మధ్యతరగతి (స్మృతి మంధాన) వరకు అందరూ ప్రేరణ పొందారు. మోదీ చెప్పినట్టు "క్రికెట్ భారతదేశంలో జీవితం లాంటిది." ఈ ప్రోత్సాహం మహిళల సాధికారతకు చిహ్నం. "బేటీలు ఆడితే, దేశం గెలుస్తుంది." అనేది ముమ్మాటికి నిజం.

జట్టుకు గౌరవం దక్కింది. హర్మన్‌ప్రీత్ సంతకాలు చేసిన జెర్సీని బహూకరించింది. ఇచ్చింది. మోదీ ఎక్స్ (ట్విటర్)లో "స్పెక్టాక్యులర్ విన్" అని పోస్ట్ చేసి, జట్టును అభినందించారు.

4. ఫిట్ ఇండియా మూమెంట్, యువతకు ప్రోత్సాహం

మోదీ ప్రభుత్వం "ఫిట్ ఇండియా" మూమెంట్‌ను మహిళల క్రికెట్‌తో ముడిపెట్టింది. మోదీ వరల్డ్ కప్ విజేతలతో సమావేశంలో ఆటగాళ్లను "ఫిట్ ఇండియా మూమెంట్‌ను ప్రమోట్ చేయండి, ఊబకాయానికి వ్యతిరేకంగా పోరాడండి" అని కోరారు. స్కూళ్లకు వెళ్లి, బాలికలను క్రికెట్ ఆడేలా ప్రోత్సహించా లని జట్టుకు చెప్పారు. "మీరు యువతకు ఇన్‌స్పిరేషన్" అని అన్నారు. ఈ మూమెంట్ ద్వారా గ్రామీణ బాలికలకు క్రికెట్ అకాడమీలు, స్కాలర్‌షిప్‌లు వచ్చాయి. మోదీ 2017లో మిథాలీ రాజ్‌తో "ఓటమి నుంచి నేర్చుకోండి" అని చెప్పారు. 2025లో హర్మన్‌ప్రీత్‌తో తిరిగే అదే మాటలు అన్నారు. ఈ మాటలు ఆటగాళ్లకు మానసిక బలాన్ని ఇచ్చాయి.

5. ఇతర ప్రోత్సాహకాలు, భవిష్యత్ ప్రణాళికలు

మోదీ ప్రభుత్వం మహిళల క్రికెట్‌కు మౌలిక సదుపాయాలను పెంచింది. స్టేడియంలు, ట్రైనింగ్ సెంటర్లు నెలకొల్పింది. 2023 U-19 వరల్డ్ కప్ విజయానికి మద్దతు ఇచ్చి, యంగ్ టాలెంట్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించింది. 2025 వరల్డ్ కప్ విజయం తర్వాత బీసీసీఐ రూ.51 కోట్లు, ఐసీసీ రూ.39 కోట్లు రివార్డులు ప్రకటించాయి. భవిష్యత్తు ప్రణాళికల్లో డబ్ల్యూపీఎల్ విస్తరణ, మరిన్ని టెస్ట్ మ్యాచ్‌లు, మరిన్ని గ్రామీణ అకాడమీలు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం మహిళల స్పోర్ట్స్‌కు 2024-25లో రూ3,000 కోట్లు బడ్జెట్ కేటాయించింది. ★

లక్నో ఆటోలో పుట్టిన మహిళా క్రికెట్

1970ల ఆరంభంలో భారతదేశంలో మహిళల క్రికెట్ అనేది దాదాపు ఊహించని విషయం. పురుషుల క్రికెట్ ప్రధాన ప్రవంతిలో ఉండగా, మహిళలు ఆడే క్రికెట్‌కు ఎటువంటి గుర్తింపు లేదు, మద్దతు లేదు. అటువంటి సమయంలో లక్నో నగరంలో మహేంద్ర కుమార్ శర్మ అనే ఒక సాధారణ వ్యక్తి మహిళల క్రికెట్‌కు జీవం పోశారు. ఆయన ఒక ఉత్సాహవంతుడు, దార్శనికుడు, సంఘ సంస్కర్త. ఆయన చేసిన ప్రయత్నాలు భారత మహిళల క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయాయి.

మహేంద్ర కుమార్ శర్మ లక్నోలోని ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయనకు క్రికెట్ పట్ల గాఢమైన అభిమానం ఉండేది. కానీ ఆయన గమనించిన విషయం ఏమిటంటే, మహిళలు క్రికెట్ ఆడటానికి ఎటువంటి అవకాశాలు లేవు. సమాజంలో "అమ్మాయిలు క్రికెట్ ఆడతారు" అనే ఆలోచన కూడా లేదు. ఈ సవాలును ఎదుర్కొని, ఆయన 1973లో మహిళల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా-డబ్ల్యూసీఏఐను స్థాపించాలని నిర్ణయించుకున్నారు. కానీ ఆ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదు. అందుకు కావాల్సిన డబ్బు లేదు, మద్దతు లేదు, స్థలం లేదు. చివరకు ఆటగాళ్లు కూడా లేరు.

ఆయన మొదటి అడుగు ఆటగాళ్లను వెతకడం. ఆ వెదుకులాటలో లక్నోలోని పాఠశాలలు, కాలేజీలు, మహిళా సంఘాలతో పాటుగా ఇంటింటికి ఆయన తిరిగారు. "మీ అమ్మాయి క్రికెట్ ఆడాలనుకుంటుందా?" అని అడిగారు. చాలా మంది తల్లిదండ్రులు నవ్వారు. కొందరైతే కోప్పడ్డారు, "అమ్మాయిలు బయట ఆడటం ఏమిటి?" అని చిరాకుపడ్డారు కూడా. కానీ మహేంద్ర శర్మ వదలలేదు. ఆయన ఒక ఆటో రిక్షా తీసుకుని, దానిపై మైక్ అమర్చి, లక్నో రోడ్లపై తిరిగారు. "మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడండి, గెలవండి, చరిత్ర సృష్టించండి!" అని ఎలుగెత్తి చాటారు. ఆటో నుంచే కరపత్రాలు, ఫారాలు పంచారు. ఆ ఆటో రిక్షా లక్నోలో మహిళా క్రికెట్‌కు ఒక చిహ్నంగా మారింది.

మొత్తానికి ఆటగాళ్లు దొరికారు. కానీ వాళ్లతో క్రికెట్ ఆడించడానికి స్థలం కావాలి. లక్నోలోని కేడీ సింగ్ బాబు స్టేడియం, చౌక్ స్టేడియం వంటి మైదానాలు ఉన్నాయి కానీ వాటిని పురుషుల క్రికెట్‌కు మాత్రమే కేటాయించారు. అయినప్పటికీ మహేంద్ర శర్మ నిరాశచెందలేదు. అధికారులను కలిశారు. "మహిళలకు ఒక్క రోజు ఇవ్వండి" అని విజ్ఞప్తి చేశారు. చాలాసార్లు తిరస్కారాన్ని రుచి చూశారు. చివరకు, ఆయన స్వంత డబ్బు పెట్టి లక్నో శివార్లలో ఒక చిన్న మైదానాన్ని అద్దెకు తీసుకున్నారు. అక్కడ గడ్డి తొలగించారు. పిచ్ తయారు చేయించారు. కిట్‌లు,

అర్ధ శతాబ్దపు మేటి మహిళా క్రికెటర్లు

వైతాళికులు (1970లు-1980లు)

దయానా ఎడుల్జీ:

జననం: జనవరి 26, 1956, ముంబై.

పాత్ర: ఆల్-రౌండర్, స్పిన్ బౌలర్, కెప్టెన్

ఆరంగేట్రం: 1976లో వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్

రికార్డులు:

20 టెస్ట్‌లు, 34 ఓడీఐలు

టెస్ట్‌ల్లో 63 వికెట్లు (ఆ కాలంలో భారత మహిళల్లో అత్యధికం)

మొదటి మహిళా క్రికెటర్‌గా అర్జున అవార్డు (1983)

శాంతా రంగస్వామి:

జననం: జనవరి 1, 1954, చెన్నై.

పాత్ర: ఆల్-రౌండర్, మొదటి కెప్టెన్

ఆరంగేట్రం: 1976లో వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్

రికార్డులు:

మొదటి భారత మహిళా టెస్ట్ శతకం (న్యూజిలాండ్‌పై108 పరుగులు, 1977.)

16 టెస్ట్‌లు, 19 ఓడీఐలు

సంధ్య అగర్వాల్:

జననం: 1963, ఇండోర్

పాత్ర: ఓపెనర్ బ్యాట్స్‌వుమన్

రికార్డులు:

టెస్ట్‌లో ఇంగ్లండ్‌పై 190 పరుగులు (1986). ఆ కాలంలో వరల్డ్ రికార్డ్.

శుభాంగి కులకర్ణి:

జననం: 1958, పూణే

పాత్ర: లెగ్-స్పిన్ బౌలర్, కెప్టెన్

రికార్డులు:

19 టెస్ట్‌లు, 27 ఓడీఐలు

టెస్ట్‌లో 60 వికెట్లు

నీతూ డేవిడ్:

జననం: 1977, విజయవాడ

పాత్ర: స్లో లెఫ్ట్-ఆర్మ్ బౌలర్

రికార్డులు:

8/53 ఇంగ్లండ్‌పైన (1995). ఆ కాలంలో టెస్ట్ బౌలింగ్‌లో రికార్డ్

స్వర్ణ యుగం (1990లు - 2000లు)

మిథాలీ రాజ్:

జననం: డిసెంబర్ 3, 1982, జోధ్‌పూర్.

పాత్ర: రైట్-హ్యాండ్ బ్యాట్స్‌వుమన్, కెప్టెన్

ఆరంగేట్రం: 1999 ఓడీఐ × ఐర్లాండ్

రికార్డులు:

మహిళల ఓడీఐలో అత్యధిక పరుగులు (7,805)

12 టెస్ట్‌లు, 89 టీ20లు, 232 ఓడీఐలు

7 ఓడీఐ శతకాలు, 64 అర్ధశతకాలు

ఝులన్ గోస్వామి:

జననం: నవంబర్ 25, 1982, చకా (పశ్చిమ బెంగాల్).

పాత్ర: ఫాస్ట్ బౌలర్, కెప్టెన్

రికార్డులు:

మహిళల ఓడీఐలో అత్యధిక వికెట్లు (255)

12 టెస్ట్‌లు, 68 టీ20లు, 204 ఓడీఐలు

అంజుమ్ చోప్రా:

జననం: 1977, ఢిల్లీ

పాత్ర: ఓపెనర్, కామెంటేటర్

రికార్డులు: 12 టెస్ట్‌లు, 127 ఓడీఐలు

విశేషం: మొదటి మహిళా కామెంటేటర్.

నవతరం (2010లు - 2025)

హర్మన్‌ప్రీత్ కౌర్:

జననం: మార్చి 8, 1989, మోగా (పంజాబ్).

పాత్ర: ఆల్-రౌండర్, టీ20 కెప్టెన్

రికార్డులు:

బంతులు, స్టంపులు.. ఇలా ఆటకు అవసరమైన వాటిన్నింటిని ఆయన సేకరించారు. వాటిలో కొన్నింటిని దాతలు ఇస్తే.. మిగిలినవాటిని ఆయన సొంత డబ్బుతో కొన్నారు.

మొదటి టోర్నీకి నగలు తాకట్టు

మహేంద్ర కుమార్ శర్మ 1973-74లో మొదటి జాతీయ మహిళల క్రికెట్ టోర్నమెంట్‌ను లక్నోలో నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. కానీ దీనికి డబ్బు ఎక్కడ నుండి వస్తుంది? ఆయన అందుకోసమని లక్నోలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులను కలిసారు. "మహిళల క్రికెట్‌కు మద్దతు ఇవ్వండి, దీనికి ఎంతో భవిష్యత్తు ఉంది" అని వేడుకున్నారు. అందరూ ఆయన వేడుకోలును విన్నారు కానీ వారిలో చాలా కొద్దిమంది మాత్రమే సహాయం చేశారు. దాంతో ఆయన టోర్నీ నిర్వహణకు తన ఇంట్లో ఉన్న నగలు అమ్మారు.

అమ్మాయిల క్రికెట్ చూడ్డానికి రండి..!

శర్మ ఆధ్వర్యంలో టోర్నీకి రంగం సిద్ధమైంది. ఆయన దాని ప్రచారానికి మరోసారి ఆటోను ఎంచుకున్నారు. "కన్యాయోంకి క్రికెట్ హోగీ.. జరూర్ ఆయియే"- అమ్మాయిలు క్రికెట్ ఆడుతున్నారు.. చూడ్డానికి తప్పకుండా రండి అంటూ లక్నో పురవీధుల్లో ఆటోలో ప్రయాణిస్తూ మైక్ ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ టోర్నీలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బాంబే, ఢిల్లీ వంటి జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో దయానా ఎడుల్జీ, శాంతా రంగస్వామి లాంటి భావి స్టార్ క్రికెటర్లు ఆడారు.

ఆటోల్లో ఆటగాళ్లు, అంపైర్లు

ఆయన టోర్నీ నిర్వహణలో ఆటగాళ్లకు భోజనం, బస, యూనిఫాం వంటి ప్రతి విషయాన్ని దగ్గరుండి చూసుకున్నారు. అంపైర్లు, స్కోరర్లు. ఆటగాళ్లు గ్రౌండ్‌కు రావడానికి ఆటోలు ఏర్పాటు చేశాడు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. రేడియోలో ప్రసారం చేయించారు. టోర్నీ విజయవంతమైంది. మహిళల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా-డబ్ల్యూసీఏఐ స్థాపితమైంది. హమీదా హబీబులా మొదటి అధ్యక్షురాలు అయ్యారు. మహేంద్ర శర్మ కార్యదర్శిగా కొనసాగారు.

వెస్టిండీస్‌తో మొదటి సిరీస్‌కు పునాది

మహేంద్ర కుమార్ శర్మ మొదటి జాతీయ మహిళల క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయడంతో ఆగిపోలేదు. 1975లో ఆస్ట్రేలియా అండర్-25 జట్టుతో మొదటి అంతర్జాతీయ మ్యాచ్‌లు పూణే, ఢిల్లీ, కలకత్తాలో జరగడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1976లో వెస్ట్ ఇండీస్‌తో మొదటి టెస్ట్ సిరీస్‌కు ఆయన పునాది వేశారు. లక్నోలో మహిళల క్రికెట్ అకాడమీలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఆటగాళ్లను గుర్తించారు. వారికి ఉచిత శిక్షణ ఇచ్చారు.



మహేంద్ర కుమార్ శర్మ

2017 వరల్డ్ కప్ సెమీస్‌లో 171 పరుగులు (115 బంతులు). ఓడీఐ లో అత్యధిక స్కోర్ (మహిళలు)

విశేషం: 2025 వరల్డ్ కప్ గెలిచిన జట్టు కెప్టెన్.

స్మృతి మంధాన:

జననం: జులై 18, 1996, ముంబై.

పాత్ర: ఓపెనర్

రికార్డులు:

మహిళల ఓడీఐలో అత్యంత వేగవంతంగా శతకం (67 బంతులు)

జెమిమా రోడ్రిగ్స్:

జననం: సెప్టెంబర్ 5, 2000, ముంబై.

పాత్ర: మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌వుమన్

విశేషం: 16 ఏళ్లకే ఆరంగేట్రం. గాయకురాలు కూడా.

శఫాలీ వర్మ:

జననం: జనవరి 28, 2004, రోహ్‌తక్.

పాత్ర: అగ్రెసివ్ ఓపెనర్

రికార్డులు: మహిళల టీ20లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచురీ.

రాధా యాదవ్:

జననం: 2000, ముంబై (గ్రామీణ నేపథ్యం)

పాత్ర: స్లో లెఫ్ట్-ఆర్మ్ స్పిన్నర్

రేణుకా సింగ్:

జననం: 1996, హిమాచల్ ప్రదేశ్

పాత్ర: ఫాస్ట్ బౌలర్

విశేషం: 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్. ★

మహిళా క్రికెటర్లకు తండ్రి

మహేంద్ర శర్మ జీవన ప్రస్థానం అసాధారణమైనది. ఆయనకు ఎటువంటి ప్రభుత్వ మద్దతు లేదు. పెద్ద స్పాన్సర్లు లేరు. కానీ ఆయన దృఢ సంకల్పం, ఆటో రిక్షా మైక్, ఇంటి నగలు, రాత్రింబవళ్లు పని ఇవన్నీ కలిసి భారత మహిళా క్రికెట్‌కు జన్మనిచ్చాయి. ఆయన లక్ష్యాన్ని మహిళా క్రికెట్ గడ్డగా మార్చారు. శాంతా రంగస్వామి, డయానా ఎడుల్జీ వంటి ఆటగాళ్లు ఆయనను "మా తండ్రి" అని పిలుచుకున్నారు. ఈ రోజు భారత మహిళల జట్టు వరల్డ్ కప్ గెలిచినప్పటికీ, ఆ ప్రయాణం మహేంద్ర కుమార్ శర్మ ఆటో రిక్షా నుండి ప్రారంభమైంది. ఆయన పేరు మహిళా క్రికెట్ చరిత్ర పుటల్లో బంగారు అక్షరాలతో లిఖితమైంది. ఒక సాధారణ మనిషి కన్న అసాధారణమైన కల నేడు ప్రపంచ మహిళా క్రికెట్ వేదికపై విజయాలను నమోదు చేస్తోంది. కానీ మహేంద్ర కుమార్ శర్మ భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్‌ను గెలుచుకునే మహత్తరమైన ఘట్టాన్ని చూడకుండానే, సరిగ్గా ఆ అద్భుతం ఆవిష్కృతం కావడానికి మూడేళ్ల ముందు నవంబర్ 8, 2022న పూణేలో తన 75వ ఏట కన్నుమూశారు.

– జాగృతి డెస్క్

ఆంధ్రప్రదేశ్

జాతీయ జలాల్లోకి మత్స్యకారులకు అనుమతి

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మత్స్యకారులు ప్రాదేశిక జలాలు దాటి ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్)లోకి వెళ్లి చేపలను వేటాడేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై మత్స్యకారులు డీప్ సీ ఫిషింగ్ చేసి బోట్ల నిండా చేపలను వేటాడి తెచ్చుకోవచ్చు. అలాగే మత్స్య ఉత్పత్తులపై విధించే జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించింది. ఆక్వాసాగుకు ప్రోత్సాహం కల్పిస్తూ కూడా జీఎస్టీని భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మత్స్సకారులకు భారీ ఉపశమనంతో పాటు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

విశాఖపట్నం జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం, 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 1.15 లక్షల మత్స్యకార కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. దాదాపు 2,500 బోట్లు విశాఖ ఫిషింగ్ హార్బరు కేంద్రంగా సముద్రంలో వేటకు వెళుతుంటారు. మత్స్యకార కుటుంబాలకు చెందినవారు ఒక్కో బోటుకు ఆరు నుంచి పది మంది వరకు వేటకు సముద్రంలోకి వెళుతుంటారు. దొరికిన వేటను అయిదు నుంచి పది రోజుల వరకు సముద్రంలో ఉంటారు. మత్స్యకారులు తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరం వరకే వేటకు వెళ్లాలనేది ఇప్పటివరకూ ఉన్న నిబంధన. ఇవి రాష్ట్ర జలాలు. వీటినే ప్రాదేశిక జలాలు అంటారు. ప్రతి రాష్ట్రానికి ఈ నిబంధన ఉంది. 12 నాటికల్ మైళ్ల దాటి తీరం నుంచి 200 నాటికల్ మైళ్ల వరకు జాతీయ జలాలు. దీనిని ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఈఈజెడ్)గా పేర్కొంటారు. ఈ జలాల్లోకి ప్రవేశించి చేపలను

వేటాడాలంటే ప్రత్యేకంగా కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలి. టూనా చేపలను వేటాడడానికి ఉపయోగించే లాంగ్ లైనర్లకు ఇలాంటి అనుమతులు ఇచ్చేవారు. కొంతమంది అత్యధిక సామర్థ్యం కలిగిన విదేశీ తయారీ బోట్లను తీసుకువచ్చి, వాటికి ఇండియన్ రిజిస్ట్రేషన్ చేయించి లైసెన్స్‌లు తీసుకునేవారు. వాటితో పోటీ పడలేక భారతీయ బోట్లు వెనుకపడేవి. దీనిపై విమర్శలు రావడంతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా లైసెన్స్‌లు ఇవ్వడం మానేసింది.

కత్తిమీద సాముగా వేట

తీరం వెంబడి పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కావడం, అవి కాలుష్య వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెట్టడం వల్ల తీరాన్ని ఆనుకొని ఉన్న ప్రాదేశిక జలాల్లో చేపల లభ్యత తగ్గిపోయింది. దాంతో మత్స్యకారులు అనధికారికంగా జాతీయ జలాల్లోకి వెళ్లి వేటాడుతున్నారు. కొన్నిసార్లు కోస్టుగార్డుకు దొరికి పోతున్నారు. ఒక్కోసారి చేపలను వెదుక్కుంటూ శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా వెళ్లిపోతున్నారు. వెనక్కి తీసుకురావడం కత్తిమీద సాముగా మారుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ జలాల్లో 200 నాటికల్ మైళ్ల వరకు ఎవరైనా వేట చేసుకోవచ్చునంటూ వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో డీప్ సీ ఫిషింగ్‌కు అవకాశం లభించింది.

జాగ్రత్తలు తప్పనిసరి

కేంద్రం ఉత్తర్వులు మత్స్యకారులకు పెద్ద వరం. అయితే వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ట్రాన్స్ పాండర్‌ను వేట సమయంలో ఆన్ చేసి ఉంచాలి. దానివల్ల పరిధి దాటి అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లకుండా చూసుకోవచ్చు. అదేవిధంగా జీపీఎస్ ఉంచుకోవాలి. లైఫ్ జాకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్ విషర్లు బోటులో పెట్టుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే మంచి వేటతో క్షేమంగా తీరానికి చేరుకోవచ్చు.

మత్స్యరంగంలో జీఎస్టీ మినహాయింపులు

వస్తు సేవా పన్ను (జీఎస్టీ) తాజా సవరణల ద్వారా మత్స్యరంగానికి ప్రోత్సాహం లభించింది. నిర్వహణ వ్యయం తగ్గించడానికి, దేశీయ, ఎగుమతి మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచడానికి, మిలియన్ల మంది మత్స్యకార రైతులకు, జీవనాధారం కోసం చేపల వేట, ఆక్వాకల్చర్‌పై ఆధారపడిన వారికి నేరుగా లబ్ధిని అందించడానికి మత్స్యరంగంలో పన్ను రేటు హేతుబద్ధీకరించింది.

సవరించిన విధానం ప్రకారం...

చేప నూనెలు, చేప ఉత్పత్తులు, సిద్ధం చేసిన లేదా నిల్వ చేసిన చేప, రొయ్య ఉత్పత్తులపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గింది. తద్వారా దేశీయ వినియోగదారులకు విలువ జోడించిన సముద్ర ఆహార ఉత్పత్తులు సరసమైన ధరలకే లభిస్తాయి.అలాగే భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో పోటీతత్వం పెరుగుతుంది. ఆక్వాసాగు, హేచరీలకు అవసరమైన డీజిల్ ఇంజిన్లు, పంపులు, ఎయిరేటర్లు, స్ప్రింక్లర్లపై 12 నుంచి 18 శాతానికి బదులుగా 5 శాతం మాత్రమే జీఎస్టీ వర్తిస్తుంది. ఫలితంగా, మత్స్య రైతులకు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. చెరువు, నీటి నాణ్యత నిర్వహణకు ఉపయోగించే అమ్మోనియా లాంటి కీలకమైన రసాయనాలు, సూక్ష్మపోషకాలపై సైతం 5 శాతం మాత్రమే పన్ను ఉంటుంది. గతంలో ఇది 12 నుంచి 18 శాతంగా ఉండేది. దీనివల్ల దాణా, చెరువు, సాగు నిర్వహణల వ్యయం తగ్గుతుంది. నిల్వ చేసిన చేపలు, రొయ్యలు, నత్తలపై తగ్గిన జీఎస్టీ.. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సముద్ర ఆహార ఎగుమతులను వృద్ధి చేస్తుంది. అదే సమయంలో దేశీయంగా సురక్షితమైన, ఆరోగ్యకరమైన విధానంలో శుద్ధి చేసిన సముద్ర ఆహార వినియోగాన్ని సైతం పెంచుతుంది.

ఫిషింగ్ రాడ్లు, ఉపకరణాలు, ల్యాండింగ్ నెట్లు, బటర్ ఫ్లై నెట్లు, ఇతర సామగ్రిపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గడం వల్ల రిక్రియేషనల్/స్పోర్ట్ ఫిషింగ్, చిన్న స్థాయిలో ఆక్వా సాగు చేసే, సహజ జలాల్లో చేపలు పట్టే రైతులకు లబ్ధి చేకూరుతుంది. దీనివల్ల ఈ రంగంలో అవసరమైన పరికరాలు చౌకగా లభిస్తాయి, పెట్టుబడి ఖర్చు తగ్గి, జీవనోపాధికి తోడ్పాటు లభిస్తుంది. ఆహార, వ్యవసాయ శుద్ధి సేవలపై విధించే జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో ప్రాసెసింగ్ యూనిట్లకు సైతం ఈ నిర్ణయం ఉపశమనం అందిస్తుంది. సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయడానికి, పర్యావరణ హిత పద్ధతిలో చెరువు నిర్వహణకు అవసరమైన కంపోస్టింగ్ యంత్రాలపై ఇప్పుడు 5 శాతం పన్ను మాత్రమే విధిస్తారు. ఇది సుస్థిరమైన ఆక్వా సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది.

ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఒకటిగా భారతీయ మత్స్య, ఆక్వా సాగు రంగం ఆవిర్భవించింది. అలాగే జాతీయ ఆహార, పోషక భద్రత, రైతుల ఆదాయానికి, గ్రామీణ జీవనోపాధికి, ఎగుమతులకు గణనీయంగా తోడ్పడుతోంది. ప్రస్తుతం 3 కోట్ల మందికి పైగా ప్రజల జీవనోపాధికి తోడ్పాటు నందిస్తూ 195 లక్షల టన్నుల (2024-25) ఉత్పత్తితో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా భారత్‌ను ఈ రంగం నిలబెట్టింది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద రొయ్యల ఎగుమతిదారు. 2023-24లో సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు రూ. 60,000 కోట్లను దాటాయి. ఫలితంగా.. విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తూ.. దేశ సముద్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి.

ఆర్థిక భారాన్ని తగ్గించడం ద్వారా మత్స్య రైతులు, ఆక్వా రైతులు, మత్స్యకారులు, మహిళా స్వయం సహాయక బృందాలు, సహకార సంఘాలకు నేరుగా లబ్ధి చేకూర్చడంతో పాటు.. గ్రామీణ జీవనోపాధిని ఈ సంస్కరణలు పెంపొందిస్తాయి. సవరించిన జీఎస్టీ రేట్లు 2025, సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చాయి. భారతీయ మత్స్య రంగాన్ని మరింత ఉత్పాదకంగా, పోటీతత్వంతో, స్థిరంగా మార్చే దిశగా వేసిన ముఖ్యమైన అడుగును ఈ నిర్ణయాలు సూచిస్తాయి. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా సముద్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయి.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

INTO YOUR LIFE, WE BRING LIGHT, WARMTH, & STRENGTH.

INTO YOUR LIFE, WE BRING SURYA ROSHNI.

Surya Roshni is the trusted companion bringing light, warmth, and care to every moment.
From purity in every sip to safe spaces, we bring innovation and reliability into your life.
Let's brighten up your world together!

Consumer Lighting | Steel & PVC Pipes | Fans | Appliances | Professional Lighting

I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY

SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya | surya_roshni | surya.roshni | surya-roshni

Email: info@surya.in Tel.: +91-11-47108000

ద్వారసముద్ర పట్టణం.. హోయసల రాజధాని..

బల్లాలదేవుని మంత్రాంగ మందిరం. బల్లాల దేవుడుది నిండైన విగ్రహం. బలిష్టమైన శరీరం. ముఖం కూడా కరుగ్గా దృఢంగా కనిపిస్తోంది. ప్రత్యేకంగా కనిపించే నాసిక. పైన పెద్ద పెద్ద కనుదోయి. వాటితో వాత్సల్యం కురిపించగలడు. ఆగ్రహాన్ని ప్రకటించగలడు. వాత్సల్యమైనా ఆగ్రహమయినా ఏది ఎంతవరకు ప్రకటించాలో తెలిసిన మహా జాణ.

ఇప్పుడాయన ముఖం ముప్పిరిగొన్న విశేష ఆనంద, సంతోష, వాత్సల్యాల సందోహంతో పులకించిపోతోంది.

కారణం– దేవగిరి కారాగారాల నుండి దాదాపు వందమంది హోయసల బందీలను క్షేమంగా దేవగిరి కోట దాటించి కాకతీయ బందీలలో పాటు హోయసల బందీల ఆరోగ్యాలను కూడా బాగుచేసి ద్వారసముద్రం తీసుకు వచ్చి తనకు అప్పగించడం.

ఆయన ఈ సంగతి విని ముందు నిజమా కలా అని గందరగోళమైపోయాడు.

తన ముందు నిలబెట్టిన తన వీరులను చూసుకుని పులకాంకితుడయ్యాడు.

వారిని తోడ్కొని వచ్చిన కాకతీయ మహాసేనాని రేచర్ల రుద్రయను, మహాప్రధాని గంగాధరుని.. ఒకరో ఇద్దరో కాదు వెయ్యిమంది కాకతీయ బందీలను, వందమంది హోయసల బందీలను క్షేమంగా బయటకు తెచ్చిన దళం నిర్వాహకుడు మందడి కాటయను.. సంభ్రమాశ్చర్యాల మధ్య గాఢంగా హత్తుకుని వారికీ భూరి బహుమతులను ప్రకటించి పరవశించాడు భల్లాలుడు.

"గొప్ప ఉదంతం ఇది. ఇలా గతంలో జరిగినట్లు వినలేదు గంగాధరా! రుద్రయ వీరవిక్రమ విన్యాసాలు నాకు కరతలామలకమే గాని.. ఇది.. ఇది.."

ఆయన సంతోషాతిరేకాలలో అందరూ పాలు పంచుకున్నట్లు నవ్వుతూ ఆయనను మరింత సంతోషపెట్టారు.

ఆ సమావేశంలో హోయసల సంధివిగ్రహి కన్నడదాసు, కాకతీయ సందివిగ్రహి పాపయ భట్టారకుడు కూడా ఉన్నారు. అంతా ఈ సంతోష సమయాన్ని పండుగలా జరుపుకున్నారు. భల్లాలుడు విందు ఏర్పాటు చేశాడు. గతంలో కాకతీయ మహావీరులు రుద్రదేవుడు, మహాదేవుడు, గంగాధరుడు, రేచర్ల రుద్రయ లతో తనకున్న సాన్నిహిత్యం.. వారు పరస్పరం చేసుకున్న సహాయ సహకారాలు చెబుతూనే ఉన్నాడు. అదే సమయంలో రేచర్ల రుద్రయ, గంగాధరుని ముఖంలో కనిపిస్తున్న విషాద వీచికలను గమనిస్తూనే ఉన్నాడు.

"గంగాధరా.. ఇంతటి సంతోష సమయంలో ఏవిటి నీ ముఖంలో ఆ విషాదం?"

"ఏముంది మహారాజా. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది కదా.." అన్నాడు శోక వదనంతో.

"సర్వకాల సర్వావస్థలలోనూ మీకు అండదండగా ఈ భల్లాలుడున్నాడు.." భుజం తడుతూ "చెప్పు.. ఏవిటి అసలు సంగతి?"

రుద్రయ కనుసైగ చేయగా కాకతీయ సంధివిగ్రహి పాపయ భట్టారకుడు లేచి నిలబడి, "మా యువరాజా వారు గణపతిదేవుల వారు ఇంకా దేవగిరి కారాగారంలోనే ఉన్నారు మహారాజా.. అదే అసలు చింత.."

భల్లాలుడు తెల్లబోయాడు. "అదేమి? మెరుపు దాడి చేసి వెయ్యిన్నూటమందిని కోట దాటించిన మందడి.. యువరాజు ఒక్కడిని తీసుకు రాలేకపోయారా.. విచిత్రంగా ఉందే?.."

రుద్రయ అన్నాడు, "వాస్తవం అదే ప్రభూ! దాడి విజయవంతమే కాని ప్రధాన లక్ష్యం యువరాజును రక్షించడం. కాని.. ప్చ్."

అవమానంగా తలవంచుకున్నాడు మందడి కాటయ.

పూర్తిగా అర్థమైంది భల్లాలదేవునికి. భోజన పళ్లెరాన్ని దూరంగా తోసి చివ్వున లేచాడు.

"ఇక దేవగిరి మీద మరొక యుద్ధమే. ఇప్పటికే ఓ సైనిక పటాలాన్ని దేవగిరి హద్దుల్లో ఉంచాను, మీ కోసమే. ఇక ఉపేక్షించలేను. మెరుపుదాడి ఇలా విఫలం అయ్యాక ఇక మనం చేయగలిగింది సరాసరి యుద్ధమే.."

ఆయన ఉద్రేకం చూసి కాకతీయ బృందం కంగారుపడింది. గంగాధరుడు లేచి, "సంతోషం మహారాజా. తమరి కృపాకటాక్ష వీక్షణలపై మాకు ఎప్పుడు నమ్మకమే. కానీ కానీ మా యువరాజు.. అక్కడ బందీగా ఉన్నాడు. మనం ఏమాత్రం తొందరపడినా.."

చప్పగా చల్లారిపోయాడు భల్లాలుడు. గాబరాగా అన్నాడు.

"ఔనౌను. ఆ జైత్రపాలుడు తిక్కమనిషి. వాడి తిక్క నిర్ణయాలు మన సంధివిగ్రహీలకు తెలిసే ఉంటుంది. ఏమంటావ్ పాపయా?!" అన్నాడు కాకతీయ సంధివిగ్రహితో.

"లెస్స పలికితిరి మహారాజా. ఆయన తిక్క నిర్ణయాల వల్ల అక్కడ ఎన్నో అనర్థాలు జరుతున్నాయని విన్నాను."

అతనితో ఏకీభవించాడు కన్నడదాసు, హోయసల సంధివిగ్రహి.

"అబ్బో.. ఆయన తిక్క మాకు అనుభవమే. సరిహద్దు గ్రామాలను కల్లోలితం చేస్తున్నాడు. అందుకే అక్కడ సైన్యాన్ని నిరంతరం నిలిపి ఉంచుతున్నారు మహారాజులు. వీ ఒకోసం మరిన్ని పటాలాలను సిద్ధం

గణపతి దేవుడు



'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

చేస్తున్నారు భల్లాలదేవులు..”

భల్లాలుడు వెంటనే, “మరి రెండు సైనిక పటాలాలను పంపుదాం దాసూ. ఏమంటారు రుద్రయా..?”

రుద్రయ లేచి చేతులు జోడించి, “అంతకంటే కావలసింది ఏముంది ప్రభూ! అయితే మన ప్రయత్నాలు దేవగిరిని గందరగోళ పరచి మా యువ రాజులవారికి ఏదైనా హానీ తలపెడితే మాత్రం..”

భల్లాలుడు కూర్చున్నాక పరిచారికలు భోజన పళ్లెరం ఆయన దగ్గర ఉంచగా లాక్కుని తింటూ.. ఆలోచిస్తో అన్నాడు. “ఆలోచించిన కొద్దీ ఇది చాలా సున్నితమైన సమస్యగా మారుతోంది గంగాధరా!”

“మీరే ఈ సున్నితమైన చిక్కుముడిని విడదీయాలి ప్రభూ! ఇప్పుడు మేము సంధి కోసం పాపయను పంపినా, వాడు అంగీకరించడు. మనం దారుణంగా నష్టపరిచామని కోపంతో రగిలిపోతున్నాడని గూఢచారుల వార్త.”

భల్లాలుడు సాలోచనగా తింటూ.. అందరిని ముందు భోజనం కానీయవలసినదిగా చేయి ఊపాడు.

భోజనాలు పూర్తయ్యాయి. పరిచారిక తాంబూల పళ్లెరంతో రాగా భల్లాలుడు అందరికి స్వయంగా తాంబూలం అందించాడు.

“నరే.. నరే. అతిథిగృహంలో విశ్రాంతి తీసుకోండి. ఇది జటిల సమస్య. ముళ్లకంపపై పడ్డ మన వస్త్రాన్ని తెలివిగా తీసుకోవాలి. బహుశా సైనిక ప్రయోగం మీరన్నట్లు వికటించవచ్చు. ఆలోచిద్దాం..”

అందరూ భల్లాలునికి నమస్కరించి కదిలారు. ఆయన భోజనాలయం నుండి విశ్రాంతి మందిరానికి వెళ్లాడు.

హోయసల సంధీవిగ్రహి కన్నడదాసు అందరిని సగౌరవంగా సాగనంపి తిరిగి విశ్రాంతి మందిరానికి వచ్చాడు. ఊయల పల్యంకంపై విశ్రాంతిగా పరున్న భల్లాలుడు సాలోచనగా అన్నాడు.

“దాసూ ఆ అతిథిని లోపలోకి రమ్మనండి..”

ప్రక్క గదిలో ఉండి అన్ని వింటున్న ఆ అతిథి వచ్చి భల్లాలునికి నమస్కరించాడు.

ఆ అతిథి చాముండశర్మ.. దేవగిరి సంధివిగ్రహి.

* * *

అందరూ ఊహించినట్లే కోపంతో అవమానంతో రగిలిపోతున్నాడు జైత్రపాలుడు.

కాకతీయం అనే మెరపుదాడి సఫలం అయిందని అటు కాకతీయ రాజ్యం.. విఫలమయ్యిందని ఇటు దేవగిరి రాజ్యం.. ఇద్దరూ ప్రకటించలేదు.

ఆ కాళరాత్రి తెల్లవారే సమయానికి కాకతీయ మెరపుదళం అదృశ్యమయింది. నలభై రెండు కారాగారాలలోని యుద్ధ బందీలను ఒక్కరినీ వదలకుండా తీసుకుపోయారు. కాని యువరాజు గణపతిదేవుడు దేవగిరికోటలోనే బందీగా క్షేమంగా ఉన్నాడు. కోష్ఠాగారం వద్ద స్పృహ లేకుండా పడి ఉన్న గణపతిదేవుని గుర్తించి తెచ్చి కారాగారంలో ఉంచారు.

దేవగిరి కోటంతా వీనుగుల పెంటలా స్మశానంలా మిగిలింది. అటు కాకతీయుల మెరపు దాడి.. అదే సమయంలో చెలరేగిన అగ్నిప్రమాదం వల్ల చాలామంది చనిపోయారు. కాకతీయ మెరుపుదళ వీరులవల్ల చాలామంది దేవగిరి సైనికులు, భటులు, గూఢచారులు చనిపోయారు. ఎన్నో భవనాలు భస్మీపటలమయ్యాయి.

కానీ మెరుపుదళం గణపతిదేవుడిని దక్కించుకోలేకపోవడం దేవగిరికి దక్కిన ఓ ఊరట.

సమస్య ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉంది.

ఇంత గొప్ప ప్రయత్నం జరిగినా కాకతీయ అభిషిక్త యువరాజు దేవగిరి కారాగారంలోనే బందీగా ఉన్నాడు.

అక్కడ కాకతీయులు స్కంధావారం వదలి వెళ్లడంలేదు. ఇటు హోయసల భల్లాలుడు పటాలం తర్వాత పటాలం పంపిస్తున్నాడు.

ఇద్దరికి బుద్ధిచెప్పాలంటే గణపతిదేవుడిని చంపి శవాన్ని అనుమకొండకు పంపాలి.

గట్టి నిర్ణయానికి వచ్చాడు మహారాజు జైత్రపాలుడు.

“మహాప్రధానిని పిలవండి..” పిచ్చికేక పెట్టాడు.

వెంటనే మహాప్రధాని బసవరసుడు రావడం.. ఆ వెంటనే అత్యున్నత స్థాయి న్యాయ నిపుణుల బృందాన్ని సమావేశ పరచడం జరిగాయి.

విషయం– బందీగా పట్టుబడిన కాకతీయ యువరాజు కోసం దేవగిరి మీద దొంగదాడి జరిగింది. దీనికి శిక్షేమిటి?

చివరికి గణపతికి ఉరిశిక్ష విధించాలని న్యాయ నిపుణులు ఇచ్చారు.

శిక్ష అమలుకు సమయాన్ని కూడా నిర్ణయించారు. వంటి మీద ఆనాటి రాత్రి నుంచి అదే కోపీనం. పిచ్చివాడిలా శూన్యంలోకి చూస్తూ నిర్వికారంగా భావ రహితంగా. కారాగారంలో కూడా అంతే. దేనిమీద ఆసక్తి లేదు. పెడితే తింటాడు లేకుంటే ఉంటాడు. ఎవ్వరితోనూ మాట్లాడడు. నవ్వడు. తలెత్తి చూడడు. ఏమీ చెప్పడు. అదొక నిర్వకల్ప సమాధి..

ప్రధాన న్యాయాధికారి చెరసాలకు వెళ్లి అతనికి ఉరిశిక్ష విధించినట్లు చెప్పాడు.

“ఇప్పటికి పదవనాడు చైత్రమాసం ఏకాదశి సప్తమి ఉదయం నీకు ఉరి శిక్ష అమలు చేయాలని, అదే నీ తప్పులకు రాజధర్మం ప్రకారం తగినశిక్ష అని న్యాయమండలి నిర్ణయించింది.”

ఏమీ మాట్లాడకుండా విన్నాడు. న్యాయాధీశులు వెళ్లిపోయారు. మార్పు ఏమీలేదు. నేలపై మెల్లగా వాలాడు. కళ్లు మూసుకున్నాడు. అదే సమాధిస్థితి.

ఆరోజు రానే వచ్చింది. ఆ ఉదయం ఉరి కంబానికి గొలుసులతో బంధించిన గణపతిని తీసుకువచ్చారు. అప్పటికే ఐదుగురు న్యాయాధీశులు తలారి, కోట దండనాయకుడు, సైన్యాధిపతి జెల్లన కాకుండా మరి కొందరు భటులు తదితరులున్నారు.

అప్పుడు మహారాజు జైత్రపాలుడు వస్తున్నట్లు ప్రతీహారి ప్రకటించగా ఆయన లోపలికి ప్రవేశించాడు. అందరూ లేచి వినమ్రంగా నమస్కరించగా

మత్తి భానుమూర్తి

జైతుగి ప్రత్యేక ఆసనంలో కూర్చున్నాడు.

సాధారణంగా ఇలాంటి ఉరి కార్యక్రమం దండనాయకుని నేతృత్వంలో జరుగుతుంది. కానీ మహాప్రధాని, సర్వసైన్యాధ్యక్షుడు, ఇతర ప్రధానులు తదితరులు హాజరవడం తక్కువ. సాక్షాత్తూ మహారాజే హాజరయిన సంఘటన ఇదొక్కటే. దాంతో అందరూ అప్రమత్తంగా చురుగ్గా అక్కడి ఏర్పాట్లు చేశారు.

ఓ ఇనుపచట్రంతో చేసిన కంబానికి ఉరి తాడు వ్రేలాడుతోంది. దాన్ని శుభ్రపరచి అమలు సమయంలో ఆటంకాలు ఏర్పడకుండా అన్ని సరిగా ఉన్నట్లు భటులు, తలారి ముందుకు వచ్చి సరి చూసుకున్నాక.. అందరూ మహారాజు వైపు చూశారు.

భటులు చేస్తున్నవన్ని పళ్ల బిగివునా కళ్లలో పొంగే వికృత ఆనందంతో మొత్తంగా కాకతీయ సామ్రాజ్యాన్నే సర్వనాశనం చేసి భూస్థాపితం చేస్తున్నట్లు భావిస్తున్న జైత్రపాలుడు లేచి నిలబడి గణపతిని చూస్తూ వ్యంగంగా అన్నాడు.

"నీ చావుకు కొన్ని లిప్తలకాలమే మిగిలి ఉంది. చెప్పు.. ఆఖరికోరిక ఏమైనా ఉంటే చెప్పు!"

గణపతి కనీసం కన్నెత్తలేదు.

ఆయన మరింత పైశాచికానందం పొందుతున్నట్లు అటూ ఇటూ తిరుగుతూ, "చెప్పవయ్యా..! ఎవన్నా తినాలనుందా?.." అన్నాడు నవ్వుతూ. దాంతో అక్కడున్న యావన్మంది పెద్ద పెట్టున నవ్వారు. నవ్వుతూనే ఉన్నారు.

గణపతిదేవు గొంతు సవరించుకోవడం.. వల్ల నవ్వులకు ఆనకట్ట పడింది.

అందరూ విభ్రమంగా అతని వంక చూశారు. కళ్లు మూసుకునే గొంతు సవరించుకుని అన్నాడు చిన్నగా.

"మా పెదనాన్నగారి ఆశయం తీర్చాలని ఉంది."

అందరూ సాలోచనగా.. అర్థం అయికాకుండా ఉందన్నట్లు చూశారు.

అత్యంత రమణీయంగా అలంకరించిన వివాహ వేదిక. దానిపై ఉజ్జ్వలంగా మండుతున్న అగ్నిహోత్రం. అన్ని ప్రక్కలా కూర్చుని ఏకకంఠంతో వేదగానం చేస్తోన్న వేదవేదాంగ పారంగతులు, మహా రుషులు. బ్రాహ్మణ వివాహవేడుక కావటాన అక్కడ అట్టహాసాలకన్నా వైదిక సంప్రదాయమే ప్రధానంగా కనిపిస్తున్నది.

జైత్రపాలుడు కూడా సందిగ్ధంగా చూస్తూ అడిగాడు మళ్లీ. "మళ్లీ చెప్పు."

ఈసారి గణపతి కంఠం పెద్దదయ్యింది. "పెదనాన్న రుద్రదేవుల కోరిక. అది తీర్చాలి.."

"ఏవిటి.. వాడి కోరిక??"

"తెలుగు సామ్రాజ్య స్థాపన.."

లిప్తకాలం నిశ్శబ్దం. క్షణకాలంలో గిలగిల గింజుకుని చావబోయే వీడు తెలుగు సామ్రాజ్యాన్ని స్థాపిస్తాడా..

పిచ్చెక్కినట్లుంది వీడికి అనుకున్నాడు. అప్పుడే బయట కలకలం..

"క్షమించండి మహారాజా. మహారాణి వారు వేంచేయుచున్నారు."

అంతఃపుర కంచుకి, ప్రతిహారీ, భటులు ఉరిమండప ద్వారం వద్దకు వచ్చేశారు.

జైత్రపాలుడు చిరాగ్గా చూసి చివ్వున కదిలి బయటకు వెళ్లాడు.

అందరూ భ్రాన్పడిపోయి చూస్తుండిపోయారు. ఉరి మండపానికి మహారాజు రావడమే విచిత్రమైతే.. మహారాణి గారు రావడం..?? ఏమి జరుగుతోంది..? ఏమి జరగబోతోంది??

ఒకటి.. రెండు.. మూడు.. నాలుగు.. ఐదు.. ఘడియలు.

ఉరి కంబం దగ్గర అంతా నిశ్శబ్దం. మహారాజు జైత్రపాలుడు లోపలికి రాలేదు. అంతఃపుర ప్రతీహారీ లోపలికి వచ్చి దండనాయకునికి నమస్కరించి, "ప్రస్తుతానికి ఉరిశిక్ష వాయిదా వేయడమైనది దేవరా! కాకతీయ యువరాజును గతంలో ఉంచిన అంతఃపుర కారాగారంలో ఉంచాలని మహారాజుల నిర్ణయం."

* * *

దేవగిరి పట్టణం, బ్రాహ్మణవీధి

మరో నాలుగుమాసాల తర్వాత శ్రావణమాసం..

హేమాద్రి పంత్ ఇంట పెళ్లి బాజాలు మ్రోగుతున్నాయి.

అత్యంత రమణీయంగా అలంకరించిన వివాహ వేదిక. దానిపై ఉజ్జ్వలంగా మండుతున్న అగ్నిహోత్రం. అన్ని ప్రక్కలా కూర్చుని ఏకకంఠంతో వేదగానం చేస్తోన్న వేదవేదాంగ పారంగతులు, మహా రుషులు. బ్రాహ్మణ వివాహవేడుక కావటాన అక్కడ అట్టహాసాలకన్నా వైదిక సంప్రదాయమే ప్రధానంగా కనిపిస్తున్నది.

అది సాధారణ బ్రాహ్మణుని ఇంట పెళ్లి వేడుక కాదు. సాక్షాత్తూ మహారాజు గారి అంతరంగిక సలహాదారు, మహామంత్రి హోదా కలిగిన పండితోత్తముడు, మహాకవి, శాస్త్రకోవిదుడు హేమాద్రి గారి ఇంట పెళ్లి.

వియ్యాలవారు కూడా సామాన్యులు కారు. కాకతీయ రాజ్య మహాప్రధాని గంగాధరమంత్రి గారు.

గతంలో ఎప్పుడో కాకతీయ మహారాజు మహాదేవుడు యుద్ధం ప్రకటించకముందే గంగాధరమంత్రి కుమారునికి హేమాద్రి పంత్ కుమార్తెకు వివాహం నిశ్చయించుకున్నారు.

యుద్ధాల వల్ల, దాడుల వల్ల కొంత ఆలస్యమైయినా చివరికి వివాహ ఘడియ రానే వచ్చింది.

నిజానికి విరోధాలు రాజుల మధ్యనే గాని సాధారణ రాజ్యవాసుల మధ్య లేవు. ఎన్నో విషయాలలో ప్రతి వారు ప్రక్క గ్రామం వారి పైన ఆధారపడినట్లే ప్రక్క రాజ్యాలవారిపై కూడా ఆధారపడక తప్పదు. ముఖ్యంగా నిత్యావసరాలు, వివాహాలు, వ్యాపార వాణిజ్యసంబంధాలు వీటికి రాజ్యాలు హద్దులు పెట్టలేవు. ప్రక్క ప్రక్క రాజ్యాలయిన కాకతీయ, దేవగిరి, హోయసల రాజ్యాల ప్రజల్లో సత్సంబంధాలు, ఇచ్చిపుచ్చుకోడాలు.. రాకపోకలు పుష్కలంగానే ఉన్నాయి.

వివాహం నిశ్చయించుకుని తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు సరే. ఇంత బీభత్సకాండ జరుగుతుండగా నిశ్చయించిన ముహూర్తానికే వివాహం జరిపిస్తున్నారు. అదే ఆశ్చర్యం!!

అదే ప్రశ్న పెళ్లి పెద్ద దేవగిరి రాజ్య సంధివిగ్రహి చాముండశర్మను అడిగితే, "అది అంతేనండి. కల్యాణమొచ్చినా కక్కు వచ్చినా ఆగదు.." అన్నాడు నవ్వుతూ.

సంధి విగ్రహి అంటే చిన్న పదవి కాదు. రెండు



రాజ్యాల మధ్య సయోధ్య సాధించగలడు.. విరోధం ప్రజ్వరిల్ల జేసి రెండింటిని నాశనం చేయగలడు. శత్రురాజ్యంతోనైనా మిత్ర రాజ్యంతోనయినా చర్చలు జరపాలంటే అందుకు మంచి మాటకారితనం, నైపుణ్యం రెండు రాజ్యాల ప్రధాన అంశాలపై పట్టున్న వాడిని ఎంచుకుంటారు మహారాజులు. ఈ విషయంలో చాముండశర్మ సరైన ఎంపిక అని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకుంటారు. అగ్రశ్రేణి వీరులు కాకతీయులపై దేవగిరి జైత్రపాలుడు పైచేయి సాధించాడంటే అందులో చాముండశర్మ మంత్రాంగం కూడా ఓ ప్రధాన అంశం.

హేమాద్రి పంత్, సర్వసేనాని జల్లన, చాముండ శర్మ.. ముగ్గురిది ఒకటే మాట ఒకటే బాట. ఒకటే ఆలోచన అంటారు తెలిసినవారు. ముగ్గురూ మహారాణి చిల్లాదేవికి నమ్మినబంట్లు. ముగ్గురూ చిల్లాదేవి గారిని కలిసి ఈ వివాహం జరిపించడానికి ఒప్పించగా ఆమె రాజుగారిని ఒప్పించింది అంటున్నారు హేమాద్రి బంధువులు.

నిజానికి ఈ వివాహం కూడా కోటలోనే ధగద్ధగాయమానంగా జరగాలి. కాకతీయుల మెరుపుదాడి వలన కోట తన సొగసును, సౌకర్యాలను కోల్పోయింది. ప్రస్తుతం చీమ కూడా దూరడానికి సాధ్యం కాని విధంగా కోట భద్రతను పటిష్టం చేశాడు జైతుగి. అందువల్ల వివాహవేదిక హేమాద్రి ఇంటికి మార్చారు.

ఇక్కడైనా వివాహం అట్టహాసంగానే జరుగుతోంది.

ముందుగా వివాహమండపానికి విచ్చేసింది మహారాణి చిల్లాదేవి, కుమార్తె సోమలదేవి సహా. సుమారు ఎత్తులో అంతంత మాత్రపు ఛాయలో నిండైన అలంకరణలో రాణితనపు హోదాతో హుందాగా ఉన్న సోమలదేవిని అందరూ ఆశ్చర్యచకితులై చూస్తుండగా అందరిని పలకరిస్తూ.. పెళ్లి కుమార్తె సుజలాంబను ఆట పట్టిస్తూ చిల్లాదేవి కొత్త చైతన్యం తెచ్చింది. వచ్చిన ఆమె ఉచితాసనంలో కూర్చోలేదు. పెళ్లి పనులన్నీ చక్కబరుస్తోంది.

సాక్షాత్తూ తన స్వంత కుమార్తె వివాహంలా హడావిడి పడిపోతోంది.

యువరాణి సోమల, పెళ్లికుమార్తె సుజలాంబ మంచి మిత్రులు. ఈ ఇద్దరి మిత్రురాళ్ల బృందంతో పెళ్లిపందిరి చిలుకలు వాలిన తోటలా సందడిగా ఉంది.

మేళతాళాలు మారుమ్రోగుతున్నాయి. వాటి మధ్య పెళ్లికుమారుడు విడిది నుండి వచ్చి అందరికి నమస్కరించి పెళ్లిపీట ఎక్కాడు. పెళ్లికూతురిని మేనమామలు బంగారుతాపడం చేసిన పెళ్లిబుట్టలో ఎత్తుకుని తెస్తున్నారు. పెళ్లి కుమార్తెతో సోమల.. ఇతర మిత్రురాళ్లు మేలమాడుతూ వెంటరాగా.. నవ్వులతో సరదాలతో వేదఘోషతో ఆ పెళ్లిపందిరి అంతా కళకళలాడుతోంది.

హేమాద్రి చేసిన ఏర్పాట్లకు తగ్గట్లు వియ్యాల వారు కూడా భారీగానే తరలివచ్చారు. నాలుగురోజుల పెళ్లికి పక్షం రోజులుగా అనుమకొండ నుండి దేవగిరి వరకు మేనాలు, పల్లకీలు, రథాలు, అంబారీల ఏనుగులు, గూడు ఎడ్లబళ్లు.. ప్రవాహంలా వస్తూనే ఉన్నాయి. అంతమంది తరలిరావడం ఆశ్చర్యంగానే ఉంది దేవగిరివాసులకు.

ఎవ్వరూ ఊహించకుండా దేవగిరి పాలకుడు జైత్రపాలకుడు ఛత్ర చామర కేతన లాంచనాలతో మహామత్తగజంపై తరలి వచ్చాడు. ఆయనను అంత దగ్గరగా చూడటం కూడా దేవగిరి పౌరులకు అబ్బురమే.

అందరూ ఆయనకు ముందు సాష్టాంగపడి దండాలు పెడుతుండగా హేమాద్రి సతీసమేతంగా ఎదురేగి పూర్ణకుంభ స్వాగతంతో పెళ్లి పందిరిలోకి ఆహ్వానించి సమున్నతాసనం చూపి కూర్చుండబెట్టాడు.

హాజరైన రాజ్యపాలక ప్రముఖులు చాలామంది ఆయనతో ముచ్చట్లు చెబుతున్నారు. అందరితో మాట్లాడుతున్నా.. కాకతీయ సంధివిగ్రహి పాపాయ భట్టారకుడు, హోయసల సంధివిగ్రహి కన్నడశర్మ.. ఇక్కడే పందిరిలోనే ఉన్నట్లు జైతుగి గుర్తించాడు. కంటి సైగతో తన సందివిగ్రహి చాముండశర్మను అడిగాడు. చాముండ నవ్వి, 'నేనున్నాగా..' అన్నట్లు తలపంకించి సమాధాన పరచాడు. కాని జైతుగి అనుమానాలు తీరలేదు. చాముండకు తెలిసే ఇక్కడ ఉన్నారా శత్రురాజ్య సందివిగ్రహిలు?! హేమాద్రికి, వీళ్లకు దగ్గరి బంధుత్వముందా..??

(సశేషం)

జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ప్లేస్టోర్‌లో **Jagriti Weekly** అని సర్చ్ చేయండి లేదా పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నెమ్, పాస్ వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.
3. మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.
4. Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.
5. Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.
6. Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.
7. మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

– మేనేజర్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అణుపరీక్షలపై తీసుకున్న నిర్ణయంతో మూడు దశాబ్దాలుగా ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉన్న ప్రపంచం ఒక్కసారి ఉలిక్కిపడింది. ఇటీవల రష్యా అణ్వస్త్ర క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించింది. తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య సమావేశం జరిగింది. ఈ రెండు సంఘటనల తర్వాత ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. 1992లో చివరిసారి అణుపరీక్షలు చేసిన అమెరికా తాజాగా భూగర్భ అణుపరీక్షలకు సిద్ధమవుతోందన్న సంగతి నవంబర్ 2న ట్రంప్ చేసిన ప్రకటన ద్వారా స్పష్టమైంది. సీబీఎస్‌కు 60 నిమిషాలపాటు ఇచ్చిన ఇంటర్వ్యూలో "పాకిస్తాన్, చైనా, రష్యా, ఉత్తరకొరియాలు భూగర్భ అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయి కనుక యు.ఎస్. కూడా అణు పరీక్షలు నిర్వహించాల్సిందే" అని స్పష్టం చేశారు.

అణ్వస్త్ర పోటీ

రష్యా, చైనాలు 1996 నుంచి పరీక్షలు నిర్వహించడం లేదు కదా అని ప్రశ్నించినప్పుడు, "వాళ్లు మీకు చెప్పి చేస్తారా?" అని ఎదురు ప్రశ్నించారు. అంతేకాదు పాకిస్తాన్, ఉత్తరకొరియాలు అక్రమంగా అణుపరీక్షలు నిర్వహిస్తున్నాయి కదా? అంటూ ఎదురు ప్రశ్నించారు. యు.ఎస్. అణుపరీక్షలు నిర్వహించడానికి పాక్, ఉత్తర కొరియాలతో కూడా పోల్చుకోవడానికి వెనుకాడని ట్రంప్ వ్యవహారశైలి హాస్యాస్పదంగా ఉన్నదనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ఆ మరునాడే అంటే నవంబర్ 3న చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ అణ్వస్త్రపరీక్షలు చేయడం లేదని స్పష్టం చేసారు. ఒక బాధ్యతాయుత అణ్వస్త్ర దేశంగా మెలుగుతామని, కేవలం స్వీయరక్షణకు మాత్రమే అణ్వస్త్రాలు వినియోగిస్తామని స్పష్టం చేశారు. అంతేకాదు ప్రపంచ నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధం కోసం గట్టి చర్చలు తీసుకోవా లని హితవు పలికారు. అంతేకాదు ప్రపంచ వ్యూహాత్మక సమతుల్యతను కాపాడటంలో యు.ఎస్. కీలక పాత్ర పోషించాలని కూడా కోరారు. రష్యా కూడా తాను అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించడం లేదని స్పష్టం చేసింది. ఇక 1990 నుంచి వరుసగా అణ్వస్త్ర పరీక్షలు నిర్వహిస్తూ వచ్చిన దేశం ఉత్తర కొరియా మాత్రమే. అయితే 2018లో అణు పరీక్షలపై స్వీయ మారటోరియం ప్రకటించడం గమనార్హం.

మరోస్థాయికి అణ్వస్త్రపోటీ

ఇప్పటికే అణ్వస్త్రాలతో పరస్పరం బెదిరింపులకు పాల్పడుతున్న వివిధ దేశాల మధ్య నెలకొన్న అసమతు ల్యత, ట్రంప్ దెబ్బకు మరో కొత్త స్థాయికి చేరుకుంటుం దనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. నిజానికి ఈ అణుపరీక్షల వల్ల కలిగే దుష్ప్రభావం ఎట్లా వుంటుందనేది పసిఫిక్ సముద్రంలో1200 పగడా లదిబ్బలతో కూడిన మార్షల్ ఐలాండ్ వాసులకు చాలా స్పష్టంగా తెలుసు. ఇక బయటి ప్రపంచంలో ఈ నష్టాలపై అవగాహన కలిగినవారు చాలా కొద్ది మంది మాత్రమే వుంటారు. 1947 నుంచి 1986 వరకు ఈ ద్వీపాలు అమెరికా పాలనలో కొనసాగాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా అణ్వాయు ధాలను విపరీతంగా పోగేసింది. ఇందుకోసం 1946 నుంచి 1958 మధ్యకాలంలో 67 అణు పరీక్షలు నిర్వహించడం చరిత్ర. ఇంధన పర్యావరణ పరిశోధనా సంస్థ (ఐఈఈఆర్) 2025లో విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ అణుపరీక్షల కారణంగా ఏర్పడిన పేలుళ్ల వల్ల హిరోషిమాపై వేసిన అణు బాంబు పేలుడుకు సమానమైన పేలుళ్లు 20 సంవత్స రాలపాటు ప్రతిరోజూ కొనసాగాయని పేర్కొంది. వీటివల్ల విడుదలైన రేడియేషన్ వల్ల ఉత్తర ప్రాంత ద్వీపాల్లో 55% క్యాన్సర్ కేసులు నమోద య్యాయని యు.ఎస్.కు చెందిన అటామిక్ హెరిటేజ్ ఫౌండేషన్ వెల్లడించింది. ఈ ద్వీపాలనుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించిన రేడియేషన్‌తో కూడిన గాలుల వల్ల మరో లక్షమంది క్యాన్సర్ బారిన పడ్డారు. ముఖ్యంగా శ్రీలంక, మెక్సికో వంటి సుదూర దేశాల్లో కూడా ఈ రేడియేషన్ ఆనవాళ్లు కనుగొన్నారు. గతంలో యు.ఎస్. అణుపరీక్షలు కేవలం పసిఫిక్ ద్వీపాలకే పరిమితం కాలేదు. మోజేవ్ ఎడారిలోని నెవాడా క్షేత్రంలో కూడా నిర్వహించింది. 1951 నుంచి 1962 వరకు అమెరికా వంద వరకు భూమి ఉపరి తలంపైన, 828 భూగర్భ అణు పరీక్షలు నిర్వహిం చింది. వీటిల్లో చిట్టచివరిగా నిర్వహించింది 1992లో! భూగర్భ అణుపరీక్షలు సురక్షితమని భావించినప్పటికీ నెవాడాలో జరిపిన 32 పరీక్షల్లో వాతావరణంలోకి రేడియేషన్ కలిసిపోయిందని 1993 యు.ఎన్. నివేదిక పేర్కొంది. నిజం చెప్పాలంటే మార్షల్ ద్వీపాల్లో అమెరికా అణుపరీక్షల వల్ల కలిగిన గాయాలు ఇప్పటికీ అక్కడి ప్రజలను సలుపుతూనే వున్నాయి. మార్షల్ ద్వీపాల్లో ఎనెవెటాక్‌కు 200 మైళ్ల దూరంలో ఉన్న బికినీ ఎటోల్ ద్వీపంలో యు.ఎస్. జరిపిన అణు పరీక్ష; హిరోషిమాపై వేసిన అణుబాంబు కంటే వెయ్యిరెట్లు పెద్దది. పరీక్షా సమయంలో ఈ ద్వీపంలో 167 మంది నివసించే వారు. వీరిని అక్కడినుంచి ఖాళీ చేయించడంతో ఇప్పుడు ఆ ద్వీపంలో ఎవరూ ఉండటంలేదు. ఇక్కడ రేడియేషన్ స్థాయి హెచ్చుగా ఉండటంతో, ఈ ద్వీపాన్ని 1978లో యు.ఎస్. ప్రభుత్వం మూసి వేసింది. పసిఫిక్ ప్రాంతంలో చివరి అణుపరీక్షను ఫ్రాన్స్ 1996లో నిర్వహించింది. దక్షిణ పసిఫిక్ ప్రాంతంలోని పగడాల దిబ్బల ద్వీపాల్లో ఫ్రాన్స్ 193 పరీక్షలు నిర్వహించింది. ఫ్రాన్స్ నిర్వహించిన అణుపరీక్షల ప్రభావానికి 1.10లక్షల మంది ప్రజలు గురయ్యారని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, ఫ్రాన్స్‌కు చెందిన చెందిన పరిశోధనాత్మక జర్నలిజం సైట్, నార్వేకు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ వెల్లడించాయి. 1996 జనవరి 27న ఫ్రాన్స్ తన చివరి అణుపరీక్షను నిర్వ హించింది. 1996 జులై నెలలో చైనా జింజియాంగ్ ప్రావెన్స్‌లోని మారుమూలగా ఉండే లోప్ నూర్ క్షేత్రంలో అణుపరీక్షను నిర్వహించింది. చైనా నిర్వహించిన చివరి అణుపరీక్ష ఇదే. తాజాగా ట్రంప్ ప్రకటించిన ప్రకారం యు.ఎస్. మళ్లీ మార్షల్ దీవులు, నెవాడా ఎడారి ప్రదేశంలో తన అణుపరీక్ష లను నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రాంతాలు ఇప్పటికే అణుపరీక్షల పుణ్యమాని రేడియేషన్‌తో నిండిపోయి నివాసాలకు ఎంతమాత్రం అనువుగా లేవు. అయితే ట్రంప్ ప్రకటించిన మరునాడే యు.ఎస్. ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ మాట్లాడుతూ తమదేశం అణుపరీక్షలు నిర్వహించడంలేదని స్పష్టం చేయడం గమనార్హం.

సమగ్ర అణ్వస్త్ర వాప్తి నిరోధక ఒప్పందం

1996, సెప్టెంబర్‌లో సమగ్ర అణ్వస్త్రవాప్తి నిరోధక ఒప్పందాన్ని (సీటీబీటీ) రూపొందించారు. ఇందులో సంతకం చేసినవారు ఇక అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించడానికి వీల్లేదు. దీనిపై యు.ఎస్, చైనా, రష్యాలు హడావిడిగా సంతకాలు చేసినా ఆయా దేశాలు అధికారిక ఆమోదం తెలపలేదు. 1996 తర్వాత భారత్ రెండు (1998), పాకిస్తాన్ రెండు (1998), ఉత్తర కొరియా ఆరు (2006–17 మధ్య



కి తెర లేపుతున్న ట్రంప్!!

కాలంలో) అణుపరీక్షలు నిర్వహించాయి. ప్రస్తుతం 5,459 అణ్వస్త్రాలతో రష్యా అగ్రస్థానంలో వుండగా 5,177 అణ్వస్త్రాలతో యు.ఎస్. రెండో స్థానంలో ఉన్నట్టు ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ (ఎఫ్ఏఎస్) వెల్లడించింది. ఇక చైనా 600, ఫ్రాన్స్ 290, యునైటెడ్ కింగ్‌డమ్ 225, ఇండియా 180, పాకిస్తాన్ 170, ఇజ్రాయిల్ 90, ఉత్తర కొరియా 50 అణ్వాయుధాలను కలిగి ఉన్నాయని ఎఫ్ఏఎస్ తెలిపింది. 2030 నాటికి చైనా అణ్వాయుధాలు వెయ్యికి చేరతాయని అంచనా. సీటీబీటీపై మన దేశంతోపాటు పాకిస్తాన్ కూడా సంతకం చేయలేదు. అమెరికా దీన్ని ఆమోదించలేదు. ఇక చైనా కూడా ఈ ఒప్పందాన్ని పూర్తిగా అంగీకరించలేదు. రష్యా మొదట్లో దీనిపై సంతకం చేసినా తర్వాత వెనక్కి తీసుకుంది.

భారత్‌పై ప్రభావం

ట్రంప్ ప్రకటన నేపథ్యంలో తాజా పరిణామాలు భారత్‌పై ఏవిధమైన ప్రభావం చూపుతాయన్న ప్రశ్న తలెత్తడం సహజమే. 1998లో పోఖ్రాన్ అణుపరీక్షల తర్వాత మనదేశం స్వచ్ఛందంగా అణుపరీక్షలను నిలిపేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ ఏవిధంగా స్పందిస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా వుంది. ముఖ్యంగా ట్రంప్ ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం మన దేశానికి ఎంతవరకు లాభం? లేదా ఎంతవరకు నష్టం? అనేది బేరీజు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1998లో జరిపిన హైడ్రోజన్ బాంబు పరీక్షల్లో 10 నుంచి 15 కిలో టన్నుల శక్తి మాత్రమే వెలువడటం వల్ల, అనుకున్న విజయం సాధించలేదని అప్పట్లో డీఆర్‌డీఓ శాస్త్రవేత్త సంతానం ప్రకటిస్తే, అప్పటి అణు విభాగం ఛైర్మన్ రాజగోపాల చిదంబరం మాత్రం అణుపరీక్షలు సక్సెస్ అయ్యాయని స్పష్టం చేయడంతో ఈ పరీక్షలపై వివాదం కొనసాగింది. అప్పట్లో భారత్ 58 కిలోటన్నుల శక్తి వెలువడిందని అధికారికంగా ప్రకటించడం గమనార్హం. ఇప్పుడు ట్రంప్ అణుపరీక్షలపై చేసిన ప్రకటనతో, మనదేశం కూడా మరోసారి అణుపరీక్షలు నిర్వహించి గతంలో నిర్వహించిన పరీక్షలపై నెలకొన్న వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టవచ్చుననేది కొందరి నిపుణులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం. అయితే 1998 పరీక్షల్లో సేకరించిన డేటా, కంప్యూటర్ సిమ్యులేషన్‌లు సరిపోతాయన్నది మరికొందరి వాదన. అమెరికా అణుపరీక్షలు మొదలు పెడితే, రష్యా, చైనాలు కూడా ఇదే బాటలో ముందుకెళతాయి. అప్పుడు భారత్ మౌనంగా ఉండటం వల్ల వ్యూహాత్మకంగా వెనుక బడటం ఖాయం. ఒక శాంతికాముక దేశంగా, ప్రపంచ శాంతికోసం దౌత్యపరంగా ప్రయత్నించినా అవి ఫలించే అవకాశాలు చాలా తక్కువ! ఆయుధం ధరించు, శాంతంగా మాట్లాడు అనే రీతిలో భారత్ కూడా అణు పరీక్షలు చేసి అప్పుడు శాంతికోసం యత్నించడం మరో మార్గం.

మళ్లీ ఆయుధ పోటీ తప్పదా?

ఒకవేళ ట్రంప్ ప్రకటన ప్రకారం యు.ఎస్. అణుపరీక్షలను తిరిగి ప్రారంభిస్తే, రష్యా, చైనాలు ఎట్టిపరిస్థితుల్లో చేతులు ముడుచుకొని కూర్చోవు. అణ్వాయుధపోటీ పాపం యు.ఎస్.దేనంటూ ఈ రెండు దేశాలు మళ్లీ తమ అణుపరీక్షలను మొదలు పెడతాయి. ప్రస్తుతం అమెరికా–రష్యాల మధ్య స్టార్ట్ ఒప్పందం అమల్లో ఉంది. ఇరుదేశాల వద్ద ఉండాల్సిన అణ్వాయుధాల పరిమితిని ఇది నిర్దేశిస్తుంది. ఈ ఒప్పందం వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ముగిసిపోనున్నది. ఒకవేళ యు.ఎస్. అణ్వస్త్ర పరీక్షలు నిర్వహిస్తే ఈ ఒప్పందం అమలు సందిగ్ధంలో పడటం ఖాయం. ఇప్పటివరకు అగ్రరాజ్యాలు విధించుకున్న మారటోరియం చట్టబద్ధమైంది కాదు. కేవలం తమకు తాము విధించుకున్నది మాత్రమే. ఈ మారటోరియం ఉత్తర కొరియాకు వర్తించదు. మరి అగ్రరాజ్యాలు ఈ మారటోరియాన్ని ధిక్కరిస్తే, ఇతర దేశాలు కూడా అణ్వస్త్ర పరీక్షల దిశగా తమ విధానాలను మార్చుకునే అవకాశాలే అధికం. ఇది అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని నిరుపయోగం చేయడమే కాదు, నిరాయుధీకరణ, అణ్వస్త్రాలను నమకూర్చుకోకూడదన్న నియమాలను నీరుకారుస్తుంది. ఇతర దేశాలు మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, కొత్తతరం అణ్వస్త్రాలను తయారుచేసే ప్రమాదం పొంచి ఉంది. ఇది ప్రపంచ భద్రతకు అత్యంత ప్రమాదకరం. చైనా అణ్వస్త్ర పరీక్షలు తిరిగి మొదలుపెడితే, భారత్ చూస్తూ ఊరుకునే పరిస్థితి ఉండదు. భారత్‌ను చూసి పాకిస్తాన్ ముందుకెళుతుంది. ఇదంతా ఒక శృంఖల చర్య మాదిరిగా ప్రాంతీయ భద్రతకు పెనుముప్పుగా రూపాంతరం చెందుతుంది. ఇక యు.ఎస్. సహచర దేశాలు యు.ఎస్. నిరోధకశక్తిని ప్రశ్నించడం మొదలు పెడతాయి. దురదృష్టవశాత్తు ప్రస్తుత నాయకులు రెండో ప్రపంచ యుద్ధం సృష్టించిన వినాశనాన్ని మరచిపోయారనే అనుకోవాల్సి వస్తున్నది. హిరోషిమా–నాగసాకి నగరాలపై అణుబాంబులు పడినప్పుడు ఎంతటి విధ్వంసం జరిగిందనేది ఎందుకు వీరు పరిగణనలోకి తీసుకోవడంలేదో అర్థం కాదు. ఎంతో శ్రమించి రూపొందించిన ఎన్‌పీటీ, నిరాయుధీకరణ ఒప్పందాలు దశాబ్దాల కాలంగా ప్రపంచాన్ని ఒక నియంత్రణలో ఉంచుతూ వచ్చాయి. ప్రస్తుతం ట్రంప్ విధ్వంసక ప్రవృత్తితో మళ్లీ ప్రపంచం పెను విపత్తు అంచుకు చేరుతోంది. మానవాళి వినాశనానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయనే చెప్పాలి!

భూమి వినాశనానికి ఉన్నవి చాలు!

నిజానికి ఈ భూమిని సర్వనాశనం చేయడానికి ఇన్ని వేల వార్‌హెడ్‌లు అవసరం లేదు. 1945లో హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా ప్రయోగించిన అణుబాంబుల కంటే ఎన్నోరెట్లు శక్తివంతమైన అణుబాంబులు ప్రపంచ దేశాల వద్ద ఉన్నాయి. ఇవి చాలు మానవాళి విధ్వంసానికి! అందువల్ల ఈసారి ప్రపంచ యుద్ధం జరిగితే, ఓడిన దేశాలు నాశనమైపోగా, గెలిచిన దేశం పావుకునేదేం లేదు! మానవ నాగరికత మళ్లీ మొదటినుంచి మొదలవుతుంది. అంటే యుద్ధాలు కర్రలతో కొట్టుకునే దశకు చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది!!

జమలాపురపు విఠల్‌రావు

సీనియర్ జర్నలిస్ట్

ఆయన ప్ర

'పృత్త పత్రమే నాము ఛపేగా పహనూంగా
స్వాగత సుమహోర్ చోడ్ చలో యహ క్షుద్ర భాననా'

(స్వరాజ్య సంగ్రామంలో ఆహుతి అయితే భారతమాత చరణాల వద్ద పుష్పంలా రాలిపోతాం. స్వాతంత్ర్యం ఖాయమయితే స్వతంత్ర దేశంలో స్వేచ్ఛ అనుభవిద్దాం. అంతేగానీ, ఈ సంగ్రామంలో పాల్గొన్న ధన్యులుగా ఒక్క రూపాయి కూడా ప్రతిఫలం కోరం) ఆ హిందీ ప్రతిజ్ఞను ఆరోజులలో అటల్ బిహారీ వాజపేయి, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వంటి మహామహులెందరో చిత్తశుద్ధితో చేశారు. అలాంటి వారిలో ఒకరు ఇంతకాలం మన మధ్యనే మౌనంగా జీవన పోరాటం సాగించి కన్నుమూశారు. ఆయనే బుద్ధవరపు వేంకటరత్నం.

బుద్ధవరపు సుబ్రహ్మణ్యం–బాపనమ్మ దంపతులకు నవంబరు 17,1925న తూర్పు గోదావరి జిల్లా నాయకంపల్లిలో వేంకటరత్నం జన్మించారు. సామర్లకోట బోర్డు హైస్కూల్, రాజమండ్రి గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలలో చదువుకున్నారు. చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలు అంకురించాయి. భారతమాత అంటే ఆరాధన. ఫిబ్రవరి 7,1957వ తేదీన సూర్యమ్మతో (తటవర్తి వారి ఆడపడుచు) వివాహం.

1936 నాటి మాట. కాకినాడ పిఠాపురం మహారాజా కళాశాల, ఉన్నత పాఠశాల రఘుపతి వేంకటరత్నంనాయుడు ఆధ్వర్యంలో నడిచేవి. అప్పుడు బుద్ధవరపు వేంకటరత్నం ఏడవ తరగతి చదివేవారు. రఘుపతి వేంకటరత్నం నాయుడు కళాశాలకు ఎదురుగా ఉన్న బ్రహ్మసమాజ మందిరంలో 10–15 ఏళ్ల విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. తాను మూడు ముఖ్య విషయాలు అక్కడే నేర్చుకున్నానని గుర్తు చేసుకుంటూ ఉండేవారు వేంకటరత్నం. అవి– కథలు చెప్పడం (చెప్పడమే, రాయడంకాదు), వ్యాస రచన, సభా పిరికిని పోగొట్టుకుని ఉపన్యాస కళను అభ్యసించడం. ఇవే పదేళ్ల తర్వాత ఎంతో ఉపకరించి, పేరు తెచ్చిపెట్టాయనేవారు.

వేంకటరత్నం తండ్రి సుబ్రహ్మణ్యం గురించి చెప్పుకోవాలి. ఆయన సైన్యంలో పనిచేశారు. 1917లో మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధకాలానికి సైన్యంలోనే ఉన్నా రైల్వే విభాగంలో పనిచేశారు. సుబ్రహ్మణ్యం ప్రభుత్వ కొలువులో చేరేవరకు వంశ పారంపర్యంగా వచ్చిన యర్రమిల్లి (గండేపల్లి మండలం) కరణీకం (పదేళ్లు) చేశారు. తరువాత వెంకటరత్నం పినతండ్రి సుబ్బరాజు 20 ఏళ్లు చేశారు. బీఏ పూర్తి చేసిన తరువాత 1946లో అప్పటి పెద్దాపురం

నాతో ఓనమాలు దిద్ది

ఇలాంటి సమయం ఇలా వస్తుందని నేను అసలు ఊహించలేదు. బాగా గుర్తు. మార్చి 22, 1986. 'సమయం' అనే దినపత్రికకు ఎంపికయిన వారంతా ఆ రోజు మొదటిసారి ఆజామాబాద్ (హైదరాబాద్) కార్యాలయానికి వెళ్లాం. పరిచయ కార్యక్రమం జరిగింది. పత్రిక అధిపతి మేచినేని కిషన్‌రావు, ఎడిటర్ పన్యాల రంగనాథరావు, న్యూస్ ఎడిటర్ నిడమర్తి రాజశేఖర్, వారి పక్కనే ఒక పెద్దాయన. మల్లెపువ్వులా పంచె లాల్చీ. మిగిలిన వారిని పరిచయం చేశాక కిషన్‌రావు చెప్పారు– ఇక్కడ మీకు మూడు నెలలు శిక్షణ ఇస్తారు. అది తృప్తికరంగా లేకపోతే, సమయం ఇంకాస్త పెరుగుతుంది. ఆ శిక్షణ అంతా మన చీఫ్ సబ్ ఎడిటర్ బుద్ధవరపు వెంకట రత్నం గారు ఇస్తారు అన్నారు, ఆయనను చూపుతూ. అదే ఆయన ప్రథమ దర్శనం. ఆ బృందంలో నేనూ ఉన్నాను. కాబట్టి పత్రికా రచనలో వెంకటరత్నం గారి దగ్గరే నేను ఓనమాలు దిద్దాను. మూడు మాసాల శిక్షణ. నిత్యం పాతకాలం ప్రధానోపాధ్యాయుడు గుర్తుకొచ్చేవారు. జాగృతి వారపత్రిక వ్యవస్థాపక సంపాదకులు వారేనని నాకు ఆరోజు తెలియదు. అలాగే, అది జరిగిన 32 సంవత్సరాల తరువాత వారు నిర్వహించిన బాధ్యతను నేను తీసుకుంటానని కూడా ఏనాడూ అనుకోలేదు. ఆయన కథకుడు. అందుకే కథ గురించి ఆ శిక్షణలో మాకు చాలా చెప్పారు. అలాగే పుస్తకాలు, ప్రముఖ పత్రికా రచయితల ప్రతిభ ఇలా ఎన్నో విషయాలు చాలా హాయిగా చెప్పేవారు. కానీ భాష విషయం వచ్చేసరికి ఎక్కడ లేని కరుకుతనం కనిపించేది. ఒక్క జ్ఞాపకం గురించి: శిక్షణలో ఉన్న మమ్మల్ని సాయంత్రం బయటకు పంపి, ఏదైనా ఒక వార్త కథనం, వార్త సేకరించి, రాత్రి ఇంటి దగ్గరే రాసి మరునాడు తీసుకుని రమ్మనేవారు. నేనూ మరో ఇద్దరు ముగ్గురు కలసి త్యాగరాయ గానసభకు వెళ్లాం. ప్రఖ్యాత రచయిత ఆత్రేయకు సత్కారం. వార్తా కథనం రాసి వారికి చూపించాను. అసలు హెడ్డింగ్ చూడగానే భగ్గు మన్నారు. 'ఏమిటీ శీర్షిక? ఏమిటిది? ఇదేం ధోరణి? ఓ పని చేయండి! 120 పాయింట్‌లో (పతాక శీర్షికల అక్షరాల పరిమాణం) పెట్టి (పేజీ) పైన పెట్టించండి!' అన్నారు, ముఖం పక్కకు తిప్పేసుకుని. నేను ఖిన్నుడనయ్యాను. తరువాత న్యూస్ ఎడిటర్ గారికి చూపిస్తే, దానికి వేరే కారణం ఉందిలే అన్నారు. ఇంతకీ ఆ శీర్షిక, 'రంగస్థల రచయిత గానే మరణిస్తా!'. కానీ కథల గురించి వివరిస్తున్న వ్పుడు నేను ఆయన దృష్టిలో పడ్డాను. ఆయన కథల పేర్లు చెప్పి, రచయితలు ఎవరో చెప్పమనేవారు. నేను ఎక్కువ పేర్లు చెప్పాను. నాకో ఇతివృత్తం చెప్పి, రాసి తీసుకు రమ్మన్నారు. ఓ ఆదివారమంతా కూర్చుని రాసి చూపించాను. ఆయన ముఖంలో కొద్దిపాటి తృప్తి.

జాగృతిలో బాధ్యతలు తీసుకున్న తరువాత వారిని కలిశాను. హైదరాబాద్‌లోనే అలకాపురిలో ఉన్నారు, కొడుకు శ్రీనివాసరావుగారితో. సీనియర్ స్వయంసేవక్ పున్నారావుగారూ, జాగృతి సహోద్యోగి వినోద్ సహకారంతో సాధ్యమైంది. మంచం మీద నుంచి లేచి కూర్చోగలరు. దిగలేరు. అలాంటిది, కొడుకూ, కోడలూ, మనుమడూ ఉద్యోగాలకు వెళ్లిపోతే మళ్లీ సాయంత్రం వరకు వెనకగదిలో ఒంటరితనం. నేనో కథని ఈ వాక్యాలతో మొదలుపెట్టాను, అవి సరిగ్గా వారి స్థితిని అద్దంలో చూపిస్తాయి, 'నేనూ.. నా చుట్టూ మౌనం. మౌనం.. దాని చుట్టూ నేను'. 'సమయం' పత్రికలో ఉన్న ఆ ఐదు మాసాల (మూడు మాసాల శిక్షణ, రెండు మాసాలు పత్రిక పని, తరువాత మూతపడింది)లో ఎప్పుడూ మల్లెపువ్వులా కనిపించిన ఆయనలో చాలా మార్పులే చూశాను, భౌతికంగా. రోడ్డు ప్రమాదంలో ఒక కాలు పోయింది. ఇంకేదో కారణంతో నాలుక కొంత కత్తిరించారు. దాదాపు తొంభయ్ ఐదేళ్ల వయసులో ఈ పరిస్థితి. బహుశా ఆయన జీవితంలోని అద్భుత జ్ఞాపకాలూ, స్థిరచిత్తం ఆయనను ఒంటరితనం నుంచి రక్షించి ఉండాలి. అటల్ బిహారీ వాజపేయి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వంటివారి సాన్నిహిత్యం మరి!

కొన్ని పళ్లు, పంచె ఉంచిన సంచి వారి చేతిలో

యాణం చరిత్రాత్మకం

ఆర్‌డీఓ 'రావుసాహెబ్' బుద్ధవరపు పాపరాజుపంతులు ఆ కరణీకం వేంకటరత్నంకు అప్పగించారు. రూ. 5.25పై జీతానికి చేరిన వేంకటరత్నం కరణీకం పోయేంతవరకు అంతే జీతానికి పనిచేశారు. అటు కరణీకం, ఇటు ఆర్ఎస్ఎస్‌కు సేవలు అందించారు.

1940వ దశకంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో (ఆర్ఎస్ఎస్)లో చేరిన వేంకటరత్నం, 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పట్లో రాజమండ్రిలో సత్తిరాజు విశ్వనాథం, ఇందుకూరి విశ్వనాథరాజు, ఊలపల్లి రామచంద్రమూర్తి, దినవహి వీర్రాజు, తాకిరాజు బాలవెంకటశేషగిరి రావు, సత్యవోలు వెంకట భాస్కర ఉమామహేశ్వర వర ప్రసాదమూర్తి, ప్రయాగ సుబ్రహ్మణ్యం సంఘంలో వారి సహచరులు. 1942–1946 మధ్య నండూరి రామమోహనరావు (ఎడిటర్, ఆంధ్రజ్యోతి), కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం (ఎడిటర్, ఆంధ్ర జనతా, ఆంధ్రప్రభ, కోస్తావాణి), వేంకటరత్నం రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో బీఏ వరకు సహాధ్యాయులు. ముగ్గురూ వాడ్రేవు వారి ఉచిత విద్యార్థి వసతిగృహంలో ఉన్నారు.

1944 నుంచి సంఘ ప్రచారక్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘ శిక్షకులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు (అప్పట్లో వేంకట రత్నం నేతృత్వంలో విశాఖలో జరిగిన శిబిరంలో వారి నుంచి సంఘ మూల సిద్ధాంతాలు, నియమాలు నేర్చుకున్నానని నగర బీజేపీ ప్రముఖులు, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన వెంపరాల రామకృష్ణారావు ఓ సందర్భంలో ఈ వ్యాసకర్త వద్ద ప్రస్తావించారు). 1948లో ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించిన సమయంలో వేంకటరత్నం విజయవాడ, కైకలూరు జైళ్లలో ఉన్నారు. బందరు కోర్టులో న్యాయపోరాటం చేసి బయటకు వచ్చారు.

దీనదయాళ్ ఉపాధ్యాయ సంపాదకత్వంలో 'రాష్ట్రధర్మ' మాసపత్రికకు తోడుగా ఇతర భారతీయ భాషల్లో ఏకకాలంలో సంఘ పత్రికలు తీసుకురావాలని తలచినప్పుడు తెలుగులో 'జాగృతి'కి వేంకటరత్నం సంపాదకులయ్యారు. మాచిరాజు హనుమంతరావు గారు పబ్లిషర్. హిందీలోనే 'పాంచజన్య' వారపత్రిక ఎడిటర్‌గా వాజపేయి నియమితులయ్యారు. 1949లోనే వ్యవస్థాపక సంపాదకులుగా శతావధాని చెల్లపిల్ల వేంకటశాస్త్రి, 'దేశభక్త' కొండ వెంకటప్పయ్య పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ, అడివి బాపిరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, జటావల్లభుల పురుషోత్తం, మధురాంతకం రాజారాం, వంటి ప్రముఖుల చేత సందేశాలు తెప్పించారు. కొందరి చేత కథలు, వ్యాసాలు రాయించారు.

స్వతంత్ర భారత రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, రెండవ రాష్ట్రపతి ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణ పండితులను కలుసుకున్న నాటి జ్ఞాపకాలని ఆయన అపురూపంగా చెప్పేవారు. 1966లో లాల్

పెట్టి, శాలువ కప్పి పాదాలకు నమస్కరించబోయాను. తీవ్రంగా ప్రతిఘటించారాయన. మీ నాన్నగారికీ, అమ్మగారికీ తప్ప వేరే ఎవరికీ పాదాభివందనం చేయవద్దు అన్నారు, ముద్ద ముద్ద మాటలతో. మనం పెట్టే నమస్కారం కూడా మనలోని పరమాత్మకే చెందుతుంది. అందరిలోను పరమాత్మ ఉన్నాడు కదా అన్నారాయన. 'ఈ వృత్తి మీ భిక్ష' అన్నాను. కాదు, పరమాత్ముడి దీవెన అన్నారు. ఇది జరిగిన తరువాత సంవత్సరం వరకు ఏదో ఒకటి, కొన్ని వాక్యాలే, రాసి పంపేవారు. ప్రతి ఉత్తరానికి చివర ఒకటే ముగింపు, 'రాయలేకపోతున్నాను. వేళ్లు కలాన్ని పట్టి

ంచారు

ఉంచడం లేదు.' తరువాత మరొక రెండుమూడు సార్లు కలిశాను. జాగృతి 75 ఏళ్ల సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచిక తీసుకుని మళ్లీ అంతా వెళ్లాం. సంతోషించారనే అనిపించింది.

ఆయన మౌనం విధించుకున్న జ్ఞాపకాల ఝరి. వారి జీవితం స్వతంత్ర భారత చరిత్ర పరిణామాలు, ఆర్ఎస్ఎస్ ప్రస్థానం అనే రెండు ఒడ్డును తాకుతూ సాగింది. రచనలు, పాటలు, సంఘటనలు, సమకాలికుల వివరాలు– ఏవీ ఆయన మరచిపోలేదు.

1948 డిసెంబర్‌లో జాగృతి మొదలయింది. మొదటి సంచికతోనే నిషేధానికి గురైంది. గాంధీజీ హత్య పేరుతో ఆర్ఎస్ఎస్ మీద నిషేధం ఉంది. అయినా ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు వ్యక్తులు స్థాపించిన పత్రికకు మీరు అనుమతి ఎలా ఇచ్చారు? ఇప్పుడు ఎందుకు నిషేధించారు? అని జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారట వేంకటరత్నం. మళ్లీ జనవరిలో పున:ప్రారంభమైంది. జాగృతి స్థాపన ధ్యేయాన్ని అక్షరం పొల్లు పోకుండా నిర్వర్తించినవారు వెంకటరత్నం. చాలా పిన్న వయసులోనే సంపాదకుడి బాధ్యత చేపట్టారు. తూర్పు, పశ్చిమ, కృష్ణాజిల్లాల ప్రచారక్‌గా పని చేస్తున్న వేంకటరత్నంకు ఒక ఉత్తరం వచ్చింది. అది సాక్షాత్తు రెండో సర్‌సంఘచాలక్ పరమపూజనీయ గురూజీ నుంచి. తెలుగు భాషలో 'మన' పత్రిక స్థాపించాలని సూచన. దానికి సంపాదకత్వ బాధ్యతా మీదే అంటూ ఆదేశం కూడా. కొన్ని ప్రాంతీయ భాషల మాదిరిగానే తెలుగులోనూ పత్రిక ప్రారంభం కావాలన్న ఆశయం గురూజీది. కారణం– గాంధీజీ హత్య పేరుతో సంఘం మీద వెల్లువెత్తుతున్న అబద్ధాలకు సాధ్యమైనంత మేర, శక్తి మేరకు సమాధానం చెప్పడమే. చీకటిని తిడుతూ కూర్చోకుండా చిరుదీపం వెలిగించే ప్రయత్నం. అలా స్వతంత్ర భారతదేశ తొలితరం పత్రికా రచయితలలో ఒకరిగా వేంకటరత్నం నిలిచారు. ఎన్నో ప్రతికూలతల మధ్య పత్రికను నిర్విఘ్నంగా నడిపిన కలం యోధుడు కూడా ఆయనే.

గాంధీజీ హత్య, కాందిశీకుల సమస్య, కశ్మీర్ సమస్య, పాకిస్తాన్ యుద్ధం, నెహ్రూ ప్రభుత్వం, జనసంఘ్ పనితీరు వంటి అన్ని అంశాలను వేంకటరత్నం సమర్థవంతంగా విశ్లేషించారు. సాహిత్యానికి వారు ఇచ్చిన ప్రాధాన్యం విశేషంగా ఉంటుంది. ప్రధానంగా చారిత్రక కథలకు పెద్ద పీట వేశారు. స్వయంగా ఆయనే ఎన్నో కథలు రాశారు. గొప్ప గొప్ప అనువాదాలు అందించారు. ఒకపక్క ప్రతికూలత, మరొక పక్క వనరుల లేమి, ఉన్న వనరులైనా అందుబాటులో లేని ఆ కాలంలో ఆయన జాగృతిని అక్షరాలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భారతి, ఆంధ్ర సచిత్రవార పత్రిక, ఆంధ్రప్రభ వారపత్రిక, చందమామ, యువ వంటి పత్రికలు రాజ్యమేలుతున్న కాలంలో గొప్ప దీక్షతో జాగృతిని ఆయన వెలువరించిన తీరు అభినందనీయం.

– డా. గోపరాజు నారాయణరావు,
సంపాదకుడు, జాగృతి

ప్రాంతీయ భాషలలో పత్రికలు తేవాలని నిర్ణయించిన పూజ్య గురూజీ, తెలుగు పత్రిక సంపాదకత్వ బాధ్యతను బుద్ధవరపు వేంకటరత్నం గారికి అప్పగించారు. ఆయన వారి నమ్మకానికి అనుగుణంగా పత్రికను తీర్చిదిద్దారు. సంపాదకత్వ బాధ్యత తొలుత కొంత భారమనిపించినా, పరమపూజ్య గురూజీ ప్రోత్సాహంతో నిభాయించుకొచ్చారు. అనంతరం కాలంలో ప్రధాన మంత్రిగా సేవలు అందించిన అటల్ బిహారీ వాజపేయ్ సంపాదకత్వంలో 'పాంచజన్య', దీనదయాళ్ ఉపాధ్యాయ మార్గదర్శనంలో 'రాష్ట్రధర్మ' ఏక కాలంలో ప్రారంభమయ్యాయి. పూజ్య గురూజీ అడుగుజాడల్లో నడిచిన సంపాదకత్రయం తమ ప్రతిభను చాటుకున్నారు. వారికి ఇదే నా నివాళి..

– వి. భాగయ్య, అఖిల భారత కార్యకారిణి సభ్యులు, ఆర్ఎస్ఎస్

పరమ పూజనీయ గురూజీ ప్రేరణతో 1940వ దశకంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చేరిన బుద్ధవరపు వేంకటరత్నం, గురూజీ ఆదేశాల మేరకు 'జాగృతి' జాతీయ వారపత్రిక వ్యవస్థాపక సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించారు. పత్రిక రచనలో ఏ మాత్రం అనుభవం లేని తాను అంత పెద్ద బాధ్యత నిర్వహించగలనా? అని సందేహించినప్పుడు పూజ్య గురూజీ భుజం తట్టారు. ఆ ధైర్యంతోనే తమ కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహించారు. జాగృతితోపాటు ఆంధ్రపత్రిక, భారతి వంటి ప్రముఖ పత్రికలకు 'శండిల' కలం పేరుతో అనేక రచనలు చేశారు.

– పి. వేణుగోపాల్‌రెడ్డి, జాగృతి పూర్వ సంపాదకులు



జాగృతి వ్యవస్థాపక సంపాదకుడు బుద్ధవరపు వేంకటరత్నం పత్రికా రచయితే కాదు..స్వరాజ్య సమరయోధుడు కూడా. ఆయన క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సంపాదకత్వం బాధ్యతలు చేపట్టక ముందు ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా సేవలు అందించారు. భండారు సదాశివరావుతో కలసి పత్రికను తీర్చిదిద్దారు. తన చేతుల్లో పురుడు పోసుకొన్న పత్రిక 75 ఏళ్ల వేడుకను చూచిన ఏకైక సంపాదకుడు వేంకటరత్నం గారే కావచ్చు. పూజ్య గురూజీతో అడుగులు వేసి, ఈ తరంతో జీవించిన సంపాదక శిఖరం ఒరిగిపోయింది.

– సిహెచ్ సంజీవ, అధ్యక్షులు, జాగృతి ప్రకాశన్ ట్రస్ట్

బహదూర్‌శాస్త్రి హైదరాబాదు వచ్చినప్పటి మాట. వేంకటరత్నం 'కృష్ణాపత్రిక' ఉప సంపాదకుడు. తాను, సంపాదకులు ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మ 'కృష్ణాపత్రిక'ను తీసుకెళ్లి శాస్త్రి గారికి అందించారు. పత్రికను అందుకున్న శాస్త్రిగారు స్వాతంత్ర్య సమరంలో ఎందరో యువకులకు స్ఫూర్తినిచ్చి ప్రోత్సహించిన పత్రిక అన్నారట. సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు రాష్ట్రపతిగా ఉన్నరోజుల్లో వేంకటరత్నం, ఆయన తమ్ముడు హనుమంతు రావూ న్యూఢిల్లీ వెళ్లినప్పుడు వారిని చూసేందుకు వెళ్లారు. ఆయనే స్వయంగా వచ్చి 'మీరు విశాఖపట్నం బుద్ధవరపు వారా?' అని అడిగారట. వెంటనే 'కుతుకులూరు బుద్ధవరపు వారం' అన్నారట వేంకటరత్నం. 'కాకినాడలో కూడా బుద్ధవరపు వారి ప్రత్యేకతను చాటుతూ బుద్ధవరపు వారి సందు ఉంది' అని గుర్తు చేసుకున్నారట. 'ఏమయినా పని ఉందా' అని ప్రశ్నించారటాయన. 'కేవలం తమను చూడాలనే వచ్చాం' అన్నారట సోదరులు.

సమరయోధుడిగా, స్వయంసేవకుడిగా, పాత్రికేయుడిగా, కథ, నవలల రచయితగా, వివిధ పత్రికలలో ధారావాహికలు రాసిన రచయితగా, స్వాతి కాలమిస్ట్‌గా విశేష సేవలు అందించారు బుద్ధవరపు వేంకటరత్నం. 1942 నుంచి 1969 వరకు వారి కథలు, ధారావాహిక నవలలు, వ్యాసాలు భారతి, సారంగి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలలో అచ్చయ్యాయి. 50 నుంచి 60 వరకు కథలు రాశారు. భారతి మాస పత్రికలో గ్రంథ సమీక్షలు చేసేవారు. 'శండిల' కలం పేరుతో రచనలు చేసేవారు. విశేషమేమంటే.. ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక 18-3-1953 నాటి సంచికలో వారు రాసిన 'కరిణీకం' పెద్ద కథలో కరణాల లొక్యం గురించి చెప్పకనే చెప్పేరు. 1949-50లలోనే వేంకటరత్నం కథలు రేడియోలో ప్రసారమయ్యాయి.

వేంకటరత్నం 1948 నుంచి 1957 వరకు సంపాదకులుగా వ్యవహరించారు. ఈయనను అరెస్టు చేసిన తరువాత భండారు సదాశివరావు కొద్దికాలం ఆ బాధ్యతలు చూశారు. తరువాత ఆయన కూడా అరెస్టయ్యారు.

ఎమర్జెన్సీలో (1975) వేంకటరత్నం గారిని కాకినాడ జైలులో నిర్భంధించారు. కానీ వారం తరువాత విడుదల చేశారు. ఆంధ్ర రాష్ట్ర గ్రామోద్యోగుల సంఘం కార్యదర్శి (1956-87)గా 30 ఏళ్లు సేవలు అందించారు. వంశ పారంపర్య కరణాల వ్యవస్థ రద్దు నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వద్దకు రాష్ట్ర గ్రామోద్యోగుల సంఘం కార్యదర్శిగా తాను, ఆనాటి సంయుక్త కార్యదర్శి ద్రోణంరాజు సత్యనారాయణ చర్చలకు వెళ్లి గ్రామాలలో ఆ వ్యవస్థ అవసరం గురించి వాదించారు. కనీసం ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు వరకు కరణం, మునసబులను కొనసాగించాలని చేసిన విజ్ఞప్తి ఫలించలేదు. తరువాత తీసేసిన కరణాలలో అర్హులైన వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా వీఏఓలుగా తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించినా వేంకటరత్నం మళ్లీ ఆ వ్యవస్థ జోలికి పోలేదు. హైదరాబాద్ వచ్చి పూర్తి స్థాయి పాత్రికేయ వృత్తిని కొనసాగించారు. అప్పటి వరకు స్వయంసేవకుడిగా సేవలు అందిస్తూ, కరణీకం చేస్తూ పాత్రికేయ వృత్తిని ప్రవృత్తిగా ఎంచుకున్న వేంకటరత్నం పూర్తి సమయం పాత్రికేయుడిగా జీవనయాత్ర ప్రారంభించారు. ఆంధ్రప్రభలో, న్యూస్ ఏజన్సీలలో రెహనుమా-ఏ-దక్కన్, సియాసత్, సాగే దక్కన్, హమారా ఆవామ్ ఉర్దూ దిన పత్రికలలో రిపోర్టర్‌గా పనిచేశారు. 2007వ సంవత్సరానికి ఉత్తమ తెలుగు రచయితకి ఇచ్చే బహుమతిని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేంకటరత్నంకు ఇచ్చింది.

జనవరి 1, 2006న పనులు ముగించుకుని తిరిగి వస్తూండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కాలు తీసి వేయవలసి వచ్చింది. ఆ ప్రమాదంలోనే నాలుక చీలి ముక్కలైనా, మాట ముచ్చట అంతంత మాత్రమే అయినా (అనర్గళంగా ఉపన్యాసాలు ఇవ్వడమే కాకుండా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, వాజపేయి వంటి పెద్దలు ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో ఆ నేతల హిందీ ప్రసంగాలను తెలుగులోకి అనువదించిన గంభీర గళం వారిది) మొక్కవోని ధైర్యంతో జీవించారు. అప్పటికి చాలాకాలం క్రితమే వారి శ్రీమతి కన్నుమూశారు. ఆ పరిస్థితులలో పాత్రికేయ వృత్తికి స్వస్తి చెప్పక తప్పలేదు. దాదాపు రెండు దశాబ్దాలు మంచానికే పరిమితమయ్యారు. వేంకటరత్నం ఒక యోగి. కష్టాలను అనుభవిస్తున్నా బయటకు వ్యక్తం చేయని స్థితప్రజ్ఞులు.

– బీఎస్ రామకృష్ణ, (సీనియర్ జర్నలిస్ట్)

భాగం-10

తత్వశాస్త్రంలో అణు విజ్ఞానం

శూన్యంలో తిరిగే పరమాణువులు పతనం చెందితే సృష్టి ఏర్పడిందని పాశ్చాత్యులు భావించారు. కానీ మన సిద్ధాంతం ప్రకారం శూన్యం నుంచి పుట్టేది శూన్యమే అవుతుంది కానీ వేరేదీ కాదు. విడిపోయి స్వతంత్రతను పొందిన పరమాణువుల నుంచి సృష్టి వికాసం కానీ పతనం కానీ జరిగే అవకాశమే లేదు.

అన్నివిధాలా అభ్యుదయాన్ని కలిగించేది – పరంపరగా శ్రేయస్సులు కలగడానికి కారణమైనది అయిన భగవానుని రూపమే ధర్మం. అట్టి ధర్మ స్వరూపాన్ని పాశ్చాత్యులు తప్పుగా అర్థం చేసుకున్నారు. వారి తత్వబోధ లక్ష్యమంతా సుఖప్రాప్తికి మార్గాలను తెలుసుకోవడంలోనే ఉంది. సుఖమే జీవితలక్ష్యం. విశ్వనియమాలను అర్థం చేసుకోవడం ద్వారా సుఖ సాధన సులభం అవుతుంది. ఆ నియమాలను అర్థం చేసుకోకపోవడం వల్లనే మానవులు, 'రహస్యభూతమైన కారణం' అనే కల్పన చేసుకుని, దానివల్ల భయపడు తుంటారు. విముక్తియే సుఖం. మృత్యువు వల్ల అనుభవ శక్తి నష్టమైపోతుంది. అందువల్ల మృత్యువు ఉద్వేగానికి కారణం కాదు. ఎప్పుడైతే మృత్యువు వల్ల ఒకని ఉనికి లేదా ఆత్మ 'సత్త' నశించిపోతాయో... అప్పుడు చింతన చేయడానికి అవకాశం కూడా ఎక్కడినుంచి లభిస్తుంది?

జ్ఞానం వల్ల లభించిన కారణంగా సుఖం లేదా ఆనందం అనేది స్వచ్ఛమైనది. మంచిదే. అజ్ఞానం నుంచి పుట్టిన కారణం వల్ల దుఃఖం చెడ్డది. స్టోయిక్ (తత్వవేత్త) అభిప్రాయంలో సద్గుణమే సుఖం. ఎపిక్యురస్ అభిప్రాయంలో ఆనందం కోసం సద్గుణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. స్టోయిక్ ప్రకారం గుణాల ఉపయోగ మంతా గుణాలను పొందడంలోనే ఉంటుంది. గుణవృత్తి చేత దుఃఖం కూడా సంభవమే. దాని వల్లనే సుఖమూ లభిస్తుంది. ఎపిక్యూరస్ ప్రకారం గుణము సుఖసాధనకు సాధన మాత్రమే. బకవేళ ఆనందానికి సాధనం కాకపోతే గుణానికి ఉపయోగం ఏముంటుంది? (ఆనందం సాధనతో సాధ్యం కాకపోతే, దానికి గుణత్వం కూడా ఉండదు) మానవులు ఎప్పటివరకు ఆనందంగా ఉంటారో, అప్పటివరకు మహత్వము, బుద్ధి, న్యాయశీలత మొదలైన గుణాలు వాటియందు కనిపించవు. కానీ బుద్ధికుశలత మొదలైన గుణాలు శాశ్వతమైనవి కావు. అంతేకాకుండా అవి సాపేక్షమైనవి, మార్పు చెందుతుంటాయి.

డెమక్రటీస్ కూడా ప్రకృతి – పరమాణువుల కలయితో ఏర్పడిందనే సిద్ధాంతాన్ని అంగీకరిస్తాడు. అతని అభిప్రాయంలో 'పరమాణువులు శూన్యంలో తిరుగుతుంటాయి.' దీని ప్రకారం, 'పరమాణువుల కదలికలతో సమానంగా, ప్రకృతిలోని సంక్లిష్ట గతిశీలతలు పుట్టుకు రావు. అందువల్ల విశ్వసృష్టి కూడా కష్టసాధ్యంగా మారుతుంది.' ఈ కారణం చేతనే ఎపిక్యురస్, పరమాణువుల వక్రగతిని పతనంగా భావించాడు. అట్టి పతనం వల్లనే విశ్వసృష్టి జరుగుతోందన్నాడు. కానీ శూన్యం నుంచి శూన్యమే పుడుతుంది. వేరేదీ కాదు. అలా కాకపోతే ఎవరినుంచైనా ఏదైనా పుట్టే అవకాశం ఉంటుంది. ఏది ఉన్నదో అది శరీరధారి అయి ఉంటుంది. ఏది లేదో అది శూన్యమే అవుతుంది.

అణువులు అవిభక్తమైనవి. మార్పు చెందవు. గతిశీలమైనవి. పరస్పరం అభిముఖంగా రావడం వల్ల వాటిమధ్య సంయోగం ఏర్పడుతుంది. వీటి గతి అనాది నుంచి ఉంది. పరిమాణం, ఆకారాలకంటే మించినదైన ఏ గుణమూ వాటికి లేదు. అతడి అభిప్రాయంలో ఆత్మ కూడా ఒక అణు విశేషమే. వస్తువు నుంచే విభిన్నమైన జీవన క్రియను ప్రదర్శించడం కోసం ఆత్మ తాలూకు సృష్టి (కల్పన) జరిగింది. 'మతం విధించే బంధనాల నుంచి విడివడి, ప్రకృతిని అధ్యయనం చేయడమే డెమక్రటీస్ తత్వ సారాంశం' అని అతని అనుయాయులు చెబుతుంటారు. కానీ అది అంతమాత్రమే కాదు. దేనినుంచి అయితే చ్యుతి లేని పరిమాణం సంభవమో అట్టి అణువుల పరిమాణాన్ని గురించి అతడు చెప్పవలసింది.

'యతః అపకృష్ట పరిమాణం నాస్తి తత్ అణుపరిమాణం'. సూక్ష్మత కోసం ప్రయత్నించి ప్రయత్నించి... వాచస్పతి అయిన బ్రహ్మదేవుడి మతి చాలా అలిసిపోయింది. అంతగా సూక్ష్మతను పొందిన నిరతిశయ సూక్ష్మ భాగాన్నే పరమాణువు అని చెప్పారు. అలా విడిపోయి స్వతంత్రత పొందిన పరమాణువులలో ప్రపంచ సృష్టి ఆరంభం కానీ, వినాశానుకూల స్థితి స్వతహాగా సంభవించదు. ఎందుకంటే చేతన చేత అధిష్టించని జడ పదార్థాలలో అభీష్ట కార్యకారిత్వాన్ని చేపట్టగల విలక్షణత ఉండదు. అందువల్ల స్వతంత్ర రూపం చేత వక్రగతి లేదా సరళమైన కదలిక చేత సృష్టి నిర్మాణం సాధ్యం కాదు. అంతేకాకుండా దృశ్యమానం కాని ఈశ్వర సాపేక్ష స్థితి వల్లనే పరమాణువుల నుంచి ఎప్పుడైనా సృష్టి లేదా వినాశం జరుగుతుంటాయి.

ఈజిప్టులోని అలెగ్జాండ్రియా నగరంలో ప్లేటోనిజం ప్రభావంతో మతం, తత్వశాస్త్రాల కలయిక ఏర్పడింది. 'అనంత ప్రజ్ఞారూపిణి అయిన రహస్యపూర్ణ సత్త నుంచే అన్ని వస్తువుల ఉత్పత్తి జరిగిందని... అట్టి సత్తను జయించడం సాధ్యం కాదని' వారు నమ్మేవారు. వారు ప్రపంచ ఉత్పాదినీ శక్తినే ఈశ్వరునిగా భావించి, అదే ఈ ప్రపంచ వ్యవహారాలన్నింటినీ నడుపుతోందని భావించారు. ఈశ్వరుడు తనలోని సంకల్పం నుంచే విశ్వాత్మను సృష్టి చేస్తున్నాడు. విశ్వాత్మయే సమష్టి జగత్తుగా ఏర్పడింది. అదే వైయక్తికమైన ఆత్మ కూడా. భూ సంబంధం చేత విశ్వాత్మకు అవనతం (కిందికి దిగడం) కలుగుతుంది. ఈ భూసంబంధాన్ని తెంచడం ద్వారా దానికి పూర్ణ సత్త లభించి ఉత్థానం చెందుతుంది.

(వచ్చేవారం... భౌతికవాదంలో ఈశ్వరుడు)

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ



ఆమెకు చూపులేదు. లో చూపు ఉంది!
మిగతా అందరిలా ఉండదామె. మిన్నగా ఉంటుంది!
ఇతరుల్లా చదువలేదుకానీ, తనకు తానుగా
చదువుకుంటుంది!
విధిరాతను నమ్మదసలు. తన తలరాతను తానే రాసుకుని,
ముందుకు దూసుకెళ్లింది. దూసుకువెళ్తూనే ఉంది ఇప్పటికీ!
పేరు రష్మి. ఇంటిపేరు మరువాడ. స్వస్థలం విశాఖ. తండ్రికి
ఉద్యోగం కోల్‌కతాలో కాబట్టి అక్కడే నివాసం.
ఆ మధ్య విశాఖలోని న్యాయ విశ్వవిద్యాలయం నుంచి ఏకంగా
బంగారు పతకం అందుకుంటీ అమ్మాయి.
విభిన్న ప్రతిభావంతురాలు. అవును, ఆ యువతి ప్రతిభ, దక్షత,
సంకల్పం, సాధించి తీరడం – అంతా విభిన్నమే!
ఎలా సాధ్యమైందీ ప్రత్యేకత?

చూపులన్నీ ఆ

ఆ రోజు విశాఖలోని సువిశాల మందిరంలో స్నాతకోత్సవ సదస్సును ఏర్పాటు చేసింది దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం. ప్రధాన అతిథిగా మాట్లాడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సూర్యకాంత్ పలుమార్లు ఉక్కు సంకల్పం గురించి విపులీకరించారు. న్యాయవాద రంగంలోకి వనితలు మరింతగా రావాలనీ, యువతమీద ఈ బాధ్యత ప్రధానంగా ఉందనీ అంటున్నపుడే రష్మీ పేరు ప్రస్తావన!

విశిష్ట అతిథిగా ప్రసంగించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, విశేష అతిథిగా ఉపన్యసించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ; ఉత్సవ సభకు అధ్యక్షత వహించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్.... ఈ సుప్రసిద్ధులంతా యువతరంలో ఉండాల్సిన వృత్తి నిబద్ధతను చాటి చెప్పారు. ఆ అన్ని సందర్భాల్లోనూ రష్మీవైపే అందరి చూపూ!

తన తనయ బాగా చదవాలనీ, సమాజానికి ఉపకరించే వృత్తిని చేపట్టాలనీ ముఖ్యంగా రష్మి తండ్రి ఆశ, ఆశయం.

ఆమెకు దృష్టి లేదని ఆయన కుంగిపోలేదు 'చదువు ఎలా' అని నిరాశకు లోనవలేదు. బ్రెయిలీ లిపి ఆధారంగా ముందడుగు వేయించారు. ముందంజ వేసింది కూతురు.

చూసి చదవులేని, రాయలేని వారికి ఏకైక ఆశాకిరణం బ్రెయిలీ లిపి. చూడలేనివారికి స్పర్శ రచన పద్ధతిని అలవాటు చేయడం, ప్రత్యేకంగా ఉండే కంప్యూటర్ స్క్రిన్స్, మరికొన్ని ఎలక్ట్రానిక్ సంబంధాలు దోహదమవుతుంటాయి ఎప్పుడూ.

చుక్కల ఉపయోగంతో ప్రస్ఫుటమైన రచనా సంవిధానం. బ్రెయిలర్‌లోని పాయింట్లు– అక్షరాలు, వర్ణమాలలు, సంకేతాల ఆకారంలో రూపొందినవే. పదాలు, సంఖ్యలు, ఇతర వాటిని సైతం గుర్తించే సావకాశముంది. చుక్కల గుర్తింపు ద్వారా భాష సంబంధ అక్షరాలు/పదాలు అవగతమవుతుంటాయి.

ఫ్రెంచి విద్యావేత్త బ్రెయిలీకి పఠన, రచన వ్యవస్థలు రుణపడే ఉంటాయి ఎప్పటికీ. ఈ ప్రత్యేక స్పర్శ రచన సంవిధానమే కనుచూపుగా పరివర్తితమవుతుంది అన్నివేళలా!

స్పర్శలోనే రాయవచ్చు, చదవవచ్చు, విరామచిహ్నాలను కూడా అమరికల రీత్యా తెలుసుకోవచ్చన్నమాట. పేజీ/ఉపరితలంపైన పెరిగిన చుక్కల శ్రేణులపరంగా వేళ్లను కదలిస్తూ చదువుకోవచ్చు. ఈ పనే చేసింది రష్మీ.

బ్రెయిలీ లిపి మీద పట్టు సంపాదించడంవల్లనే పదో తరగతి పరీక్షల్లో నూటికి 77 మార్కులు సాధించింది.

ఇంటర్మీడియట్‌లో 85 శాతం సాధించి సత్తా చాటారు. న్యాయశాస్త్రం చదవాలన్న దృఢదీక్షతో ఉమ్మడి పరీక్ష రాసి ప్రవేశం సంపాదించింది. అదీ మంచి ర్యాంకుతో!

అది 2018. విశాఖ వర్సిటీలోనే ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీలో స్థానం పొందింది. బ్రెయిలీ లిపి పరంగా అక్కడే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని మరింత పెంచుకుంది. అంతేకాదు; రెండేళ్ల కిందట కంప్యూటర్‌పైనే పరీక్షలు రాసి 'శభాష్' అనిపించుకుంది అందరితోనూ! అక్కడ ఉత్తమత్వమే.

వైకల్యం అనే పదమే అనడానికి / వినడానికి / రాయడానికి ఇబ్బందికరంగా ఉంటుంది కదా. అసలు ఆ పదం గురించే ఒక్క క్షణమైనా అనుకోదు రష్మి. అనదు కూడా 'సకలం' అనే మాటనే ఎప్పటికీ ఇష్టపడుతుంటుంది తను.

ఇదంతా చదువుతుంటే మనకు ఒక చలనచిత్ర కథ గుర్తుకొస్తుంది. ఇలాగే ఒక అమ్మాయి, అంధత్వాన్ని అధిగమిస్తుంది. అదృష్టం అనే పదానికే సవాలు విసురుతుంది. మనిషి తలచుకోవాలే కానీ, ఏదీ అసాధ్యం కాదని నిరూపిస్తుంది.

న్యాయవాదాన్ని వృత్తిగా తీసుకున్న ఆ కథానాయిక నిజ జీవితంలోనూ నేతగా నిలుస్తుంది.

రష్మిదీ సవాళ్లను స్వీకరించే తత్వమే. ఉదాహరణలు ఇంకా అనేకం ఉన్నాయి.

1. విశాఖలోని లా వర్సిటీ నుంచి బీఏ ఎల్ఎల్బీ

2. ముంబయిలో ఉన్న టాటా ఇన్స్టిట్యూట్ (సామాజిక శాస్త్రాలు) నుంచి ఎల్ఎల్ఎం. అదే విద్యా సంస్థ నుంచి సోషల్సైన్సెస్లోనే ఎంఏ చేయడం. ఈ కోర్సు పేరు : డిజీబిలిటీ స్టడీస్ అండ్ యాక్షన్.

విశాఖలోనే స్నాతకోత్సవ సభావేదిక మీద డిగ్రీని అందుకుంది. అదీ న్యాయమూర్తుల చేతులమీదుగా!

సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆదర్శప్రాయ.

సామాజిక, మానవీయ శాస్త్రాల అధ్యయనంలో న్యూరిదాయని. కఠినతర అసైన్మెంట్లను దిగ్విజయంగా పూర్తి చేసింది.

సహాయ పరికరాల వినియోగాన్ని పూర్తి చేసుకుంది.

మె వైపు!

ఫలితంగా, మార్కుల వరాలు ఆమెకు లభించాయి.

అప్పట్లో ఆంగ్లంలో 90 శాతం మార్కులు. మనస్తత్వశాస్త్ర పరీక్షలో 86 శాతం.

పౌర హక్కుల అధ్యయనానికి సంబంధించి 88.

న్యాయ సంబంధ పరీక్షలపరంగా 77శాతం మార్కులు.

ఇవన్నీ రష్మి ధీశక్తికి ఉదాహరణలు. విధిని ఎదిరించి విజయం సాధించిందని చాటిచెప్పే తార్కాణాలు.

'ఇవన్నీ ఏ విధంగా సాధ్యమయ్యాయి మీకు' అని అడిగితే....

ఇవీ ఆమె సమాధానాలు. ఆ మాటల్లోనే చెప్పాలంటే.

1. నా శక్తి నాది, పూర్తిగా ఎవరిపైనా ఆధారపడను.

2. చదువు గురించి నా ఆలోచనలు నాకున్నాయి.

3. అవకాశాల కోసం అన్వేషిస్తాను. సాంకేతికంగా అవసరమైనపుడు అమ్మ నా వెంట ఉంటుంది. స్నేహితురాలి మాదిరిగా సహకరిస్తుంది.

4. నడిచేటపుడు ఇతరుల సాయాన్ని అంతగా కోరుకోను. దారి చూపించాలనో, చేయిపట్టుకోవాలనో అడగను. నా శక్తిని, సామర్థ్యాన్ని ఉపయోగించి ముందుకు నడుస్తానే తప్ప- ఎవరి అండదండలో కావాలని ఎదురు చూడను. ఇది నా మీద నాకున్న నమ్మకం. ధైర్యంగా ఉండాలన్న గట్టిపట్టుదల.

5. చదువుతోపాటు కొన్ని పోటీల్లో పాల్గొనడం నాకు ఎంతో ఇష్టం. కొన్నేళ్ల క్రితం ఒక సంస్థ ఓ కొత్త తరహా పోటీ పెట్టింది. ఆ సంస్థ పేరు - నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఇండియా). సృజనాత్మకంగా ఎలా ఉండాలన్న ఆలోచన చేశాను. కంప్యూటర్ ఆధారిత మూడు చక్రాల సైకిల్ గురించి భావన రాగానే, ఆచరణకు తెచ్చాను. దీంతో ఎవరు ఎక్కడి నుంచి ఎక్కడికైనా బండిని నడుపుతూ వెళ్లపచ్చన్న మాట.

6. నాకు ఆటలన్నా ఇష్టమే. ట్రెక్కింగ్ వంటివి చేయాలని ఉంటుంది కొన్నిసార్లు. కొండను అధిరోహించాలన్న ఆలోచనా వస్తుంటుంది చాలాసార్లు. ఆసక్తితో ఒక కోర్సు చేశాను కూడా. భయంతో ఏదీ సాధించలేం. ధైర్యంతో ఏదైనా ఎలాగైనా సాధించగలం. ఇదే నా సిద్ధాంతం.

7. ఏదో ఒక లోపముందని బాధపడుతూ కూర్చుంటే ప్రయోజనమేమిటి? ఆ ఆలోచనను పక్కనపెట్టి, సొంతంగా ఆలోచన చేసి, మనకంటూ కొన్ని లక్ష్యాలు ఏర్పాటుచేసుకుంటే... అదీ జీవితం అంటే!

రష్మీ మనోనిబ్బరాన్ని, ఆత్మబలాన్ని వెల్లడి చేస్తున్నాయి కదా ఈ అన్నీ. అందుకనే, తనదైన మార్గంలో నడిచింది, నడుస్తోంది. సాధించింది, ఇంకా సాధించనుంది. ఎవరి శక్తిని వారు తెలునుకుంటే అద్భుతాలు జరుగుతాయని చెప్తోందామె.

'న్యాయవిద్యపైనే ఎక్కువ మక్కువ ఎందుకు?' అని ప్రశ్నిస్తే....

1. ప్రశ్నించడం అనేది మనకు ఉండాల్సిన లక్షణం.

2. న్యాయం, అన్యాయం మనందరికీ తెలుసు. న్యాయాన్నే గెలిపించాలన్నది ఒక్కటే నాకు తెలుసు బాగా. ఎందుకంటే - న్యాయం ఎన్నడూ ఓడిపోకూడదు. ఓడిపోనివ్వకూడదు.

3. మంచి, చెడు పక్కపక్కనే ఉంటుంటాయి. ఏది ఏమిటన్నది తెలుసుకోవడమే మన పని. తెలుసుకున్నదాన్ని ఆచరణలో పెడితే న్యాయాన్ని గెలిపించినవాళ్లమవుతాం. మనకు ఎందుకు? మనమే ఎందుకు చేయాలి? ఎవరికీ పట్టనిదాన్ని మనమెందుకు తలకెత్తుకోవాలీ అనుకుంటే మటుకు అది మనిషి జన్మ కానట్లే! నిజాన్ని నిర్భయంగా చెప్పాలి. నిజం కాని దాన్ని బోనులో నిలబెట్టాలి. ఇదీ మొదటి నుంచీ నా పంతం, ప్రయత్నం.

4. చదువుకున్న న్యాయవిద్యను సార్థకం చేసుకుంటా. వృత్తిలో సైతం ముందు భాగంలోనే ఉంటా.

బంగారు తల్లి రష్మీ ఎంచుకున్న న్యాయశాస్త్ర ప్రధాన అంశం: క్రిమినాలజీ, డ్రగ్కంట్రోల్ లా.

అందులోనే ఆమె అగ్రస్థాయిన నిలిచి, స్వర్ణాన్నికైవసం చేసుకుంది.

భవిష్యత్ ధ్యేయం గురించి తనకు కలలున్నాయి. వాటిని సాకారంచేసుకునే విధానాలూ తన అధీనంలోనే ఉన్నాయి. 'దివ్యాంగురాలు అనే మాట పదే పదే అనకండి ఎవ్వరూ! ఆ పిలుపులో బయటపడాల్సింది. సానుభూతి కాదు. ఎప్పుడూ ఎవరూ సానుభూతినే కోరుతూ ఉండరు. మనిషిలోని శక్తిని చూడాలనే ఆశిస్తారు. అదే జరగాలి. ప్రోత్సాహమిస్తే, ఎవరు ఎంతైనా సాధించవచ్చు. దీనికి నన్ను నేనే తార్కాణంగా అనుకుంటా. ఇంకా చదవాలని ఉంది నాకు. సామాన్యులను ఆదుకునే పనులను మరింతగా చేయాలనుంది.'

దూరమెంతో ఉందని దిగులుపడకు, బాధపడకు!
అవరోధాల దీవుల్లోనే ఉంటుంది ఆనంద నిధి!
సంకల్పం నీదైతే; నీ ముందు సాగిలపడి చేతులెత్తి మొక్కుతుంది విధి!

ఈ వాక్యాలే తనకెంతో ఇష్టమంటోంది రష్మీ!

జంధ్యాల శరత్బాబు
సీనియర్ జర్నలిస్ట్

ఎస్ఐఆర్ అంటే అంత గుబులు ఎందుకో?

ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం-ఈసీ తాజాగా తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -ఎస్ఐఆర్) ప్రారంభించింది. బిహార్‌లో విజయవంతంగా పూర్తయిన ఈ ప్రక్రియను ఇప్పుడు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కేరళతో పాటు అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో నవంబర్ 4న మొదలు పెట్టింది. ఈ జాబితాలోని బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అసోంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు ఉండగా అక్కడ ఎస్ఐఆర్ కోసం ప్రత్యేక తేదీని ప్రకటిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇటీవల వెల్లడించారు.

దేశ వ్యాప్తంగా 321 జిల్లాల పరిధిలోని 1850 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ చేపట్టారు. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి మొత్తం 51 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరందరి వివరాలను డిసెంబరు 4 వరకు ఎన్నికల కమిషన్ సేకరించనుంది. డిసెంబర్ 9న సవరించిన ఓటర్ల జాబితా ముసాయిదాను ఈసీ విడుదల చేయనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియనుంది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు 5.3లక్షల మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), 7.64లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), 10,448 ఈఆర్ఓ/ఏఈఆర్ఓలు, 321 మంది డీఈవోలు విధుల్లో నిమగ్నమయ్యారని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ సమయంలో ఈఎఫ్ఎల పంపిణీ, సేకరణ కోసం బీఎల్ఓలు ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్తారని వివరించింది.

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

విపక్షాల ద్వంద్వ వైఖరి

ఓటర్ల జాబితా సవరణపై విపక్షాల ద్వంద్వ వైఖరి స్పష్టంగా బయటపడుతోంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ బీజేపీపై, ఎన్నికల కమిషన్ మీద ఓట్ చోరీ ఆరోపణలు చేస్తున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడి బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందని, ఎన్నికల సంఘం అందుకు సహకరిస్తోందని రాహుల్ గాంధీ చెబుతున్నారు. ఎస్ఐఆర్ అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి జరుగుతోంది. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కలిసి ఈ చర్యను సమన్వయం చేస్తున్నారు అంటూ అర్థం లేని వ్యాఖ్యలు చేశారు రాహుల్.

దీనికి తృణమూల్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, డీఎంకే, వామపక్షాలు వంత పాడుతున్నాయి. వాస్తవానికి ఎన్నికల్లో అక్రమాలను అరికట్టడానికి ఎస్ఐఆర్ చేపట్టారు. ఇందుకు విపక్షాలు ఏమాత్రం సహకరించకపోగా వ్యతిరేకిస్తున్నాయి. పైగా ఎస్ఐఆర్ ప్రక్రియ అక్రమాలను కప్పిపుచ్చి, అధికారికంగా గుర్తింపు ఇవ్వడానికే ఉద్దేశించింది అంటూ నిందలు వేస్తున్నారు. ఇక్కడే వీరి దురుద్దేశ్యాలు స్పష్టమై పోతున్నాయి.

మమతకు అంత ఉలుకు ఎందుకో?

2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్-టీఎంసీ కోల్‌కతాలో భారీ ప్రదర్శన నిర్వహించింది. ఎస్ఐఆర్‌ను అమలు చేస్తే రక్తపుటేరులు పారిస్తామని ముఖ్యమంత్రి హోదాను మరచి మరీ బెదిరించారు మమత. ఎన్నికల సంఘాన్ని పూర్తిగా రాజీపడిన సంస్థగా, ఎస్ఐఆర్‌ను మోసపూరితపనిగా అభివర్ణించారు. అయితే టీఎంసీ నిరసనలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా టీఎంసీ వ్యవహరిస్తోందని దుయ్యబట్టింది. మమతా బెనర్జీ దీనిలో లోపాలను ఎత్తి చూపాలనుకుంటే సుప్రీం కోర్టును ఆశ్రయించాలని సూచించింది.

అయితే ఎస్ఐఆర్ అంటే మమతా ఇంతలా భయపడిపోవడానికి కారణం ఉంది. 2023 తర్వాత బెంగాల్ జనాభాలో 13.8 శాతం పెరుగుదల చోటు చేసుకుంటే ఓటర్ల సంఖ్య మాత్రం ఏకంగా 61.6 శాతం పెరిగిపోయింది. కేవలం రెండేళ్లలో ఇంత పెరుగుదల నమోదు కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలోలో దాదాపు కోటిన్నర మంది వరకూ బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇంత కాలంగా అక్రమ చొరబాటుదారుల ఓట్లతోనే ఈ కుహనా సెక్యులరిస్టులు గెలుస్తున్నారా అనే అనుమానం రాక తప్పదు.

ఢిల్లీలో ఇటీవల బాంగ్లాదేశీయుల ఏరివేత జరిగినప్పుడు ఇక వింత జరిగింది. ఇక్కడ చిన్నచిన్న పనులు చేసేవారు హఠాత్తుగా మాయమయ్యారు. ఎందుకీలా జరిగిందని విచారిస్తే వీరిలో ఘోరమైన నేరాలు చేస్తున్నవారు ఉన్నట్లు బయటపడింది.. వీరంతా బాంగ్లాదేశ్‌కు తిరిగిపారిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కోల్‌కతాలో కూడా ఇదే పునరావృత్తమైంది. ఎస్ఐఆర్ మొదలు కాగానే చాలా మంది నరిహద్దులు దాటి వెళ్లిపోతుండగా పట్టబడ్డారు. ఇలాంటి విదేశీయుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. వీరిని

గుర్తించడంతో పాటు వారి పేర్లు ఓటర్ల జాబితా లోంచి తొలగిస్తున్నారు. అలాగే ఆధార్, రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను స్వాధీనం చేసుకొని తిప్పిపంపేస్తున్నారు.

కొద్ది రోజుల క్రితం బెంగాల్‌లోని బీర్భూమ్‌లో 95 ఏళ్ల వృద్ధుడు క్షితీశ్ చంద్ర మజుందార్ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు ఎస్ఐఆర్‌కు భయపడే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తృణమూల్ ప్రచారం చేస్తోంది. టీఎంసీ ఆరోపణలను బీజేపీ ఖండించింది. తృణమూల్ బెదిరింపుల ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించింది. రాష్ట్రంలో ఎవరూ చనిపోయినా దానికి ఎస్ఐఆర్ కారణమని టీఎంసీ అబద్దాలు చెబుతోందని విమర్శించింది. బెంగాల్‌లోని పూర్బస్థలీ ఉత్తర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓ చెరువులో వేలాది ఆధార్‌కార్డులు లభించడం రాజకీయ దుమారం రేపింది. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. సీఎం మమతా బెనర్జీ, టీఎంసీ దేశ అంతర్గత భద్రతను తాకట్టు పెట్టారని ఆరోపించింది. చొరబాటుదారులకు రాష్ట్రం ఓ సురక్షితమైన స్థావరంగా మారిందని ఈ ఘటన రుజువు చేస్తోందని పేర్కొంది.

కేరళలో ఆధార్‌తో మోసం

కేరళలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యతిరేస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఏకంగా రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదింపజేశారు. కేరళతో సహా ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలనే ఈసీ నిర్ణయం ప్రజాస్వామ్యానికి ముప్పు అని వ్యాఖ్యానించారు విజయన్. ప్రజాస్వామ్యాన్ని గౌరవించేవారందరూ ఏకమై రెండో దశ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. బహుళ రాష్ట్రాలకు విస్తరిస్తున్న ఈ ప్రక్రియ, సార్వత్రిక ఓటు హక్కును అణగ దొక్కడానికి, ఓటర్ల జాబితాలను తారుమారు చేయడానికి ఓ ప్రయత్నమని ఆయన హెచ్చరించారు. ఎస్ఐఆర్ పేరిట కేంద్రం ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తుందని ఆరోపించారు.

కేరళలో జనాభా 3,60,63,000 అయితే ఆధార్ కార్డుల సంఖ్య మాత్రం 4,09,68,282. ఇందులో ఏమిటి తిరకాసు అని విశ్లేషకులు అనుకుంటున్నారు. బోగస్ రేషన్ కార్డులను అడ్డుపెట్టుకొని అక్కడి అధికార వామపక్ష నాయకులు,కార్యకర్తలు ప్రజాపంపణి వ్యవస్థ ద్వారా జారీ అయ్యే రేషన్ బియ్యాన్ని మింగేస్తున్నారు. ఎస్ఐఆర్ నిర్వహిస్తే ఈ ఆధార్ స్కామ్ మాత్రమే కాకుండా ఇంకా ఎన్ని అక్రమాలు బయట పడతాయో నని పినరయ్ ప్రభుత్వం భయపడి పోతోంది. కేరళలో బీజేపీ మినహా అన్ని పార్టీలూ ఎన్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయి.

డీఎంకే వింత వైఖరి

తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం కూడా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తోంది. 'ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, చట్ట విరుద్ధంగా' చేపడుతున్న ఎస్ఐఆర్‌ను ఆపాల్సిందేనని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరిగిన అఖిల పక్ష సమావేశం డిమాండ్ చేసింది. లేకుంటే అన్నీ పార్టీల తరపున చట్ట పోరాటం దిశగా సుప్రీం కోర్టులో పిటిషన్ల దాఖలుకు తీర్మానించారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న ఎస్ఐఆర్ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని ఈ సమావేశంలో

రాష్ట్రంలో ఎవరూ చనిపోయినా దానికి ఎస్ఐఆర్ కారణమని టీఎంసీ అబద్దాలు చెబుతోందని విమర్శించింది. బెంగాల్‌లోని పూర్బస్థలీ ఉత్తర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓ చెరువులో వేలాది ఆధార్‌కార్డులు లభించడం రాజకీయ దుమారం రేపింది.

తీర్మానించారు.

తమిళనాట పాగా వేయడం కోసం బీజేపీ ఎస్ఐఆర్ ముసుగులో కొత్తకుట్రలకు సిద్ధమైందని స్టాలిన్ ఆరోపణ. ప్రత్యర్థులు ఎంత పెద్దవారైనా.. ఎన్ని కుట్రలు పన్నినా.. మమ్మల్ని ఓడించలేక పోయారు! సైద్ధాంతికపరంగా మాపై గెలవలేకనే.. 'ఎస్ఐఆర్' రూపంలో అడ్డదారులు వెతుక్కుంటున్నారు. ఇంత హడావుడిగా ఈ ప్రక్రియను నిర్వహించాల్సిన అవసరం ఏముంది? దీనిపై మా పోరాటం కొనసాగుతుంది" అని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మరోవైపు తమిళనాడులో బీజేపీ మిత్రపక్షమైన ఏఐఏడీఎంకే ఎస్ఐఆర్‌ను స్వాగతించింది. ఎస్ఐఆర్ ఇంటే సీఎం స్టాలిన్‌కు అలర్జీగా మారిందని ఎద్దేవా చేశారు. ఇందుకు సంబంధించి ఓ పోస్టర్‌ను సైతం అన్నాడీఎంకే కార్యాలయం వద్ద పొందు పరచడం గమనార్హం.

ఇక డీఎంకే అఖిలపక్ష భేటీ నాటకం అని కేంద్ర సహాయమంత్రి ఎల్. మురుగన్ ఆరోపించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నాటకాన్ని తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా డీఎంకే కూటమి పార్టీల తరపున సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ★



ప్రకటిత భారతీయం.

ఆయన ఒక్క వాక్యంతో ఎన్నో నిర్జీవమైన బ్రాండ్లను మార్కెట్‌లో నిలబెట్టారు. కేవలం 60 సెకన్లలో బోల్డన్ని కథలు చెప్పగలిగారు. ఆ కథలతో నవ్వించారు, ఆశ్చర్యపరిచారు, అప్పుడప్పుడు కళ్లు చెమర్చేలా మన జీవితాన్ని అద్దంలో చూపించారు. ఆయన కథా వస్తువులన్నీ ఇరుకు మధ్యతరగతి ఇళ్లలోంచి, వారి పెద్ద పెద్ద కలల్లోంచి, చిన్న చిన్న ఆనందాల్లోంచి పుట్టుకొచ్చినవే. ఆయనే పీయూష్ పాండే. ఓగిల్వీ ఇండియా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్‌గా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా (2019-21) విధులు నిర్వర్తించి భారతీయ వాణిజ్య ప్రకటనల రంగాన్ని పెన్నుతో మలుపు తిప్పారు.

పీయూష్ ఎవరో చాలా మందికి తెలియక పోవచ్చు కానీ క్యాడ్ బరి, ఏషియన్ పెయింట్స్, ఫెవికాల్ వంటి బ్రాండ్ల పేర్లు చెప్తే వాటి యాడ్లు ఇప్పటికీ గుర్తొస్తాయంటే అది ఆయన ఘనతే. 1982లో ఓగిల్వీతో మొదలైన పీయూష్ ప్రస్తానం 2025 దాకా నిర్విఘ్నంగా సాగింది. మొదట ఒక క్లయింట్ సర్వీసింగ్ ట్రైనీగా చేరినప్పటికీ ఆయన కళాదృష్టి, రచనాపటిమ చూసి క్రియేటివ్ డిపార్టుమెంట్‌లోకి తీసుకున్నారు. అలా అంచెలంచెలుగా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు. గత నాలుగు దశాబ్దాలుగా పదుల సంఖ్యలో క్రియేటివ్ డైరెక్టర్లను తయారుచేసి డజన్లకొద్దీ బ్రాండ్లను నిర్మించారు. సగటు క్రియేటివ్ డైరెక్టర్‌లాగా పీయూష్ ఏనాడూ అవార్డుల వెంట పరిగెత్తలేదు. ఎంత కీర్తి సంపాదించుకున్నప్పటికీ తన డిజిగ్నేషన్లను పక్కన పెట్టి తనని తానూ 'మినిస్టర్ ఆఫ్ ఫన్'గా పిలుచుకునే వారు. అందుకే ఆయన జీవితాన్ని, భారతీయతను, రచననూ అంతగా ప్రేమించి ఆస్వాదించగలిగారేమో అనిపిస్తుంది. ఒక విధంగా ఓగిల్వీ వంటి అంత ర్జాతీయ సంస్థ దృష్టికోణాన్ని, విధి విధానాలను భారతీయతకు తగినట్టు తర్జుమా చేసి ఒక పుష్కరం నిరాటంకంగా 'ఏజెన్సీ ఆఫ్ ది ఇయర్'గా నడిపారు.

'గ్రాస్స్ రూట్స్' అర్థం పర్థం తెలిసిన కాపీరైటర్

నేడు ఏఐ అనేక రంగాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ప్పటికీ అది కొన్ని పనులు మాత్రం చేయలేదనిపిస్తుంది. అందులో మొదటిది పీయూష్‌లా మట్టి వాసనున్న కాపీ రాయడం. కాపీ అంటే (వాణిజ్య ప్రకటనల భాషలో) సామాన్య జనాలకు బ్రాండ్ గురించి లేదా దాని తాలూకు వస్తువు గురించి సరళంగా, కళాత్మ కంగా చెప్పే రచన. అది రాయాలంటే పాండిత్యం ఉన్న సామాన్యుడికి మాత్రమే సాధ్యం. ఈ పాండిత్యం ఆయన రాసిన 'అబ్ కీ బార్ మోదీ సర్కార్' (2014 బీజేపీ ఎన్నికల క్యాంపైన్) హెడ్ లైన్‌లో కనిపిస్తుంది. ఆ ఎన్నికల్లో మోదీని దేశం ఎదురుచూస్తున్న అతి ముఖ్య అభ్యర్థిగా నిలబెట్టడానికి ఎంతో తోడ్పడింది. సామాన్యుల్లోకి పార్టీ అభిమతాన్ని తీసుకెళ్లడానికి ఒక వారధి అయ్యింది.

పీయూష్ క్రికెటర్. రంజీ ట్రోఫీకి కూడా ఆడారు. కానీ ఆర్థిక సమస్యల వల్ల ఉద్యోగం వెతుక్కోవలసొ చ్చింది. జైపూర్‌లో పుట్టిపెరిగి, ఢిల్లీలో ఎంఏ (హిస్టరీ) పూర్తి చేసి కొద్ది రోజులు కన్‌స్ట్రక్షన్ రంగంలో, అనంతరం కలకత్తాలో టీ టేస్టర్‌గా పని చేసి యాదృచ్ఛి కంగా ప్రకటనల రంగంలోకి అడుగుపెట్టారు. క్రికెటర్‌గా ఉన్న రోజుల్లో మ్యాచ్‌ల కోసం దేశం అంతా రైళ్లలో జనరల్ కోచ్‌లో తిరుగుతూ భారత



(05-09-1955 - 24-10-2025)

దేశాన్ని దర్శించానని ఒక ఇంటర్వ్యూలో నెమరేసుకున్నారు. ఆయన ఆ రైళ్లలోనే సామాన్యుల హావభావాలు, వారి భాష, వేషం చూశారు. ఇంకా చెప్పాలంటే 80ల్లోనూ, 90ల్లోనూ భారత్‌లో తొలగి పోతున్న పేదరికం, నిర్మితమవుతున్న మధ్య తరగతికి ఆయన సాక్షి. అదే ఆయనకు ట్రైనింగ్. ఆ అనుభవాలే ఆయన్నొక అసామాన్య సామాన్యుడిలా తీర్చిదిద్దాయి. బ్రాండ్లకు మాట సాయం చేసిన ఆయన కలమే లీడర్లకు కూడా ఆ పని చేసి పెట్టిందనడం అతిశయోక్తి కాదు.

మారుతున్న కాలానికి మాటలు నేర్పిన కలం

పీయూష్ కాపీరైటర్‌గా మొదట్లో పనిచేసిన ప్రాజెక్టుల్లో ముఖ్యమైనది 'మిలే సుర్ మేరా తుమ్హారా' (1988) అనే గీతం. సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, లోక్ సేవా సంచార్ పరిషద్ పర్య వేక్షణలో, పండిట్ భీంసేన్ జోషి సంగీత దర్శ కత్వంలో జాతీయతా భావాలు, ఐక్యతను పెంపొం దించడానికి ఈ గీతాన్ని రూపొందించారు. ఆ సమయానికి ఓగిల్వీలో ఎంతోమంది కాపీరైటర్ లు ఉన్నప్పటికీ, పెద్దగా లేకపోయినప్పటికీ అది రాసే అదృష్టం ఆయనకే దక్కింది. అది విడుదలైన తర్వాత ఆ గీతం ఎంతో ప్రాచుర్యం పొంది ఆయనకు ఉన్నట్టుండి గుర్తింపు తెచ్చిపెట్టింది.

ఇక తొంభైల్లో భారతదేశంలో చోటుచేసుకున్న ఆర్థిక సరళీకరణతో అడ్వర్‌టైజింగ్ రంగంలో రెండు పెను మార్పులు జరిగాయి. అందులో మొదటిది కొత్త బ్రాండ్ల స్థాపన, రెండవది టెలివిజన్ రాక. ఈ రెండింటికీ బాగా అవసరమైన అడ్వర్‌టైజింగ్ రంగంలో అప్పుడప్పుడే క్రియేటివ్ డైరెక్టర్‌గా ఎదుగుతున్నారు ఆ రోజుల్లో పీయూష్. అప్పటినుంచి 2010 దాకా నిరాటంకంగా ఆయన రాసిన ప్రచార ప్రకటనలు, ఆయన ఆధ్వర్యంలో వచ్చిన ఎన్నో యాడ్లు చరిత్రలో నిలిచిపోయాయి.

ఆయన ఐడియాలు ఎంత బలమైనవంటే ఒకసారి ప్రఖ్యాత పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా పీయూష్ 'ఎం-సీల్' బ్రాండ్‌కు రాసిన యాడ్ చూసి "నువ్వు ఇంత మంచి యాడ్ రాసి ఈ బ్రాండ్‌కు కొత్త లైఫ్‌ని ఇస్తావని తెలిస్తే నేను అసలు దాన్ని అమ్మి ఉండేవాడిని కాదు" అని అన్నారట (అంతకు మునుపు 'ఎం-సీల్' మహీంద్రా కంపెనీల్లో ఒకటి).

కొన్ని వందల ప్రచార ప్రకటనలు రాసిన పీయూష్ ఆయన మనసుకు దగ్గరైన, ఇష్టమైన ఒకటి ఎంచుకోమంటే తడబడకుండా పోలియో వైరస్ నిర్మూలనకు భారత ప్రభుత్వంచేపట్టిన కార్యక్రమానికి రాసిన "దో

యాడ్ ముత్యాలు

క్యాడ్‌బరి డైరీ మిల్క్: "కుచ్ ఖాస్ హై హమ్ సబ్ మే", "పప్పూ పాస్ హో గయా"
విషియన్ పెయింట్స్: "హర్ ఘర్ కుచ్ కహ్తా హై" (ప్రతి ఇల్లు ఒక కథ చెప్తుంది)
ఫెవికాల్: "ఫెవికాల్ కా మజ్‌బూత్ జోడ్", "తోడో నహీ జోడో"
వోడాఫోన్/హచ్: ది "పగ్" (చీకా), "జూజూస్"
పాండ్స్: "గూగ్లీ వూగ్లీ వూష్"
లూనా మోపెడ్: "చల్ మేరీ లూనా"
క్యాన్సర్ పేషెంట్స్ ఎయిడ్ అసోసియేషన్: ధూమపాన వ్యతిరేక ప్రచారం
గుజరాత్ టూరిజమ్: "కుచ్ దిన్ తో గుజారియే గుజరాత్ మే"
ది హిందూ: "స్టే ఎహెడ్ ఆఫ్ ది టైమ్స్"

పీయూష్

బూండ్ జిందగీ కే" (నిండు జీవితానికి రెండు చుక్కలు) అనే ప్రచార ప్రకటన ఆయనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని చెప్తారు. ఆ ప్రచార ప్రకటనకు అమితాబ్ బచ్చన్ అయితే బావుంటుంది సూచించింది కూడా ఆయనే. ఎందుకని అడిగితే దేశం మొత్తం బచ్చన్ లాంటి పెద్ద మనిషి తిడితేనే పడతారు లేకపోతే మాట వినరు అని అంటారు.

ఇల్లే ఆడిటోరియం

తొమ్మిది మంది సంతానంలో పీయూష్ ఎనిమిదవవాడు. ఆయనకొక తమ్ముడు. తండ్రి రాజస్థాన్ కో-ఆపరేటివ్ బ్యాంకులో పనిచేసేవారు. పీయూష్ తన బాల్యం చాలా ఆహ్లాదంగా కళాకారుల మధ్య జరిగిందని ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. ఇంట్లో ప్రతి ఒక్కరికి సంగీతం, నాట్యం, కవిత్వం, నాటకం వంటి ఏదో ఒక కళపై ఆసక్తి ఉండేదని, రోజూ వాటికి సంబంధించిన చర్చలు, సాధనలు జరుగుతుండేవని, అవి చూస్తూ పెరిగానని చెప్పుకొచ్చారు. ఆశ్చర్యం ఏమిటంటే ఆయనతో పాటు తోబుట్టువులందరూ కళాకారులుగా రాణించారు. ఆయన సోదరి ఇలా అరుణ్ ప్రఖ్యాత బాలీవుడ్ గాయని. మరో సోదరి రామా పాండే ప్రఖ్యాత రంగస్థల నటి. ఇక సోదరుడు ప్రసూన్ పాండే ప్రపంచ ప్రఖ్యాత యాడ్ ఫిలిం డైరెక్టర్.

ప్రత్యేకంగా ఏమీ చదవనప్పటికీ, ఇండస్ట్రీలో ఏ గాడ్ ఫాదర్ లేనప్పటికీ ఆయన దేశం గర్వించదగ్గ కాపీరైటర్‌గా ఎదగడానికి కావలసిన ప్రతిభను తన కుటుంబం, పరిసరాలు తనకు తెలియకుండానే తనకు ధారపోశాయని ఒకానొక సందర్భంలో పీయూష్ చెప్పారు.

అరుదైన అవార్డులు

ఓగిల్వీకి వరల్డ్ వైడ్ చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్‌గా పని చేసిన పీయూష్‌కు ప్రత్యేకంగా గుర్తింపు అవసరం లేదు. ఆయన కొన్ని దశాబ్దాలు స్టార్ కాపీరైటర్ గా ఏలారు. కానీ ఆయన్ను వరించిన అవార్డులు ఆయన్ని మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని చెప్తాయి. ఆయన కాపీలాగే ఆయన అవార్డులు కూడా విలక్షణమైనవే. పీయూష్ ఆసియా ఖండంలో లయన్స్ ఆఫ్ సెయింట్ మార్క్ (కేన్స్ లయన్స్, 2018) అవార్డు పొందిన మొట్టమొదటి వ్యక్తి. ఆయన ఈ అవార్డును తన సోదరుడు ప్రసూన్ పాండేతో కలిసి అందుకున్నారు. అడ్వర్‌టైజింగ్ రంగంలో ఇద్దరు సోదరులు ప్రపంచం లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డును పంచుకోవడం ఇదే మొదటిసారి. 2024లో లండన్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ ఎల్ఐఏ లెజెండ్ పురస్కారంతో ఆయన్ను సత్కరించింది. పీయూష్ కేన్స్ లయన్స్, క్లియో జీవనసాఫల్య పురస్కారం వంటివి ఎన్నో అందుకున్నాడు. 2016లో భారత ప్రభుత్వం అడ్వర్‌టైజింగ్ రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

పీయూష్ పాండే 24 అక్టోబర్, 2025న కన్ను మూశారు. ఆయన చివరిగా ఓగిల్వీ సంస్థకు చీఫ్ అడ్వైజర్‌గా విధులు నిర్వర్తించారు. భారతీయ అడ్వర్‌టైజింగ్ రంగానికి, ఓగిల్వీకి పీయూష్ అందించిన విశిష్ట సేవలకు నివాళిగా ఆ సంస్థ 'చీఫ్ అడ్వైజర్' అనే పదవిని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. తద్వారా ఆ స్థాయి ఉన్నవారు ఇప్పుడు ఎవరూ లేరు, ఇక రారు అని చెప్పకనే చెప్పింది.

సీత్యే, యాడ్ కన్సల్టెంట్

కథ

సెల్‌లో వాట్సప్ మెసేజెస్ చూస్తున్నాను.

'ఈరోజు దసరానాడు మా కుటుంబ సభ్యులు, బంధువులందరం కలిసి మా ఇంట్లో హుషారుగా పండుగ జరుపుకున్నాం. నా బాబయ్యలు, మావయ్యలు వారి పిల్లలు అందరం ముప్పైమంది ఒకేచోట కలవడం మర్చిపోలేని అనుభూతి' అంటూ వారి ఫొటోతో కూడిన సందేశం ఒక సమూహంలో చూస్తుంటే నా మనసు ఆనందంతో పులకరించింది. ఈ కాలంలో బంధువుల మధ్య రాకపోకలు తగ్గిపోయాయి. పెళ్లిళ్లలో కలిసినా ముహూర్త సమయానికి రావడం, అక్షింతలు వేయడం, భోజనాలు చేయడం, వీడ్కోలు పలకడంతో సరిపోతోంది.

శ్రీవారికి గ్రూపులో వచ్చిన ఫొటో, వివరాలు చూపించాను.

"బాగుంది" అన్నారు సింపుల్‌గా. వంటింట్లో అడుగుపెట్టాను.

వంట చేస్తుంటే మదిలో ఆలోచనలు మెదల సాగాయి. వంట పూర్తి చేసేసరికి నా ఆలోచనలు కొలిక్కి వచ్చాయి.

"శ్రీవారూ..! నాకో మంచి ఆలోచన వచ్చింది" అన్నాను చీరకొంగుకు చేతులు తుడుచుకుంటూ.

"ఆలోచన నీది.. కార్యాచరణ నాది. చెప్పు శ్రీమతీ..!" అంటూ పేపర్ పక్కన పడేసారు.

"ఈసారి సంక్రాంతికి మన ఆత్మీయులందరినీ మన ఇంటికి ఆహ్వానిద్దాం. మన పిల్లలను, అక్కగారిని, మీ అన్నయ్యలను ,మా అన్నయ్యను, తమ్ముణ్ణి, చెల్లిని, వాళ్ల పిల్లలను అందరినీ ఆహ్వానిద్దాం. పండుగ మూడు రోజులు అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ హౌసీ లాంటి ఆటలు ఆడుకుంటూ గడుపుదాం. ఏమంటారు?" అన్నాను.

"వావ్.. మంచి ఆలోచన.. మన అమ్మాయి పెళ్లి తరువాత గత ఏడెనిమిది సంవత్సరాలుగా మన ఇంట్లో ఫంక్షన్స్ ఏమీ లేవు. నేను పదవీ విరమణ చేసి అయిదేళ్లవుతోంది. మన ఆత్మీయులు వారి పిల్లలు ఉద్యోగరీత్యా హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలలో స్థిరపడడం మనం ఈ రాజమహేంద్ర వరాన్ని వదలకపోవడంతో మన ఇంటికి చుట్టాలు రావడం తగ్గిపోయింది. ఏదో ఒక అకేషన్ లేకుండా ఎవరూ రావడం లేదు. అందుకే సంక్రాంతి సెలబ్రేషన్స్ అంటూ అందరినీ పిలుద్దాం.ముందర మన పిల్లలకు ఫోన్ చేద్దాం. వాళ్లు వస్తానంటే కార్యక్రమం ప్లాన్ చేద్దాం" ఉత్సాహంగా చెప్పారు శ్రీవారు.

రాత్రి బెంగుళూరులో ఉన్న అమ్మాయి సాహితికి ఫోన్ చేశాను.

"సంక్రాంతి పండుగకు తప్పక వస్తాం. ఓ వారం రోజులు అందరితో సరదాగా గడుపుతాం. పిల్లలతోటి పృథ్వి తోటి మాట్లాడి కన్ఫర్మ్ చేస్తా" చెప్పింది సాహితి.

''అన్నయ్యతో కూడా మాట్లాడు. మీరు కుటుంబాలతో వస్తానంటే మిగిలిన వారికి చెప్తా" అన్నాను. యోగక్షేమాలు మాట్లాడి ఫోన్ కట్ చేశా.

మరునాడు ఢిల్లీలో ఉన్న అబ్బాయి హేమంత్ ఫోన్ చేశాడు.

"అమ్మా.. నువ్వు సంక్రాతికి గెట్ టుగెదర్ ప్లాన్ చేశావుటగా" అడిగాడు హేమంత్.

"అవునురా.. అందరం కలిసి చాలా రోజులయింది. మావయ్య పిల్లలు, మీ పెదనాన్న గారి పిల్లలు అందరం కలుద్దాం. మీరు ఒకరినొకరు చూసుకుని చాలా ఏళ్లయిందిగా" అన్నాను.

"అవునమ్మా. మావయ్య పిల్లలను పెదనాన్నగారి పిల్లలను చూసి చాలా ఏళ్లయింది.''అన్నాడు హేమంత్.



భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన

కృష్ణకదంబం

ఇంద్రగంటి నరసింహమూర్తి



"అవునురా. ఉద్యోగరీత్యా అందరూ తలోచోట ఉన్నారు. అందరినీ ఒకసారి కలపడానికే ఈ మూడు రోజుల సమావేశం." అన్నాను.

"మేము వస్తాం." అన్నాడు హేమంత్..

"సంక్రాంతి పండుగకు రిజర్వేషన్స్ రెండు నెలల ముందుగా చేసుకోవాలి. అందుకే మనవాళ్లందరికి చెపుతాను" అన్నాను ఉత్సాహంగా.

* * *

అనుకున్నట్టే మా అన్నయ్యకు, తమ్ముడికి ఫోన్ చేశాను. తమ్ముడు హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాడు. వాడి పిల్లలు బెంగళూరు. అన్నయ్య విజయవాడలో సెటిల్ అయ్యాడు. వాడి పిల్లలు అమ్మాయి పూణే. అబ్బాయి భోపాల్. తమ్ముడికి నలుగురు మనుమలు, అన్నయ్యకు ముగ్గురు మనుమలు. అన్నయ్య పిల్లలకు, తమ్ముడి పిల్లలకు ఫోన్ చేసాను. నా చెల్లెలుకి ఫోన్ చేశాను. అది విశాఖపట్నంలో ఉంటుంది. పిల్లలు కాలేజీ చదువులు.

శ్రీవారు ముంబైలో ఉంటున్న ఆయన అక్కయ్యకు, వారణాసి నివాసి పెద్ద అన్నయ్య, బెంగుళూర్ వాసి చిన్నన్నయ్యలకు ఫోన్ చేశారు. వాళ్ల పిల్లలకూ సమాచారం వెళ్లింది. వివిధ రాష్ట్రాలలో ఉన్న అందరూ మా ఇంటి సంక్రాంతి సంబరాల్లో పాలు పంచుకోవడానికి ఉత్సాహం చూపించారు.

వెంటనే శ్రీవారు ఆయన పేరున "కృష్ణకాంత్ ఆప్త కదంబం" అని వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. అందులో మేము ఆహ్వానించిన వాళ్లందరి సెల్ నంబర్స్ చేర్చాం.

"సంక్రాంతి ఆత్మీయ సమావేశం" అని శ్రీవారొక ఆహ్వానపత్రం తయారు చేశారు. ఆ ఆహ్వానపత్రం గ్రూప్‌లో షేర్ చేశారు.

ఆత్మీయుల నుండి సందేశాలతో గ్రూప్ నిండిపోసాగింది. శుభోదయాలు, వైద్య చిట్కాలు వంటి సందేశాలు హోరెత్తసాగాయి.

రోజులు పరిగెడుతున్నాయనిపించింది.

డిసెంబర్ పదో తారీకున అందరికీ మరోసారి ఫోన్ చేసాం. మొత్తం ఇరవై నాలుగు మంది వస్తున్నట్లు లెక్క తేలింది.

మేము గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటాం. నెలక్రితమే ఫస్ట్‌ఫ్లోర్‌లో అద్దెకున్న వాళ్లని ఖాళీ చేయమన్నాం. వాళ్లు రెండురోజుల క్రితం వెళ్లిపోయారు.

మేము మూడురోజులు అందరికీ సౌకర్యంగా ఉండడానికి ఏర్పాట్లు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశాం. పైన నాలుగు గదుల్లో పరుపులు అద్దెకు తెచ్చి పరిపించాలనుకున్నాం. మూడురోజులకు వంటలక్కను మాట్లాడాం.

కావలసిన సరుకులు మూడు రోజుల ముందే తెచ్చుకోవాలనుకుంటూ లిస్ట్ తయారుచేసాం. పెద్దలకు, పిన్నలకు వారికి తగ్గ బట్టలు పెట్టాలని ఈ నెలలోనే బట్టలు కొనాలని నిర్ణయించాం.

మూడు రోజులు బ్రేక్‌ఫాస్ట్‌కు, లంచ్, డిన్నర్లకు

ఐటమ్స్ లిస్ట్ తయారు చేశాం.

"ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడ కాజా, అరిసెలు ముందురోజు కొందాం. వంట మనిషి చేత ముందురోజు జంతికలు, చక్కిలాలు, గులాబ్జామ్, మైసూర్ పాక్ చేయిస్తాను." అన్నాను హుషారుగా.

"అలాగే చేయించు. అటకమీద ఉన్న కేరమ్స్ బోర్డు దింపుదాం. హౌసీ కొంటాను. అందరం కలిసి ఆడుకోవచ్చు. చెస్ ఎలాగూ ఉంది." అన్నారు కృష్ణకాంత్.

"సాయంత్రం స్నాక్‌గా మొదటి రోజు బోండా, రెండో రోజు బజ్జి, మూడోరోజు సమోసా చేయిస్తాను" అన్నాను.

"కిచెన్ వ్యవహారం నీ ఇష్టం. బజార్ నుండి ఏం తేవాలో లిస్ట్ తయారుచేయడం నీ పని. ఆ వస్తువులు తెచ్చి నీకు అందించడం నా కర్తవ్యం" చెప్పారు కృష్ణకాంత్.

వంటలక్క సహాయంతో కూరలతో సహా కావలసిన పదార్థాల లిస్ట్ తయారయింది.

గ్రూప్ లో మరోసారి ఆహ్వానపత్రం పెట్టాం.

* * *

జనవరి పన్నెండు.....నాలో ఒకరకమైన ఆనందంతో కూడిన ఆత్రుత... భావోద్వేగం... ఆ సాయంత్రం మా అబ్బాయి, కోడలు, మనవలు వచ్చారు.

ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి రిసీవ్ చేసుకున్నాం. ఆప్యాయంగా అందరినీ దగ్గరకు తీసుకున్నాం. నా మనసు ఆనందభరితమైంది.

ఇంటికి బయలుదేరుతుంటే. అబ్బాయి హోటల్‌లో రూం బుక్ చేసానన్నాడు.

"మన బంధువులందరూ వస్తున్నారు. ఇల్లు సరిపోదు.. మేం హోటల్‌కు వెడతాం.. రేపు ఉదయమే ఇంటికి వస్తాం. పగలు మన ఇంట్లో, రాత్రి హోటల్లో గడుపుతాం." అంటూ వాళ్లు వేరే

"అన్నయ్య దిగిన హోటల్‌లోనే మాకు స్పెషల్ రూం బుక్ చేశాడు." అంటూ వాళ్లు వెళ్లిపోయారు. మాలో నిరుత్సాహం...నెమ్మదిగా కార్లో ఇంటికి వచ్చాం. పిల్లలు రాగానే తింటారని చేసిన ఆహార పదార్థాలు చూస్తూ నిట్టూర్చాను. నాకు రాత్రి ఏమీ తినాలనిపించలేదు. శ్రీవారు మజ్జిగ అన్నంతో సరిపెట్టుకున్నారు. తెల్లవారగానే.. భోగి పండుగ.. బంధువుల నుంచి ఫోన్స్ వస్తున్నాయి. రైల్లో దిగినవారు స్టేషన్ నుండే హోటళ్లలో రూంలు బుక్ చేసుకున్నామంటూ వెడుతున్నారు.

టాక్సీలో హోటల్‌కు వెళ్లారు. మరో గంట తరువాత బెంగళూరు విమానంలో అమ్మాయి, అల్లుడు, మనవడు దిగారు.

కాసేపు పలకరింపులతో పులకరించాం.

"అన్నయ్య దిగిన హోటల్‌లోనే మాకు స్పెషల్ రూం బుక్ చేశాడు." అంటూ వాళ్లు వెళ్లిపోయారు. మాలో నిరుత్సాహం...నెమ్మదిగా కార్లో ఇంటికి వచ్చాం. పిల్లలు రాగానే తింటారని చేసిన ఆహార పదార్థాలు చూస్తూ నిట్టూర్చాను. నాకు రాత్రి ఏమీ తినాలనిపించలేదు. శ్రీవారు మజ్జిగ అన్నంతో సరిపెట్టుకున్నారు. తెల్లవారగానే.. భోగి పండుగ..

బంధువుల నుంచి ఫోన్స్ వస్తున్నాయి. రైల్లో దిగినవారు స్టేషన్ నుండే హోటళ్లలో రూంలు బుక్ చేసుకున్నామంటూ వెడుతున్నారు.

"మేం స్నానాలు చేసి దాక్షారం, కోటిపల్లి వెడుతున్నాం. సాయంత్రం నాలుగింటికి మీ ఇంటికొస్తాం" చెప్పాడు అన్నయ్య.

తమ్ముడు చెల్లెలి కుటుంబాలు ర్యాలీ, వాడపల్లి వెడుతున్నారుట. ఆడపడుచు బావగార్లు వెదురుపాక గాడ్ గారిని కలిసి అక్కడ నుండి బిక్కవోలు వెడతారుట. సాయంత్రం నాలుగింటికి మా ఇంటికి వస్తామన్నారు. ఎవరికి వారు వారి ప్రోగ్రామ్స్ తెలియజేసారు.

మా అమ్మాయి నీరసంగా ఉందని, ఈ పూటకు రెస్ట్ తీసుకుని సాయంత్రం వస్తామని చెప్పింది. "అదేంటమ్మా.. పాతిక మందికి వంటచేయాలని చెప్పి ఇప్పుడు అరుగురికే వంట చేయమంటున్నారు. పాతిక మంది కదాని మా అక్కను సహాయానికి తీసుకు వచ్చాను" అంటున్న వంటలక్కకు ఈ పూటకు ఇంతే అంటూ చెప్పాను.

అబ్బాయి, కోడలు, మనవలు ఉదయమే వచ్చారు. పెద్ద మనవడు ఎనిమిదో క్లాస్, చిన్నవాడు ఆరో క్లాస్‌లో ఉన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ చేసాక ఫస్ట్ ఫ్లోర్ ఖాళీగా ఉండడం చూసి అబ్బాయి, కోడలు లాప్‌టాప్‌తో ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్లిపోయారు. నేను శ్రీవారు మనవలతో కేరమ్స్ ఆడాం.

బంధువులందరం కలిసి భోగి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలను కున్నాను. కాని అందరు తలోదిక్కు వెళ్లడంతో కాస్త నిరుత్సాహ పడ్డాను.

లంక అబ్బాయి, కోడలు దిగారు.

అందరం డైనింగ్ టేబుల్ దగ్గర చేరాం. వంకాయ కొత్తిమీర కారంతో చేసిన కూర.. ఆమ్మో నూనె బాగా ఉంది...వద్దు అన్నాడు అబ్బాయి. పులిహోర కొంచెం పెట్టించుకున్నా...బొబ్బట్లకు చెయ్యి అడ్డంపెట్టాడు. సుగర్, కొలెస్ట్రాల్ పెరుగుతాయని స్వీట్స్ మానేసారుట. అన్నం తగ్గించారుట. కోడలూ మనవలదీ అదే తీరు.

"అదేమిట్రా.. సంవత్సరం క్రితం అన్నీ తినేవాడివిగా" అన్నాను.

"ఇప్పుడు రోజులు మారాయి అమ్మా. వాట్సప్‌లో రోజూ వచ్చే సందేశాలు చూడు. ఇప్పుడు ఏది తినాలో, ఏమి తినకూడదో పిల్లలకు కూడా తెలుస్తోంది. మనం జాగ్రత్తగా ఉండకపోతే రోగాల బారిన పడతాం" చెప్పాడు అబ్బాయి.

వాళ్లు నలుగురు పప్పు, మజ్జిగతో సరిపెట్టు కున్నారు. వండిన పదార్థాలు అలాగే ఉండిపోయాయి. సాయంత్రం నాలుగు గంటలకు బిలబిలమంటూ ఆత్మీయులందరు మా ఇంటికి చేరుకున్నారు. పిన్నలు పెద్దలకు పాదాబి, వందనాలు... అరేయ్ ఒరేయ్ పలకరింపులు.. బ్రో..పిన్నీ బాబాయ్ అంటూ ఆత్మీయ కౌగలింతలు...కరచాలనాలు... సందడి మొదలయింది. గంట హడావిడి తరువాత టీలు



వచ్చాయి. గ్రీన్ టీ అన్నవారికి గ్రీన్ టీ అందింది.

చాలా ఫొటోలు తీసుకున్నాం. మా పెరట్లో మామిడి చెట్టు క్రింద చాలా గ్రూప్ ఫోటోలు వివిధ భంగిమలలో తీసుకున్నాం.

డిన్నర్ ప్రస్తావన వచ్చింది. నా మెనూ చూపించాను.

అమ్మో.. అన్ని ఐటమ్స్ తినలేం... రెండు చపాతీలు.. ఆలు కర్రీ చాలన్నారు.

వాళ్లు చెప్పినట్టు చేయమని వంటలక్కకు చెప్పాను.

ఇంతలో.. పది... ఇరవై.. ముప్పయ్... అంటూ లెక్కలు.. బావగార్ల పిల్లల అరుపులతో హాల్ దద్దరిల్లింది. "ఏమిటా లెక్కలు" అంటున్న శ్రీవారికి

"ఆప్త కదంబం సంక్రాంతి సంబరాలు కాప్షన్‌తో మన ఫొటోలు పేస్‌బుక్‌లోను, వాట్సప్ గ్రూప్స్‌కి షేర్ చేశాం. అంతే.. వెంటనే లైక్స్ రావడం మొదలయింది. అభినందన సందేశాలు వర్షంలా కురుస్తున్నాయి.. మా ఆనందానికి కారణం ఇదే" అన్నారు అబ్బాయిలు, అమ్మాయిలు.

"మన గ్రూప్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.. వావ్.. గ్రేట్." అంటూ డాన్స్ చేస్తున్నారు యువతీ యువకులు.

వాళ్లని చూస్తున్న పెద్దల ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

అందరు అందరితో ఉత్సాహంగా కబుర్లు, వాళ్ల ప్రాంత విశేషాలు చెబుతుంటే నాలుగు గంటలు నాలుగు నిమిషాల్లా దొర్లిపోయాయి. చపాతీ ప్లేట్స్ అందరికీ అందించాను.

రెండు అన్నారు కాని కొందరు ఒక చపాతీ మాత్రమే తిన్నారు. స్వీట్లు ఎవరూ ముట్టుకోలేదు. పెద్దలకు సుగర్.. పిల్లలకు సుగర్ వస్తుందేమోనని భయం...

డిన్నర్ అయిందనిపించారు. మళ్లీ లోకాభి రామాయణం ...ముచ్చట్లు... రాత్రి పదిగంటలకు అందరూ బయలుదేరుతుంటే

''రేపు సంక్రాంతి. అందరూ ఉదయమే వచ్చేయండి" అన్నాను.

"అబ్బే.. రేపుకూడా ఇలాగే సాయంకాలం వస్తాం.. ఉదయం గోదావరిలో స్నానం చేసి చుట్టుపక్కల దేవాలయాలన్నీ చూడడానికి వెడతాం..టాక్సీలు ఆల్రెడీ బుక్ చేసుకున్నాం" అన్నారు.

అమ్మాయిని రమ్మంటే

"మీ అల్లుడి స్నేహితులు వస్తానన్నారు. వాళ్లతో పట్టిసీమ వెడదామని ప్లాన్ చేశాం. సాయంత్రం వస్తాగా" అంది.

నేనింక మాట్లాడలేదు.

వచ్చిన వాళ్లు వెళ్లిపోయారు. అబ్బాయి, కోడలు, మనవలు హోటల్‌కు వెళ్లారు.

ఎప్పటిలాగే మేం మిగిలాం. ఒకరికొకరం ...

ఆరు గంటల ఆత్మీయ సమావేశం మనసును మురిపించింది. కాస్త ఉత్సాహం.. కొంచెం నిరుత్సాహం... కలగలిసిన భావోద్వేగం... ఆ రాత్రి కలత నిద్ర అయింది.

సంక్రాంతి పండుగ..

ఉదయమే ఇంటిముందు పెద్ద ముగ్గు పెట్టాను. హేమంత్, కోడలు మనవలు హోటల్ నుండి వచ్చారు. పెద్ద పండుగనాడు మనవలతో కలిసి భోజనం చేయడం ఆనందదాయకమైంది.

మధ్యాహ్నం రెండింటికి మా అన్నయ్య హడావుడిగా వచ్చాడు. "నాలుగింటికి మా ట్రైన్. మీ ఆతిథ్యానికి థాంక్స్" అన్నాడు.

"రేపు కూడా ఉంటారనుకున్నాం" అన్నాను కంగారుగా.

"కనుమ నాడు బయలుదేరకూడదుగా. అందుకే ఈరోజు ప్రయాణం" అంటూ ఓ గంట కూర్చుని

తీరిక లేని జీవితం గడుపుతున్నా మన అభ్యర్థనను మన్నించి అంత దూరం నుండి ఖర్చుకు వెనకాడకుండా మన ఊరు వచ్చికొన్ని గంటలు మన మనసులను ఉల్లాసపరచిన బంధువులను అభినందిద్దాం. ఇక్కడ ఉన్న రెండురోజులు చుట్టుపక్కల పుణ్యక్షేత్రాలు దర్శించి సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారి ఉత్సాహానికి జేజేలు పలుకుదాం.

నాకూ, కృష్ణకాంత్‌కు మరోసారి థాంక్స్ చెప్పి మా కుటుంబ సభ్యులతో ఒక సెల్ఫీ తీసుకుని బయలుదేరాడు. మిగిలిన వారు కూడా ఒక్కొక్కరు రావడం... ట్రైన్ టైం.. ఫ్లయిట్ టైం అవుతున్నాయంటూ బయలుదేరడం జరిగింది.

అమ్మాయి వాళ్ల అత్తగారింటికి వెళ్లాలని బయలుదేరింది.

"పండుగ రెండు రోజులు మీ ఇంట్లో ఆనందంగా జరుపుకున్నాం. ఓ రెండు రోజులు మా అత్తయ్య గారింట్లో గడుపుతాం" అంటూ వాళ్లు వెళ్లిపోయారు.

ఇంటి ముందు కాబ్ ఆగింది. ఎవరి కోసమో అనుకుంటుంటే...

"రేపు కనుమకదా. అందుకే ఈ రోజు మీ కోడలు పుట్టింటికి వెడుతున్నాం. ఈ రెండు రోజులు మనవలతో బాగా ఎంజాయ్ చేసారనుకుంటాను. పిల్లలకు వేసవి శలవులలో మీరు ఢిల్లీ రండి." అంటూ తల్లితండ్రులకు పాదాభివందనం చేసి బయలుదేరాడు హేమంత్... భార్యా బిడ్డలు అనుసరించారు.

వాళ్లను సాగనంపాక వంటలక్క వచ్చింది.

"రాత్రి డిన్నర్‌కు ఎంతమందికి ఏం చేయమంటారు" అడిగింది.

"మీ అవసరం లేదు. వెళ్లి రండి" అన్నాను.

ఆమెకు ఇవ్వవలసిన మొత్తం ఇచ్చేసాను.

అందరూ వెళ్లిపోయారు. ఇల్లంతా నిశ్శబ్దం.

కుర్చీలో కూర్చున్నాను.కళ్లమ్మట నీళ్లు.. మనసులో తెలియని బాధ...

'నేనూహించిందేమిటి... జరిగిందేమిటి... మూడు రోజులు అందరం కలిసి ఆనందంగా గడపాలనుకున్నాను. అందరూ రెండు రోజులు రాజమండ్రిలో ఉన్నా మా ఇంట్లో గడిపింది ఆరు గంటలే' అనుకుంటే ఏదో అసంతృప్తి...

నా మనసులో భావాలు శ్రీవారితో పంచుకున్నాను.

"ఆత్మీయులతో మూడురోజులు గడిపామా... ఆరు గంటలా అని లెక్కించకు. వారి మనసులో మనమీద ప్రేమాభిమానాలు చెక్కు చెదరలేదని గ్రహించు. ఈ మలి సంధ్యలో మన బలం ఈ ఆప్త కదంబమే. మన శక్తి మన బంధువులే. దగ్గర్లో ఉన్నా దూరంలో ఉన్నా ఈ అభిమానమే మన భద్రత. కాలం వేగంగా మారుతోంది వసుధా..! మనమూ మారాలి. ఆధునిక సౌకర్యాలు, టెక్నాలజీతో ప్రస్తుత యువత జీవన స్థితిగతులు మారాయి. అంతా స్పీడ్.. స్పీడ్..

తీరిక లేని జీవితం గడుపుతున్నా మన అభ్యర్థనను మన్నించి అంత దూరం నుండి ఖర్చుకు వెనకాడకుండా మన ఊరు వచ్చికొన్ని గంటలు మన మనసులను ఉల్లాసపరచిన బంధువులను అభినందిద్దాం. ఇక్కడ ఉన్న రెండురోజులు చుట్టుపక్కల పుణ్యక్షేత్రాలు దర్శించి సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారి ఉత్సాహానికి జేజేలు పలుకుదాం. రేపు ఏఐ (కృత్రిమ మేధ) ఆవిష్కరణతో ఇంకా ఎన్నో మార్పులు చూడబోతున్నాం. మన పాతతరం కూడా ఆ నూతన ఆవిష్కరణల స్ఫూర్తినందుకోవాలి. లే.. టీ పెట్టు.. టీ తాగుతూ టీవీలో సినిమా చూద్దాం" అన్నారు కృష్ణకాంత్. 'అవును కదా ఆ ఆరు గంటలు చిన్నారుల కేరింతలు, యువతీ యువకుల ముచ్చట్లు, పెద్దల హితోక్తులతో మన ఇల్లు కళకళ లాడింది.' అనుకుంటూ ఆ ముచ్చట్లు మదిలో పదిల పరచుకుంటూ ఉత్సాహంగా వంటగదిలో అడుగుపెట్టాను. ★

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల చరిత్రలో మూడు పర్యాయాలు నిషేధాలకు గురైంది. ఆ మూడు ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీయే చేసింది. దారుణంగా చతికిలపడింది. అయినా కర్ణాటకలో బహిరంగ ప్రదేశాలలో ఆర్ఎస్ఎస్ శాఖలు నిర్వహించరాదని రాష్ట్ర మంత్రి ప్రియాంక ఖర్గే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2025లో కూడా ఒక ప్రయత్నం చేసి, న్యాయ వ్యవస్థ కారణంగా భంగపడ్డారు. తరువాత ఆయన తండ్రి, అఖిల భారత కాంగ్రెస్ నామమాత్రపు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని, బహుశా జాతీయ స్థాయిలో, ముచ్చట పడ్డారు. కానీ అడుగు ముందుకు వేయలేదు. వేయలేరు కూడా. కానీ ఆర్ఎస్ఎస్‌తో గాంధీ-నెహ్రూ కుటుంబానికి తప్ప ఆ కాలం నాటి చాలామంది ప్రముఖులకు తీవ్ర వైరమేమీ లేదు. సర్దార్ పటేల్, పురుషోత్తమదాస్ టండన్ వంటి కొందరు తప్ప ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించిన చాలామంది ఉద్దేశం నెహ్రూ కుటుంబాన్ని మెప్పించడమే. ఆ పనే ఇప్పుడూ జరుగుతున్నది.

ఆ నిషేధం తరువాత

గాంధీజీ హత్య తరువాత స్వతంత్ర భారత ప్రథమ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్‌ను నిషేధించింది. బ్రిటిష్ ప్రభుత్వం చేసింది కూడా అదే. కానీ స్వతంత్ర భారతదేశం విధించిన నిషేధం ఎత్తివేసిన కేవలం మూడు మాసాలకే స్వయంసేవకులు కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చునని కార్యవర్గ సమావేశం తీర్మానించడమే గొప్ప చారిత్రక వైచిత్రి. నిజానికి ఆ తొలి నిషేధం పట్ల కాంగ్రెస్‌లోనే ఏకాభిప్రాయం లేదని కొన్ని వార్తలను బట్టి అర్థమవుతుంది. స్వయంసేవకుల మీద ఆ పార్టీ నేతలు కొందరికి పూర్తి సానుభూతి ఉంది. సంఘ పెద్దలతో బంధం ఉంది. నాటి రాష్ట్రపతి (కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని అలా పిలిచేవారు) డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య, పురుషోత్తమదాస్ టండన్ వంటి ప్రముఖ నేతలు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులకు స్వయంసేవకుల మీద గౌరవం ఉంది. వారి దేశభక్తి మీద, భారతీయత మీద వారికి ఉన్న నిబద్ధత మీద ప్రగాఢ నమ్మకం ఉంది. కాబట్టే, స్వయంసేవకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అభ్యంతరం ఉండదని నిషేధం ఎత్తివేసిన మూడు నెలలకే కాన్పూర్ కార్యకర్తల సమావేశంలో డాక్టర్ పట్టాభి ప్రకటించారు. అదే తరహా పిలుపును టండన్ కూడా ఇచ్చారు. కానీ గాంధీజీ హత్య తరువాత స్వయంసేవకులను వేధించిన తీరు దారుణమే.

ఇక్కడే గమనించవలసిన కీలక అంశం ఉంది. 1936 త్రిపురీ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో నేతాజీ బోస్ మీద పోటీ చేసిన డాక్టర్ పట్టాభి అపజయం పాలయ్యారు. 'పట్టాభి ఓటమి తన ఓటమి' అని గాంధీజీ వ్యాఖ్యానించిన మాట నిజం. ఒక సంచలనం. గాంధీజీకీ, పట్టాభికీ ఉన్న సాన్నిహిత్యం అంతటిది. అయినా గాంధీజీ హత్య నిందను మోసిన ఆర్ఎస్ఎస్‌ను పట్టాభి శంకించలేదు. కానీ స్వయంసేవకులు కాంగ్రెస్‌లో చేరడమనే ప్రతిపాదన ప్రథమ ప్రధాని నెహ్రూ జీర్ణించుకునే అవకాశమే లేదు. అయినా డాక్టర్ పట్టాభి కాన్పూర్‌లో సాక్షాత్తు కార్యకర్తల సమావేశంలో ఇలాంటి ప్రకటన చేయడం సాహసం. 1940 దశకంలో డాక్టర్ పట్టాభి ఆర్ఎస్ఎస్‌కు సన్నిహితంగా ఉండేవారని కొన్ని వార్తలు చెబుతున్నాయి. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించి కాంగ్రెస్ అపచారానికి ఒడిగట్టిందన్న న్యూనతాభావం ఆనాడు ఆ పార్టీలో నిజం ఇవాళ్టి కాంగ్రెస్ నాయకులకు, నెహ్రూ వీరభక్తులకు తెలియడం కోసం ఇలాంటి చారిత్రక వాస్తవాలు వెలుగులోకి రావలసి ఉన్నది. అందుకే ఈ ప్రయత్నం.

ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత రాహుల్ శివ శంకర్ ఎక్స్ వేదికగా పంచుకున్న చారిత్రక అంశాన్ని ఇక్కడ ప్రస్తావించి తరువాత చర్చలోకి వెళదాం. 'జూలై 9, 2024న నరేంద్ర మోదీ ప్రభుత్వం ముఖ్యమైన ఆదేశం జారీ చేసింది. ప్రభుత్వోద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలంటూ 1966లో నాటి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాన్ని ఉపసంహరిస్తూ ఇచ్చిన కొత్త ఆదేశమిది. కానీ స్వతంత్ర భారతదేశంలో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి వ్యక్తి డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య 1940 దశకంలో ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. ఆయన భారత జాతీయ కాంగ్రెస్‌లో సభ్యుడే అయినప్పటికీ ఆర్ఎస్ఎస్‌తో సన్నిహితంగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్ కొన్ని సిద్ధాంతాలను స్వాగతించారు. కొన్ని పుస్తకాలలో దొరుకుతున్న సమాచారం ప్రకారం డాక్టర్ పట్టాభి ఆర్ఎస్ఎస్ నిర్వహించిన కొన్ని కార్యక్రమాలకు హాజరయ్యారు కూడా. అలాగే నాటి సర్‌సంఘచాలక్ ఎంఎస్ గోల్వాల్కర్‌తో సన్నిహిత బంధం కూడా ఉండేది.' 11.10.1949 నాటికి 'డక్కన్ హెరాల్డ్' ఆంగ్ల దినపత్రిక, 13.10.1949 నాటి జాగృతి తెలుగు వారపత్రికలలో ఈ వార్తలు, విశ్లేషణలు చూడవచ్చు.

స్వయంసేవకులను ఆహ్వానించిన సీడబ్ల్యుసీ

'సంఘం మత సంస్థ కాదని తొలిసారిగా రాష్ట్రపతి ప్రకటన' అన్న శీర్షికతో జాగృతి (13.10.1949) ఈ అంశాన్ని విశ్లేషించింది. ఆర్ఎస్ఎస్ అసలు కాంగ్రెస్ శత్రువే కాదని, "కాంగ్రెసులోని విభిన్న వర్గాలే కాంగ్రెసుకు శత్రువులు' అని కూడా డాక్టర్ పట్టాభి వ్యాఖ్యానించారు. 'రాష్ట్రీయ స్వయంసేవక సంఘం, హిందూ మహాసభ, ముస్లింలీగు వంటి మత సంస్థకాని, రాజకీయ సంస్థ కాని కాదు. కాంగ్రెసుకు శత్రువు ఆర్ఎస్ఎస్ కాదు. కాంగ్రెసులోని విభిన్న వర్గాలే కాంగ్రెసుకు నిజమైన శత్రువు'- కాన్పూరు కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో కాంగ్రెసు అధ్యక్షుని విస్పష్ట ప్రకటన ఇది. ఇంకా, రా.స్వ.సంఘ సభ్యులకు కాంగ్రెసులో ప్రవేశార్హతను కల్పిస్తూ కాంగ్రెసు వర్కింగ్ కమిటీ చేసిన తీర్మానాన్ని గురించి ప్రేక్షకులు వేసిన ప్రశ్నలకు డాక్టరు పట్టాభి సమాధానమిస్తూ ఇలా అన్నారు:

"కాంగ్రెసువారు ఆత్మవిశ్వాసాన్ని, చిత్త స్థైర్యాన్ని పెంపొందింపజేసుకోవాలి. ఆసంఖ్యాకులుగా సంఘ సభ్యులు కాంగ్రెసులో చేరితే, కాంగ్రెసువంటి మహాసంస్థ శక్తి ఉడిగిపోతుందనే భావాన్ని కాంగ్రెసువారు త్యజించాలి. ఆర్ఎస్ఎస్ సభ్యులకు కాంగ్రెసులో ప్రవేశార్హత కల్పిస్తూ వర్కింగ్ కమిటీ చేసిన నిర్ణయంలో కొత్త ఏమీ లేదు. ఆర్ఎస్ఎస్‌ను కాంగ్రెసు ఎప్పుడూ వెలివేయలేదు. రాజకీయాలతో ఎట్టి సంబంధం పెట్టుకోకుండా సాంస్కృతిక రంగంలోనే పనిచేస్తామని, భారత ప్రభుత్వాన్ని, భారత పతాకనూ గౌరవిస్తామనీ, ఆర్ఎస్ఎస్‌వారు మాట యిచ్చారు. ఒక పెద్ద మనిషి చెప్పిన మాటను విశ్వసించడం అహింసా సూత్రాలను అనుగుణమైన



గురూజీ



పురుషోత్తమదాస్



భోగరాజు

కాంగ్రెస్‌లో నిర్వేదం

పద్ధతే"ననీ డాక్టరు పట్టాభి పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం, దృష్టి, సేవ ఎలాంటివో కాంగ్రెస్‌కు ఎరుకేనని పట్టాభి మాటల వల్ల తెలుస్తుంది.

కాంగ్రెసు కార్యకర్తలను ఉద్దేశిస్తూ పట్టాభి కాస్త నిరసన కూడా ప్రకటించారు. "కాంగ్రెసును నిశితంగా విమర్శిస్తున్నారని ఆర్ఎస్ఎస్ వారిని నిందించి ప్రయోజనం లేదు. పరస్పరం నిందించుకుంటూ ప్రతి నిత్యం ప్రభుత్వాన్ని దూయబట్టేవారు కాంగ్రెసువాదులే. కాంగ్రెసుకు శత్రువు ఆర్ఎస్ఎస్ కానే కాదు. కాంగ్రెసులో ఉన్నట్లే ఉంటూ కాంగ్రెసులో అంతఃకల హాలు ప్రేరేపించిన విభిన్నవర్గాలే. స్వార్థ ప్రయోజనా లను సాధించే ప్రయత్నంలోనే మీరు నిమగ్నులైతే ఎంతో కాలం మీరు మన లేరు. ఇతరులను విమ ర్శించే ముందు మీరు మీ యింటిని చక్కబెట్టు కోవడం ఎంతేని అవసరం" అని పట్టాభి హెచ్చరించారు.

బాపూరావ్ మోఘే ఏమన్నారు?

దీనికి ఆర్ఎస్ఎస్ ఎంత సున్నితంగా స్పందిం చిందో కూడా చూడాలి. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ చేసిన ప్రకటనపై మీ అభిప్రాయమేమిటని ప్రశ్నిస్తే ఆంధ్రప్రాంత రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ప్రాంత ప్రచారక్ బాపూరావ్‌జీ మోఘే –'సంఘ సభ్యులను కాంగ్రెసులో చేర్చుకొమ్మని బ్రతిమాలడం కానీ భంగపడడం కానీ మాతరఫు నుంచి ఏమీ జరగలేదు. కాంగ్రెసుకు తోచిన విషయమే ఇది.' అన్నారు. ఇంకా, 'సంఘం పద్ధతులపట్ల విశ్వాసం కలిగి ఉందనీ, జాతీయ పతాకాన్ని గౌరవించిందనీ రాష్ట్రీయ స్వయంసేవక సంఘంపై మోపిన నేరారోప ణలు కేవలం నిరాధారాలని ఏనాడో స్పష్టమైంది. సంఘం మొదటి నుండీ సాంస్కృతిక పురోభివృద్ధికే పాటుబడుతోంది గాని రాజకీయాలతో ఎన్నడూ ఎట్టి సంబంధమూ పెట్టుకొనలేదు. సంఘ కార్యక్రమంలో ఈనాడు ఎట్టి మార్పూ రాలేదు. సంఘం ఏవో కొత్త హామీలను యిచ్చింది గనుక పూర్వపు పంథాను మార్చుకొని నూతన మార్గాన్ని అనుసరిస్తోంది గనుకనూ సంఘ సభ్యులకు కాంగ్రెసులోనికి ప్రవేశార్హతను కల్పిస్తున్నామనడం కేవలం అసంగతమైన విషయం మాత్రమేగాక హాస్యాస్పదం కూడా అన్నారాయన.' (జాగృతి, 13.10.1949).

అటు కాంగ్రెస్ ప్రకటన, ఇటు సంఘ పెద్దల స్పందనలను సమన్వయం చేస్తూ నాటి రాజకీయ సామాజిక వాతావరణం నేపథ్యంగా జాగృతి (13.10. 1949) 'సంఘే శక్తిః కలౌయుగే' పేరుతో రాసిన సంపాదకీయం స్మరణీయమైనది–

రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సభ్యులు కాంగ్రెసులో చేరవచ్చునని కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గం తీర్మానించింది. తీర్మానాన్ని సమర్థించుకుంటూ కొందరూ, ఖండిస్తూ కొందరూ తమ తమ అభిప్రా యాల్ని కూడా వ్యక్తం చేశారు. కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు కాన్పూరు కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో కొందరు వేసిన ప్రశ్నలకు సమాధానమిస్తూ "ఆర్ఎస్ఎస్, ముస్లింలీగు, హిందూ మహాసభలవంటి మత సంస్థ కాదు. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని సంస్థ" అని స్పష్టీకరించారు. "కాంగ్రెసుకు శత్రువు రాష్ట్రీయ స్వయంసేవక సంఘం కాదు. కాంగ్రెసులో ఉంటూ అంతఃకలహాలలో మునిగి తేలుతున్న భిన్న బిన్న వర్గాలే" అని కూడా ఆయన విమర్శించారు. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ కళావెంకట్రావుగారు కాంగ్రెసు ప్రణాళికలోని ర(సి)నిబంధన ప్రకారం మత సంబంధ మైనదిగాని మరి ఏ ఇతర సంబంధమైనది గాని అయిన రాజకీయ సంస్థలో సభ్యుడుగా ఉండని ప్రతి భారతీయుడు కాంగ్రెసులో చేరవచ్చును అని పేర్కొంటూ రాష్ట్రీయ స్వయంసేవక సంఘం మతంతోగాని రాజకీయాల్తోగాని సంబంధం లేని సంస్థ అన్నారు. స్వయంగా పండిత జవాహర్లాల్ నెహ్రూ ఇందోరులో పోలో మైదానాన్ని ప్రప్రథమంగా రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సమావేశానికి మంజూరు చెయ్యడంలో సహాయపడ్డారు. సంఘం మీద నిషేధం తొలగి యిప్పటికి మూడు నెలలు పూర్తి అయ్యాయి. నిషేధంలో ఉన్నప్పుడు కాంగ్రెసు నాయకుల మనఃప్రవృత్తులు నిషేధం తొలగిన తర్వాత ఏ కారణాలవల్ల మారాయో సాకల్యంగా విచారిస్తే పిలవని పేరటంలాగా రాష్ట్రీయ స్వయంసేవక సంఘం తరఫు నుంచి ఎలాంటి కోరిక వెల్లడి కాక పోయినా కూడా కాంగ్రెసు ఈ తీర్మానాన్ని యిప్పుడు ఎందుకు తీసుకోవలసి వచ్చిందో బోధపడుతుంది. నిషేధం తొలగక పూర్వం ప్రధానమంత్రి లగాయతు గోవింద సహాయ్‌లాంటి ఛోటా నాయకుల వరకూ అందరూ గ్రుడ్లురిమినవాళ్లే. సంఘం మతోన్మాద సంస్థ అనీ, ఫాసిస్టు సంస్థ అనీ ప్రతి వ్యక్తీ దూషించడానికి నడుం కట్టుకున్నవాడే. శాంతి, అహింస, సత్యాల పేరున ఈనాడు రొమ్ము విరుచుకొని ముందునకు నడుస్తున్న ప్రతి కాంగ్రెసు నాయకుడు మహాత్ముని

హత్యకు దేశంలోని మత కలహాలకూ సంఘమే కారణమని బల్లగుద్ది ఉపన్యాసాలిస్తూ అన్యాయంగా సంఘ సభ్యులమీద జరిగిన అత్యాచారాల్ని, కళ్లారా చూస్తూ ఊరుకున్న వాడే. మరి ఇంత మార్పు వీరిలో రావడం ఆశ్చర్యం కలిగించకపోతుందా?....

కాని కాంగ్రెసు మాత్రం మొదటి నుంచీ ఆర్ఎస్ఎస్ మీద కత్తి ఝుళిపిస్తూనే ఉంది. అవకాశం చేజిక్కినప్పుడల్లా అణచాలని ప్రయత్నించింది. న్యాయాన్ని అర్థించిన సంఘ నాయకుల పట్ల నెహ్రూ పటేళ్లు చూసిన అసహజ ప్రవర్తన నాగరిక జాతులకే తీరని కళంకాన్ని ఆసాదించాయి. ఇలా యిన్ని విధాల దూషించి, ద్వేషించి ఏ ఉపాయాలవల్ల సంఘ శక్తిని అణచడం సాధ్యం కాదని గ్రహించి దేశం ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి కాంగ్రెసుకు శక్తి చాలదని తెలుసుకొన్న పిమ్మట ఈ తీర్మానం ద్వారా తమ కళ్లు తెరుచుకున్నట్లు ప్రపంచానికి రుజువు చేసింది కాంగ్రెసు.

సంఘం స్థాపించినప్పటి నుండీ సంఘ నాయకులు సంఘం కేవలం సాంస్కృతిక సంస్థ అని ఎన్నిసార్లు చెప్పినా అప్పుడు మాకు నమ్మకం లేదు, మేము విశ్వసించలేము అని అనడమేకాక ఒక కంటితో కనిపెట్టి ఉంచుతామన్న వారు "పెద్ద మనిషి మాటలను నమ్మడం కాంగ్రెసు అహింసా సిద్ధాంతాలకు అనుగుణంగానే ఉంటుంది" అనడం వింటే సంఘం కాంగ్రెసు మీద నైతికంగా ఎంత విజయాన్ని సాధించిందో వేరే చెప్పనవసరం లేదు. నాయకులతో సహా సంఘ సభ్యుల్నందర్నీ నిర్బంధించడం– వారి పట్ల పశు ప్రవర్తన చూసి పీడించడం – మొదలైన ఎన్ని అత్యాచారాలు చేసినా తమ శక్తి కన్నా సంఘానికి అధికంగా నైతిక శక్తి ఉన్నదని గుర్తించి కాంగ్రెసు ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది. ఇది ఒక ఎత్తు.

జరిగిన అన్యాయాలన్నీ, విస్మరించండని చెపుతూ సంఘ నాయకులు శ్రీ గురూజీ "వారూ మన సోదరులే, వారు చేసిన తప్పిదాన్ని మనస్సులో ఉంచుకోకండి" అని (ప్రజాస్వామికం పేరిట కాంగ్రెసు ప్రభుత్వం ఎన్ని నాటకాలాడినా) దేశాన్ని దృష్టిలో ఉంచుకొని స్వయంసేవకులకిచ్చిన ఉపదేశం ఒక ఎత్తు.

.... తమ తీర్మానాన్ని సమర్థించుకోడానికి రాష్ట్రపతి పట్టాభి "సంఘం ఏదో హామీలిచ్చిందని" చెప్పవచ్చు. నిషేధానికి పూర్వం నిషేధం తొలగిన తర్వాత కూడా సంఘ కార్యకలాపాల్ని చూస్తూ వచ్చినవారికి అప్పుడు లేనిది ఇప్పుడేమి వచ్చిపడిందో అప్పుడు ఉన్నది ఇప్పుడేమి తొలగింపబడిందో బోధపడడం లేదు.

సంఘంలో ఎట్టి మార్పూ రాలేదని సంఘం ఎట్టి హామీ ఇవ్వలేదని ప్రభుత్వం తనంతట తానే నిషేధాన్ని తొలగించిందనీ శ్రీ గురూజీ స్పష్టం చేశారు.

రెండు శక్తులు తలపడ్డాయి. ఒకటి అన్యాయంతో మరొక దాన్ని అణచాలని ప్రయత్నించింది. కాని సత్యం జయించింది, అన్యాయం అణగిపోయింది. సంఘం జయించింది. ఇక మార్గం కానక కాంగ్రెసు మైత్రి కోసం చెయ్యి చాపుతోంది. చింత చచ్చినా పులుపు చావదు! ఏదెట్లయినా శుభం భూయాత్!

R. S. S. Not The Enemy Of Congress

Deccan Herald 11-Oct-1949

–Dr. Sitaramayya.

CAWNPORE, October 10.

THE R.S.S. is not the enemy of the Congress but the faction parties within the Congress are more so," said Dr. Pattabhi Sitaramayya, the Congress Pres

Dr. Pattabhi was replying to questions at a meeting of the Congress workers on the decision of the Congress Working Committee allowing the R.S.S. workers to join the Congress.

He said the R.S.S. was not a communal political organisation like the Muslim League and the Hindu Mahasabha. "It may be a communal body, but it has repudiated all connections with politics," he said.

He urged Congressmen to develop self-confidence and cultivate strength in themselves. Congressmen, he said should shake off the feeling that the entry of R.S.S. workers in the Congress in large numbers would undermine the strength of a big organisation like the Indian National Congress. It was easy for the Congress to make short work of the R.S.S., Muslim League, and the Hindu Mahasabha but that was not what they wanted. The aim of the Congress was to conquer them by converting them and not by suppressing them.

It was the responsibility of the Congress workers, he said, to broaden the outlook of those who were narrow in their vision and provide them an opportunity to serve the cause of the nation."

మీరు సంఘాన్ని ఏమీ చేయలేరని నాడే చెప్పిన సంపాదకీయమిది.

పురుషోత్తమదాస్ గొప్ప జాతీయవాది. ఆయన మాటలు కొన్ని వాస్తవాలను బయటపెట్టాయి. స్వయంసేవకులు కాంగ్రెస్‌లో చేరాలని పార్టీ ఎంత బలంగా వాంఛించిందో ఆ మాటలు చెబుతాయి. 'కాంగ్రెస్‌లో చేరి ప్రభుత్వాన్ని బలపరచండి' స్వయం సేవకులకు పురుషోత్తమ దాస్ టండన్ సలహా (జాగృతి, 20.11.1949. హిందుస్థాన్ సమాచార్ నుంచి వార్త) వార్త చదివితే ఇది తెలుస్తుంది. స్వయంసేవకులను మరింతగా ఆకర్షించడానికి పట్టాభిని తొలగించి, టండన్‌కు అధ్యక్ష బాధ్యత ఇస్తారన్న మాటను ఆయన ఖండించడమే ఇందులో సారాంశం–

శ్రీపురుషోత్తమదాస్ టాండన్ ఇటీవల నాగ పూర్‌లో హిందూస్థాన్ సమాచార్ ప్రత్యేక విలేకరితో ప్రసంగిస్తూ 'రాష్ట్రపతి పట్టాభి సీతారామయ్య గారి రాజీనామా అనంతరం ఎక్కువమంది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ సభ్యులను కాంగ్రెస్‌లోకి ఆకర్షించేందుకు తాను కాంగ్రెస్ అధ్యక్ష పదవిని నిర్వహించబోతున్నట్టు ఒక నాగపూర్ పత్రిక ప్రకటించిన వార్త అసంబద్ధమైనదని అన్నారు. కాంగ్రెస్‌లో చేరి భారతీయ సంస్కృతి ఆదర్శాలకు అనుగుణంగా సుదృఢమైన ప్రభుత్వాన్ని ఈ దేశంలో నిర్మించవలసిందిగా సంఘ సభ్యులకు టండన్‌జీ అభ్యర్థించారు.

నెహ్రూ స్పందన

సాక్షాత్తు కాంగ్రెస్ అధ్యక్షుడే ఇలాంటి ప్రకటన చేయడం గురించి నెహ్రూ స్పందన ఏమిటన్న ప్రశ్న రాక తప్పదు. అందుకు సమాధానం జాగృతి (20.11.1949) ఇచ్చింది. దాని 'శీర్షిక– కాంగ్రెసు–ఆర్ఎస్ఎస్ పండిట్ నెహ్రూ'.

కాంగ్రెసులో రా.స్వ.సంఘ సభ్యులను చేర్చుకొనవచ్చునా లేదా అన్న సమస్యను మీతో చర్చించిన వెనుకనే కాంగ్రెసు కార్య నిర్వాహక వర్గం తేల్చిందా అన్న ప్రశ్నకు నెహ్రూ సమాధానం ఇచ్చారు. ఆ విషయం తనతో సంప్రదించాలా అక్కర్లేదా అన్న ప్రశ్నే రాదన్నారాయన. తాను విదేశీ యాత్ర ముగించుకుని వచ్చి జరిగిన విషయాలు తెలుసుకునే క్రమంలో ఒక బిహారు కాంగ్రెస్ సభ్యుడు ఈ విషయం మీద ప్రశ్నింపగా దానిని కాంగ్రెస్ కార్యనిర్వాహక వర్గం వివరించిందని విన్నాను. రా.స్వ.సంఘ్ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరవచ్చు. కాంగ్రెసు నియమావళిలో సూచించిన సంస్థ సభ్యులు తప్ప అంతా కాంగ్రెస్‌లో చేరవచ్చు. ఈ విషయమై కాంగ్రెస్ అధ్యక్షుడో మరొకరో కొద్దిరోజులలో ఒక స్పష్టం చేస్తారు అని నెహ్రూ అన్నారు.

'రా.స్వ. సంఘ నియమావళిలో అభ్యంతకర విషయమేమీ లేదు. కాంగ్రెస్ నియమావళి ప్రకారం దాన్ని ఒప్పుకున్న వ్యక్తి కాంగ్రెస్‌లో చేర్చుకోవాలి. రా.స్వ.సంఘ్ వలంటీర్ సంస్థ. కాంగ్రెస్ నియమాల ప్రకారం ఏ కాంగ్రెస్ వ్యక్తి ఒక కాంగ్రెస్ దళ్‌లో తప్ప ఇతర వలంటీర్ సంస్థల్లో సభ్యునిగా ఉండరాదు. కనుక ఇక్కడ ఒక సమస్య వస్తుంది. ఆర్ఎస్ఎస్ లోనుంచి తప్పుకోకుండా ఆ వ్యక్తి కాంగ్రెస్ సభ్యుడు కావచ్చునా? వీలు లేదు అని చెప్పాల్సివస్తుంది. ఎందుకంటే అతడు ఇతర వాలంటీర్ సంస్థలో సభ్యుడు కనుక. రెండో సంగతి జాతీయ సమస్యల యెడల రా.స్వ.సంఘ విధానం కాంగ్రెస్ దృక్పథం మతేతర మైనది. జాతీయమైంది. రా.స్వ.సంఘ దృక్పథం పూర్తిగా మతతత్వంతో కూడుకుందని చెప్పాలి. కనుక అది కాంగ్రెస్ తత్వానికి వ్యతిరేకం.' ఇలా ఉంది ఆయన స్పందన. ఈ మొత్తం అంశంలో 'రా.స్వ.సంఘ నియమావళిలో అభ్యంతకర విషయమేమీ లేదు' అని సాక్షాత్తు నెహ్రూ అంగీకరించడమే. సరిగ్గా ఈ విషయాన్నే నేటి కాంగ్రెస్ తెలుసుకోవాలి.

– జాగృతి డెస్క్

భారత్‌'బంగారు క్రీడ' హాకీ కాలపరీక్షకు నిలిచి శతవర్ష వేడుకలను ఘనంగా జరుపుకొంది. ఒలింపిక్స్‌లో మన దేశానికి అత్యధిక స్వర్ణపతకాలు సాధించి పెట్టిన క్రీడగా, క్రికెట్‌కు ముందు దశాబ్దాల పాటు అంతర్జాతీయ క్రీడారంగంలో భారత పతాకాన్ని రెపరెపలాడించిన ఏకైక క్రీడగా హాకీ సాధించిన ఘనత అంతాఇంతాకాదు.

హాకీ శతవసంతాల హేల

కళాత్మక క్రీడ హాకీ అనగానే విశ్వక్రీడాభిమానులకు ముందుగా గుర్తుకు వచ్చేపేరు భారత్ మాత్రమే. ఒలింపిక్స్ హాకీ చరిత్రలో అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు సాధించిన ఏకైక దేశం భారత్ మాత్రమే. 1928 ఆమ్ స్టర్ డామ్ నుంచి 2024 పారిస్ ఒలింపిక్స్ వరకూ 13 ఒలింపిక్స్ పతకాలతో భారత క్రీడారంగానికే గర్వకారణంగా నిలిచిన హాకీ ఎన్నోఆటుపోట్ల మధ్య తన వందేళ్లుగా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

1925 నుంచి 2025 వరకూ....

దేశంలో హాకీ, క్రికెట్ క్రీడలు జనరంజక క్రీడలుగా నీరాజనాలు అందుకొంటున్నాయి. 1980 వరకూ భారత ప్రధాన క్రీడగా హాకీ ఒక వెలుగు వెలిగితే.. ప్రపంచీకరణ పుణ్యమా అంటూ ప్రస్తుతం క్రికెట్ ఆ స్థానాన్ని భర్తీ చేసి పైకి పైపైకి దూసుకు పోతోంది. స్వాతంత్ర్యానికి పూర్వమే 1925 నవంబర్ 7వ తేదీన భారత హాకీ సంఘం ఏర్పాటుకాగా, ఆ వెంటనే అంతర్జాతీయ హాకీసమాఖ్య గుర్తింపు లభించింది. 1928 ఆమ్ స్టర్ డామ్ ఒలింపిక్స్ నుంచి 1980 మాస్కో ఒలింపిక్స్ వరకూ భారత్ హాకీలో ఎనిమిది బంగారు పతకాలు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పిందంటే ఈ క్రీడపై ఎంతటి సాధికారత సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. స్వాతంత్ర్యానంతరం దాయాది దేశం పాకిస్థాన్ నుంచి గట్టిపోటీ ఎదురైనా భారత్ 1980 దశకం వరకూ తన ఆధిపత్యాన్ని కొనసాగించగలిగింది.

ఆకాశం నుంచి పాతాళానికి.....

1928 ఆమ్ స్టర్ డామ్ ఒలింపిక్స్ నుంచి 1980 మాస్కో ఒలింపిక్స్ వరకూ..భారతజట్టు ఎనిమిది బంగారు, ఓ రజత, రెండుకాంస్య పతకాలు సంపా దించింది. 41 సంవత్సరాల క్రితం మాస్కో ఒలిం పిక్స్‌లో చివరిసారిగా బంగారు పతకం సాధించిన భారతజట్టు...ఆ తర్వాత అంతర్జాతీయ హాకీలో వచ్చిన పెనుమార్పులతో ఉక్కిరిబిక్కిర య్యింది. సాంప్రదాయ రబ్బీసు, పచ్చిక హాకీ మైదానాలు కాస్త సింథటిక్ ఆస్ట్రో టర్ఫ్ మైదానాలుగా మారిపోడంతో కళాత్మక భారత హాకీ ఎందుకూ కొరగాకుండా పోయింది.

కాలానుగుణంగా మారడంలో విఫలమైన భారత హాకీ మెరుపు తగ్గింది. ప్రపంచ నంబర్ వన్ జట్టు కాస్త 12వ ర్యాంక్‌కు దిగింది. ఒలింపిక్స్ చరిత్రలోనే వరుసగా ఆరు బంగారు పతకాలు సాధించిన భారత హాకీ ప్రాభవం ఒక్కసారిగా అడుగంటిపోయింది. 1980 తర్వాత ఒలింపిక్స్‌లో పతకం అటుంచి... అర్హత సాధించడమే గగనమైపోయింది.ఈ బాగు కోసం అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రత్యేకశ్రద్ధ చూపడంతో పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. ఒరిస్సా ప్రభుత్వం ప్రధాన స్పాన్సర్‌గా అండగా నిలవడంతోనే హాకీకి పునర్ వైభవం సాధ్యమయ్యింది.

దేశంలో సింథటిక్ హాకీ మైదానాలను ఏర్పాటు చేసి విదేశీ శిక్షకులను రప్పించడంతో పరిస్థితి మెరుగు పడింది. గత దశాబ్దకాలంగా భారత హాకీజట్టు నిలకడగా రాణించడంతో 12వ ర్యాంక్ నుంచి నాలుగవ ర్యాంక్ కు ఎదగ గలిగింది.

2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడం ద్వారా తిరిగి పుంజుకోగలిగింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత్ కంచు పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నెదర్లాండ్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్, అర్జెంటీనా, ఇంగ్లండ్, బెల్జియం, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా లాంటి జట్ల నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటూ భారత్ పోరాటం కొనసాగిస్తోంది. ఇప్పటికే 13 ఒలింపిక్స్ పతకాలు, ఓ ప్రపంచ టైటిల్ సాధించిన భారత్ తాజా ర్యాంకింగ్స్ ప్రకారం 7వ ర్యాంకులో కొనసాగు తోంది. ఆసియా స్థాయిలో అత్యుత్తమ జట్టుగా ఉన్న భారత్ ఇప్పటికే నాలుగుసార్లు ఆసియాకప్ ను, పలుమార్లు ఆసియా క్రీడల బంగారు పతకాలను సాధించింది. గత శతాబ్దకాలంలో మేజర్ ధ్యాన్ చంద్, లాల్ సింగ్, బల్బీర్ సింగ్, గురుబక్ష్ సింగ్, సుర్జిత్ సింగ్, పర్గత్ సింగ్, సందీప్ సింగ్, అస్లాం షేర్ ఖాన్, గోవింద, అశోక్ కుమార్, ముకేశ్ కుమార్,ధన్ రాజ్ పిళ్లై,జాఫర్ ఇక్బాల్, సోమయ్య, దిలీప్ టిర్కే, అజిత్ పాల్ సింగ్, జగ్బీర్ సింగ్, మన్ ప్రీత్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్, శ్రీజేష్ లాంటి ఎందరో గొప్పగొప్ప ఆటగాళ్లను ప్రపంచ హాకీకి అందించిన ఘనత భారత్‌కు ఉంది.

ఒలింపిక్స్ హాకీలో.. భారత పతకాలు
(1928- 2024)

1928 (అమస్టర్‌డమ్) - స్వర్ణం
1932 (లాస్ ఏంజిల్స్)- స్వర్ణం
1936 (బెర్లిన్) - స్వర్ణం
1948 (లండన్) - స్వర్ణం
1952 (హెల్సింకి)- స్వర్ణం
1956 (మెల్‌బోర్న్)- స్వర్ణం
1960 (రోమ్)- రజతం
1964 (టోక్యో)- స్వర్ణం
1968 (మెక్సికో)- కాంస్యం
1972 (మ్యూనిచ్) - కాంస్యం
1980 (మాస్కో) - స్వర్ణం
2020 (టోక్యో)- కాంస్యం
2024 (పారిస్)- కాంస్యం

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

సంఘ శతాబ్ది సందర్భంగా పథసంచలన్‌లు



సంఘ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నవంబర్ 4న నిర్మల్ నగర పురవీధులలో ఘనమైన స్వాగతంతో, 2480మంది గణవేషధారి స్వయంసేవకులతో పథసంచలన్ జరిగింది. అనంతరం ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన సార్వజనికోత్సవంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ చిటికేశి శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ఎంకేసింగ్ (రిటైర్డు ఐపీఎస్ ఆఫీసర్), ప్రధానవక్తగా క్షేత్రప్రచారక్ శ్రీరామ్‌భరత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘచాలక్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా సంఘచాలక్ నూకల విజయకుమార్, సహసంఘచాలక్ సాదుల కృష్ణదాస్, పురప్రముఖులతో పాటు 4778 (మహిళలు 320) మంది పాల్గొన్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మొదటి శాఖ 1936 సంవత్సరంలో కోరుట్లలో ప్రారంభమైంది. కోరుట్ల నివాసి కస్తూరి ఎల్లప్ప పూణేలో వృత్తి నిమిత్తము వెళ్లి అక్కడ స్వయంసేవక్ అయ్యారు. వారు తిరిగి వచ్చి కోరుట్లలో శాఖ ప్రారంభించారు. కోరుట్ల శాఖ 90వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగాను, సంఘశతాబ్ది సందర్భంగా 579 గణవేషధారి స్వయం సేవకులతో కోరుట్ల పురవీధులలో భవ్యమైన పథసంచలన్ జరిగింది.

భాగ్యనగర్ : సంఘ శతాబ్ది సందర్భంగా నవంబర్ 9న బర్కత్‌పుర భాగ్- మధురా నగర్‌లో జరిగిన సార్వజనికోత్సవంలో ముఖ్య వక్తగా తెలంగాణ ప్రాంత సేవాప్రముఖ్ శివశంకర్ పాల్గొని శతాబ్ది కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. ఆ తరువాత మధురానగర్ పురవీధుల గుండా 165 మంది గణవేషధారీ స్వయంసేవకులతో భవ్యమైన పథసంచలన్ జరిగింది. మాతృ మూర్తులు మార్గమంతా రంగవల్లులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత కార్యకారిణి సదస్యులు టిఎస్ఆర్‌మూర్తి, విభాగ్ సహశారీరక్ ప్రముఖ్ పి. విజయ్, భాగ్ సహకార్యవాహ పరశురామ్ తదితరులతో పాటు 315మంది బస్తీవాసులు పాల్గొన్నారు..

నాగర్‌కర్నూల్ పురవీధులగుండా 389 గణవేషధారి స్వయంసేవకులతో ఘనంగా పథ సంచలన్ జరిగింది. ఆ తరువాత జరిగిన సార్వజనికోత్సవంలో ముఖ్యవక్తగా తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యులు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంఘచాలక్ కర్రెం నారాయణ, విభాగ్ కార్యవాహ పత్తికొండ రామిరెడ్డి, జిల్లా ప్రచారప్రముఖ్ భాస్కరాచారి తదితరులతోపాటు 731 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సంగ గంగ' పుస్తక ఆవిష్కరణ జరిగింది.

పుస్తకావిష్కరణ సభ



భాగ్యనగర్ : చేతనా స్రవంతి – నవయుగ భారతి" సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్' పుస్తకావిష్కరణ సభ నవంబర్ 9న భాగ్యనగర్‌లోని చైతన్యపురి–భాగ్యశ్రీ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ, అఖిల భారత కార్యకారిణీ సదస్యులు వడ్ల భాగయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలుగుప్రాంతాలలో పనిచేసిన సంఘ జ్యేష్ఠ కార్యకర్తలు డాక్టర్ బీరవోలు సురేంద్రరెడ్డి, కొండూరు బాలకృష్ణ, కుందూరు విద్వాన్‌రెడ్డి, డాక్టర్ రంగాచార్యులు, అంబదాస్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నవయుగభారతి అధ్యక్షులు బాలేంద్ర, రాంపల్లి మల్లికార్జున్, డాక్టర్ వడ్డి విజయసారథి, చేతనాస్రవంతి కార్యదర్శి వనపల్లి చక్రధర్‌రెడ్డి, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి,సామాజిక సమరసత అఖిల భారత సంయోజకులు కె.శ్యాంప్రసాద్ తదితరులతో పాటు 820 మంది పురప్రముఖులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు సిబ్బందికి అభినందన కార్యక్రమం

సిరిసిల్ల : జాగృతి ఆధ్వర్యంలో నవంబర్ 3న కరీనగర్ జిల్లా , సిరిసిల్లా, వేములవాడ నగరాలు, చుట్టుప్రక్కల గ్రామాలలోని పోస్ట్‌మెన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచారప్రముఖ్ గీకూరు శ్రీనివాస్, ప్రముఖ విద్యావేత్త పుల్లారెడ్డి, నందిశివ, రాంప్రసాద్ తదితరులతోపాటు పోస్టాఫీసు ఎస్‌పిఎమ్ రఘుమోహన్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

కడప: ప్రపంచ మహిళా క్రికెట్ కప్, భారత జట్టు గెలవడంలో ముఖ్య పాత్ర పోషించి, దేశ యువతకు, క్రీడాకారులకు ప్రేరణగా నిలిచి, కడప జిల్లా కీర్తిని దశదిశల వ్యాప్తి చేసిన మహిళాక్రికెటర్ శ్రీచరణికి, వారి తల్లికి అభినందనలు తెలిపిన కడప జిల్లా సంఘచాలక్ డాక్టర్ రామ్ సుబ్బారెడ్డి, జిల్లా కార్యవాహ ఆర్ఎస్. ప్రసాద్, జిల్లా ప్రచారక్ మహేశ్.

ఆదర్శకార్యకర్త ఆశం వెంకటరమణయ్య



గూడూరు : ఆశం వెంకట రమణయ్య గత నాలుగు దశాబ్దాలుగా వివిధ బాధ్యతలలో క్రియాశీలకంగా సంఘ పని చేసిన జ్యేష్ఠ కార్యకర్త, త్వదీయాయ కార్యాయ బద్దా కటీయమ్ అని సంఘప్రార్థనలో చెప్పిన విధంగా వీరు ఆచరించి చూపారని పలువురు వక్తలు తెలియజేశారు. ఆశం వెంకటరమణయ్య (61) అక్టోబర్ 29న మరణించారు. ఈ సందర్భంగా నవంబర్ 6న విద్యానగర్‌లోని వారి స్వగృహంలో సంస్మరణ సభలో ప్రాంత కార్యకారిణి సభ్యులు యుగంధర్ మాట్లాడుతూ కుటుంబపోషణకు మగ్గం పని చేస్తూ, రాత్రిపూట చదువుకుంటూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, బి.ఇడి పూర్తి చేశారు. 33 సం.లు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సంఘకార్యకర్తగా ఆదర్శజీవితం గడిపారని అన్నారు. ఈ సభలో ప్రాంత ప్రచారప్రముఖ్ బయ్యా వాసు, కుటుంబ ప్రబోధన్ ప్రాంత సంయోజక్ పుట్టాశేషు, నెల్లూరు విభాగ్ సంఘచాలక్ రామదండు, తిరుపతి విభాగ్ కార్యవాహ విశ్వేశ్వరరావు, విభాగ్ ప్రచారకులు నవీన్ (నెల్లూరు), మల్లికార్జున (తిరుపతి) తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

భక్తాగ్రేసరులు

గురు రాఘవేంద్రులు

మంత్రాలయంలో ప్రత్యక్షదైవంగా ఆరాధనలు అందుకుంటున్న రాఘవేంద్రస్వామి పూర్వాశ్రమ నామం వేంకటభట్టు. బాల్యం నుంచే అసాధారణ ప్రజ్ఞతో భాషలపై, విజ్ఞానంపై పట్టు సాధించారు. భక్తి జ్ఞానాల సంగమం. కుంభకోణం గురువు సుధీంద్ర తీర్థుల వారిని ఆశ్రయించి వేదాంత రహస్యాలను తెలుసుకొన్నారు. ఒక పట్టాన కొరుకుడు పడని జయతీర్థ స్వామి (14 శతాబ్దం)రాసిన ద్వైత వేదాంత గ్రంథంపై సరళంగా వ్యాఖ్యానం రాయగా, గురుదేవులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ద్వైత వేదాంత పరంగా పదుల కొద్దీ గ్రంథ రచన చేశారు. ఉపనిషత్తులకు ఖండార్థాలు రాశారు. సరస్వతీ దేవి స్వప్న బోధ చేసిన తరువాత తంజావూరులో ఆశ్రమ స్వీకారం చేసి 'రాఘవేంద్ర తీర్థులు' అయ్యారు. నలభయ్ ఏడేళ్ల పాటు పీఠాధిపత్యం వహించి సాధారణ శకం 1671లో తుంగభద్ర తీరంలోని మంత్రాలయంలో కృష్ణస్తుతి చేసుకుంటూ బృందావన(సమాధి) ప్రవేశం చేశారు. ఏడు వందల ఏళ్లు బృందావనంలో ఉంటూ ఆదుకుంటానని భక్తులకు వాగ్దానం చేశారని చెబుతారు.

కథ

సింహం - చిట్టెలుక

ఒక రోజున అడవిలోని చెట్టు నీడలో ఒక సింహం నిద్రిస్తోంది. ఆ పక్కనే ఉన్న కన్నంలో ఒక చిట్టెలుక ఉంటోంది. అది బయటికి వచ్చేసరికి పీచులాంటి మెత్తని గడ్డి ఏదో అక్కడ కుప్పలాగ పడి ఉంది.

"దానిపైకి ఎక్కి ఆడుకొంటే మజాగా ఉంటుంది" అనుకొని ఆ ఎలుక దానిపైకి ఎక్కి సంతోషంగా ఎగురుతోంది. కాని అది ఎక్కినది సింహంపైకి అంతేగాని గడ్డిపైకాదు.

వెంటనే సింహానికి మెలకువ వచ్చింది. ఒక్కసారి గట్టిగా గర్జించింది. అటు ఇటు వెతకగా దాని చేతికి చిట్టెలుక చిక్కింది.

దాన్ని పంజాతో పైకెత్తి పట్టుకొని "ఎలుకదానా! నీకెంత ధైర్యమే! నా నిద్రనంతా పాడుచేశావు. నిన్ను చంపేస్తాను" అంది సింహం.

భయంతో ఎలుక గజగజ వణికిపోతూ "క్షమించండి మహాప్రభో! నేను మిమ్మల్ని చూడలేదు. ఏదో గడ్డి కదా అని ఎక్కి ఆడుకొంటున్నాను. దయచేసి నన్ను వదిలేయండి. నేను ఎప్పుడో ఒకప్పుడు మీకు సాయం చేసి రుణం తీర్చుకొంటాను" అంది.

"చూస్తే వేలెడంతలేవు! నీవు నాకేం సాయం చేయగలవు? సరేలే! నిన్నిప్పుడు దయతలచి వదిలేస్తున్నా. జాగ్రత్తగా ఉండు!" అని సింహం దాన్ని వదిలేసింది.

ఒకనాడు ఆ అడవిలో ఒక వేటగాడు ఒక

పద్యం

బంగారు కుదువ బెట్టకు
సంగరమున బాఱిపోకు, సరసుడవైతే
సంగడి వెచ్చము లాడకు
వెంగిలితో జెలిమి వలదు వినరా సుమతీ!

భావం : బంగారము తాకట్టు పెట్టవద్దు. యుద్ధం నుంచి పారిపోవద్దు. మర్యాద తెలిసినవాడవైతే అంగడిలో సరకులు అరువుగా తీసుకోవద్దు. వివేకము లేనివానితో స్నేహం చెయ్యవద్దు.

శ్లోకం

సార్థః ప్రవసతో మిత్రం
భార్యా మిత్రం గృహే సతః
ఆతురస్య భిషక్ మిత్రం
దానం మిత్రం మరిష్యతః

భావం : వ్యాపారికి తోటి ప్రయాణికులు (ప్రవాసుల బృందం) మిత్రులు. ఇంటిలో భార్య మిత్రురాలు. రోగికి వైద్యుడు మిత్రుడు. మృత్యుముఖాన ఉన్నవారికి దానమే మిత్రుడు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

భారత తొలి ప్రధాని	డా. అంబేడ్కర్
తొలి రాష్ట్రపతి	డా. సర్వేపల్లి రాధాకృష్ణన్
తొలి ఉపరాష్ట్రపతి	ఇందిరా గాంధీ
తొలి న్యాయశాఖ మంత్రి	డా. రాజేంద్ర ప్రసాద్
తొలి మహిళా ప్రధానమంత్రి	జవాహర్‌లాల్ నెహ్రూ

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు



నంబి నారాయణన్

పూర్తి పేరు శంకరలింగం నంబి నారాయణన్. డిసెంబర్ 30, 1941 న కేరళలో జన్మించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త. అతనికి లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ టెక్నాలజీ, ఇస్రో లాంచ్ వెహికల్స్ అభివృద్ధి రంగాలలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. నంబి నారాయణన్ విక్రం సారాభాయ్, సతీష్ ధావన్, అబ్దుల్ కలాం వంటి ప్రముఖ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేశారు. అంతరిక్ష రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా, భారత ప్రభుత్వం 2019లో పద్మభూషణ్‌తో సత్కరించింది.

జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలో అతిపెద్ద సముద్రం ఏది?
2. భారత కరెన్సీ నోట్లు ముద్రించే ప్రదేశం ఏది?
3. భారతదేశపు మొదటి ఉపగ్రహం పేరు ఏమిటి?

జవాబులు: 1. పసిఫిక్ మహాసముద్రం, 2. నాసిక్ (మహారాష్ట్ర), 3. ఆర్యభట్ట

మెదడుకు మేత

ఎగరదు, కానీ రెక్కలు ఉన్నాయి.
నడవదు, కానీ కాళ్లు ఉన్నాయి..
ఏమిటది?

జవాబు : ఈగ

మంచిమాట

తన తప్పు
తెలుసుకోవడం
జ్ఞానానికి మొదటి
అడుగు

వలపన్ని ఉంచాడు. పొరబాటున సింహం ఆ వలలో చిక్కుకొంది. ఏమీ చేయలేక దీనంగా అరవడం మొదలు పెట్టింది. దాన్ని రక్షించడానికి ఎవ్వరూ రాలేదు. అప్పుడే కన్నం లోంచి బయటికి వచ్చిన ఆ చిట్టెలుకకు ఆ సింహం అరుపు విన్పించింది.

అది సింహం గొంతును గుర్తుపట్టి ఒక్క పరుగున అక్కడికి చేరుకొని, "మహారాజా! భయపడకండి. నేను మీకు సహాయం చేస్తాను" అంది.

అటూ ఇటూ చూసింది వేటగాడు దగ్గరలో ఎక్కడాలేడు. వెంటనే వల తాళ్లను ముక్కలు ముక్కలుగా కొరికి పారేసింది.

సింహం ఆనందంగా బయటికి వచ్చి చిట్టెలుకను ఒకసారి పైకెత్తి ముద్దాడి వదలిపెట్టింది. ★

వారఫలాలు

17-23, నవంబర్ 2025

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆస్తుల వ్యవహారంలో అగ్రిమెంట్లు చేసుకుంటారు. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు. ఆశించిన రాబడి దక్కి అవసరాలు తీరతాయి. వ్యాపారులకు పెట్టుబడులు అంది ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులకు కొత్త హోదాలు దక్కించుకుంటారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అప్రయత్నంగా అవకాశాలు దక్కించుకుంటారు. 20,21 తేదీల్లో బంధువిరోధాలు. విలువైన సామగ్రి జాగ్రత్త. నృసింహస్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

స్నేహితులు, బంధువులు విశేష ప్రేమానురాగాలు చూపుతారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఇంటి నిర్మాణాలు చేపడతారు. వాహనాలు కొనుగోలు చేసుకుంటారు. వ్యాపారాలలో భాగస్వాములు పెరుగుతారు. ఉద్యోగస్తులకు అనూహ్యమైన మార్పులు ఉండవచ్చు. రచయితలు, క్రీడాకారులు సంతోషకరంగా గడుపుతారు. 17,18 తేదీలలో ఖర్చులు అధికం. సోదరులతో కలహాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

కాంట్రాక్టర్లు అనూహ్యంగా లబ్ధి పొందుతారు. విద్యార్థులు, విచిత్ర సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారులకు అదృష్టం వరిస్తుంది, అనుకున్న లాభాలు దక్కుతాయి. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో ప్రతిబంధకాలు తొలగుతాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా గడుపుతారు. వైద్యులు, కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. 19,20 తేదీలలో వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు. నిరుద్యోగులకు మరింత ఉత్సాహం. విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. వ్యాపారులకు సామాన్యమైన లాభాలు. ఉద్యోగులకు మంచి గుర్తింపు. విధి నిర్వహణలో అవరోధాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు అంచనాలు నిజమవుతాయి. రచయితలు, కళాకారులకు ఉత్సాహవంతమైన కాలం 20,21 తేదీల్లో. ఆరోగ్యసమస్యలు. మానసిక అశాంతి. అన్నపూర్ణాష్టకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొన్ని నిర్ణయాలను మార్చుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలు వాయిదా. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. విద్యార్థులు మరింత శ్రమపడాలి. వ్యాపారులకు లాభాలు అంతగా కనిపించవు. ఉద్యోగస్తులకు విధుల్లో ఆటంకాలు. వైద్యులు, క్రీడా కారులు, పారిశ్రామికవర్గాలకు తరచూ విదేశీ యానం. 19,20 తేదీలలో శుభవార్తలు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. దుర్గాదేవిని పూజించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. నూతన వ్యక్తుల పరిచయం. వ్యాపారస్తులకు ఆశించిన విధంగా లాభాలు. ఊహించని విధంగా అభివృద్ధి. ఉద్యోగస్తులు విధుల్లో ఒడి దుడుకుల నుంచి బయట పడతారు. పారిశ్రామికవర్గాలు, రచయితలకు విశేష గుర్తింపు. కళాకారులకు అవార్డులు దక్కుతాయి. 22, 23 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబసభ్యులతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

కొన్నేళ్ల క్రితం దూరమైన బంధువులు తిరిగి దగ్గరకు చేరతారు. చిత్రవిచిత్ర సంఘటనలు. విలాసవంతమైన జీవనం. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు నైపుణ్యతతో లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు మరింత గుర్తింపు. రాజకీయవేత్తలు, క్రీడాకారులు, కళాకారులకు విజయాలు. 17,18 తేదీలలో బంధువులతో విభేదాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నేర్పుగా వివాదాల నుంచి బయటపడతారు. కోర్టు వ్యవహారాలు అనుకూలం. విద్యార్థులు మరింత ఉత్సాహంగా గడుపుతారు. స్థిరాస్తిపై అగ్రిమెంట్లు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులతోపాటు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరం. పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు ఊహించని అవకాశాలు. 21,22 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.. బంధువులు, స్నేహితులతో తగాదాలు తీరతాయి. ఖర్చులు తగ్గించడం మంచిది. లాభాల దిశగా పయనిస్తారు. పారిశ్రామికవేత్తలు, రచయితలు, కళాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. 22,23 తేదీల్లో వ్యయప్రయాసలు. లేనిపోని సమస్యలు రావచ్చు. ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా మెలగాలి. విష్ణుధ్యానం చేయండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. స్థిరాస్తి విషయంలో అగ్రిమెంట్లు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కోర్టు వ్యవహారాలలో ఒత్తిడులు తొలగుతాయి. కాంట్రాక్టరక్లు ఊహించని టెండర్లు. వ్యాపారులు ఆశించిన లాభాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. 18,19 తేదీల్లో దూరప్రయాణాలు. ఖర్చులు మరింత పెరుగుతాయి. అంగారక స్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆస్తి విషయాల్లో చికాకులు తొలగుతాయి. నూతన వ్యక్తుల పరిచయం. గృహ నిర్మాణయత్నాలు కలసి వస్తాయి. వివాహ, ఉద్యోగయత్నాలు కలసి వస్తాయి. లాభాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలకు కొత్త సంస్థలతో అగ్రిమెంట్లు. రాజకీయవేత్తలు, రచయితలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 19,20 తేదీల్లో వృథాఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అనుకున్న కార్యక్రమాలు నెమ్మదిగా సాగుతాయి. విద్యార్థులకు నూతన విద్యావకాశాలు. నిరు ద్యోగులకు శుభవర్తమానాలు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులలో లాభాలు. ఉద్యోగులకు బాధ్యతలు తగ్గి ఊపిరిపీల్చుకుంటారు. కళాకారులు, రచయితల ఆశలు నెరవేరతాయి. రాజకీయ, పారిశ్రామిక వర్గాలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 19,20 తేదీల్లో ఖర్చులు. మానసిక ఆందోళన. ఆరోగ్య సమస్యలు. శ్రీదత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

పదరసం-538



ఆధారాలు

అడ్డం

1. త్రాసు, ఒక రాశి (2)
2. మంగళగిరి స్వామి ప్రసాదం (3)
4. వెండికొండ (3)
7. పడవ (2)
8. పైడితల్లికి జరిగే ఉత్సవం (4)
11. తాళిబొట్టు (3)
12. కోట, విపత్తు (2)
14. ఇది ఎరిగి వాత పెట్టాలట (2)
15. ఇరవై నాలుగు గంటలు (2)
16. సుగ్రీవ సతిని పిలవండి (2)
17. సరిపోడు..అనర్హుడు (3)
22. ఆకలి చెల్లాచెదరు (3)
24. ఈయన శిష్యులు శుద్ధ అమాయకులట (6)
28. శరీరం (2)
29. ఓటమి (4)
31. ఇరుగుతో పాటే...(3)
33. ప్రజలు, జనసమూహం (3)
34. సరస్వతి (2)

నిలువు

1. ఈ దాస్ హనుమాన్ చాలీసా కర్త (3)
3. ఇది సాగరంలో కలవాల్సిందే (2)
4. ముక్తి, మోక్షం (3)
5. వేడుకలు (4)
6. ఒక విరామ చిహ్నం (2)
7. నాగులతల్లి, కద్రువ (4)
9. అలవాటు.. మామూలు (3)
10. లలాటం (3)
13. దారి... కింద నుంచి (2)
14. మేలు కాదు.. (2)
15. ముసలం (3)
18. ఆకాశం (3)
19. దశరథుడి మూడవ భార్య (2)
20. హుండీ లెక్కింపునకు పర్యాయపదం (5)
21. ఆవుదూడ (2)
23. రాగం తీయడం, పాడడం (4)
25. కనిపించకుండా పోవడం (2)
26. ఆస్థానం, కొలువు కూటం (3)
27. జలం, నీరు (2)
29. జాడ, ఆచూకీ (2)
30. జోడు, జంట (2)
31. నిప్పు లేనిదే... రాదుగా (2)
32. దేవాలయం (2)

పదరసం - 536 సమాధానాలు



సినిమాల ప్రభావం సమాజం మీద ఉంటుందా? సమాజం ప్రభావం సినిమాల మీద ఉంటుందా? అనేది ఎడతెగని చర్చ. రెండూ పరస్పర ప్రేరిపితాలే. వెండితెరపై కనిపించే సంఘటనలు మరీ ముఖ్యంగా చెడు మార్గం వైపు నడిపేవి మనుషులపై ప్రభావం చూపినట్టుగా సన్మార్గం వైపు నడిపించే సంఘటనలు, సన్నివేశాలు పెద్దంత ప్రభావితం చేయవు. అందువల్ల నిర్మాతద దర్శకులు సమాజాన్ని మంచి వైపు నడపకపోయినా ఫర్వాలేదు కానీ చెడుమార్గం వైపు నడిపేలా సినిమాలు తీయకూడదనే నిబద్ధత కలిగి ఉంటే సమస్య లేదు.

సమాజానికి ఇస్తున్న సందేశం ఏమిటీ!?

సినిమా రంగం ఫక్తు వ్యాపారంగా మారిపోయి నప్పుడు కమర్షియల్ సినిమాలు తీసేవారిని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఆ సినిమాలు నచ్చితేనే జనం చూస్తారు. కానీ సమాజాన్ని ఉద్ధరించే సినిమాలు తీస్తున్నామని, డబ్బుల కంటే కూడా మాన వీయ విలువలు ముఖ్యం అనే పేరుతో కొందరు చేస్తున్న సాంప్రదాయ, సాంస్కృతిక విధ్వంసం పట్ల జాగరూకత అవసరం.ఈ మధ్యకాలంలో సమ సమాజం, అభ్యుదయం, స్త్రీవాదం పేర్లతో సినిమాలు వస్తున్నాయి. ఆ కోవకు చెందిందే 'ది గర్ల్ ఫ్రెండ్'.

ఒక లక్ష్యంతో ఉన్నత చదువుల కోసం వైజాగ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ మహిళ.... ఇక్కడో టాక్సిక్ లవర్ చేతిలో నలిగిపోయి... ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని ఎలా తిరగబడిందనేది ఈ సినిమా కథ. వైజాగ్ లాంటి నగరం కాదు కానీ రెండు తెలుగు రాష్ట్రాలలో ఉండే పట్టణ, గ్రామీణ మహిళలు ఎంతో మంది ఎన్నో ఆశలతో హైదరాబాద్ లాంటి నగరానికి వస్తుంటారు. తమ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో కొందరు ప్రేమ పేరుతో మోస పోతుంటారు. మరి కొందరు కొన్ని ప్రలోభాలకు లొంగిపోతుంటారు. అలాంటి వారు తమకు తాము ఎలా రక్షించుకోవాలనే తరహా కథ కాబట్టి ఇలాంటి సినిమా సమాజానికి అవసరమని నిర్మాతలు భావించి ఉండొచ్చు. అయితే దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాను తెరకెక్కించిన విధానం చర్చ నీయాంశంగా మారింది. ఈ సినిమాను కొందరు అద్భుతం అని ఆకాశానికి ఎత్తుతుంటే, మరికొందరు 'ఇలాంటి సినిమాల ద్వారా సమాజానికి ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారు?' అని ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే ఈ సినిమాను డబ్బులు కోసం కాకుండా ఆత్మతృప్తి కోసం నిర్మించామని నిర్మాతలే చెప్పారు. కనుక, వారికి ఇక్కడ డబ్బులు ప్రధానం కాదు...ఈ సినిమా ద్వారా తామిచ్చే సందేశం నలుగురికి చేరాలి అన్నదే ముఖ్యం.మరి ఆ సందేశం విషయంలో అసలు స్పష్టత ఉందా? అనే సందేహం సహజంగానే కలుగుతుంది.

ఇందులో కథానాయిక చదువుకున్న అమ్మాయి. సిటీలో పెరుగుతుంది. తండ్రి చాటు కూతురు. అలాంటి అమ్మాయి హైదరాబాద్ రాగానే ఓ చిన్న సంఘటన కారణంగా తన తోటి స్టూడెంట్‌తో శారీర కంగా కనెక్ట్ కావడం ఊహకందనిది. అంటే ఇవాళ సమాజంలో అమ్మాయిలు అంత బలహీనులుగా ఉన్నారని దర్శకుడు చెప్పాలనుకున్నాడా? బహుశా అదే కావచ్చు. సరే... ఒకవేళ క్షణికావేశంలో ఒకసారి తప్పుచేశారనుకున్నా, అది పునరావృతం కావడం, వారిద్దరినీ చూసి తోటి విద్యార్థులు రోమియో, జూలియెట్స్ తరహాలో పొగడడం విశ్రమనిపిస్తుంది? పైగా వీరి సహజీవనం మొత్తం కాలేజీ హాస్టల్‌లోనే జరుగుతుంటుంది. రాత్రి పగలు తేడా లేకుండా ఎవరి గదికి వారు ఇష్టానుసారంగా వెళ్లిపోతుం టారు. అక్కడ వార్డెన్ లాంటి వ్యవస్థ కూడా ఉన్నట్టు అనిపించదు. ఇక హీరో తండ్రి తన కూతురు హాస్టల్‌కు వచ్చి ఆమె గదిలో ఉన్న బోయ్ ఫ్రెండ్ చూసి హతాశయుడవుతాడు. కొంత వాగ్వివాదం తర్వాత సీన్ హెచ్.ఓ.డి. దగ్గరకు మారుతుంది. దానికి ఆయన తమ స్టూడెంట్స్ మేజర్స్ కాబట్టి సహ జీవనం వాళ్ల ఇష్టమని, దానికి తాము అభ్యంతరం పెట్టమని చెబుతాడు. హతవిధీ.

అసలు చిత్రం ఏమంటే... ఒకసారి శారీరకంగా హీరోకి దగ్గరైన హీరోయిన్ ,అతన్ని నిజంగా ప్రేమించిందో లేదో తెలుసుకోలేని సందిగ్ధంలో ఉంటుంది. అతనితో జీవితాన్ని కొనసాగించాలో లేదో తేల్చుకోలేక కొట్టుమిట్టాడుతూ ఉంటుంది. అటువంటి సమయంలో భుజం మీద చెయ్యి వేసి కాలేజీ క్యాంపస్ అంతా 'ఆమె నా పిల్ల' అన్నట్టుగా హీరో తిరుగుతూ ఉంటాడు. దాన్ని ఆమె భరిస్తూ ఉంటుంది. నిజానికి మొదటిసారి తన ఇష్టం లేకుండా భుజం మీద చెయ్యి వేసినప్పుడే లాగి పెట్టి లెంపకాయ కొట్టాల్సిన అమ్మాయి... అలా ప్రవర్తించకుండా మౌనంగా భరించినట్టు దర్శకుడు చూపించడం ఎంత దారుణం! ఇవాళ్టి తరం అమ్మాయి మరీ అంత టేకిట్ గ్రాంట్ అన్నట్టుగా ఉన్నారని దర్శకుడు భ్రమ పడుతున్నాడా?

ఇక హీరో గారి తల్లి పాత్ర చిత్రీకరణ మరో అరాచకం. భర్త కొట్టే దెబ్బలకు భయపడి ఆమె ఇంటిలో కూడా దించిన తల ఎత్తదు. చిత్రం ఏమంటే... ఆ శాడిస్ట్ భర్త చనిపోయినా ఆమెలో మార్పు రాదు. తల్లి మానసిక పరిస్థితి తెలిసి కూడా హీరో ఆమెలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిం చడు. పైగా తాను తండ్రి అంత క్రూరుడిని కాదని చెబుతూ ఉంటాడు. అయినా ఆమె మాత్రం గానుగెద్దు జీవితాన్నే గడిపేస్తూ ఉంటుంది. ఆడవాళ్ల జీవితాలను ఉద్ధరించాలనుకునే సదరు దర్శకులు మహిళలను ఇంత దారుణమైన పాత్రలలో చూపించి సమాజానికి ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటు న్నారు. నిజం చెప్పాలంటే... మహిళలలో ఓ ధైర్యాన్ని నింపే బదులు మీ జీవితాలు ఇంతే... ఇలా మీరు గడపాల్సిందే... ఒకవేళ మీరు దీనిని ఎదిరించాలంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి? అని పరోక్షంగా బెదిరిస్తున్నారేమో అనిపిస్తుంది. ఇందులోనూ హీరో నైజం నచ్చక ఒకానొక దశలో హీరోయిన్ అతనికి బ్రేకప్ చెప్పాలనుకుంటే అతను అలాంటి ఉన్మాద ప్రవృత్తికే పాల్పడతాడు. అయితే... అప్పటికే కాలేజీలో అందరికీ తెలిసిన తమ మధ్య ఉన్న అక్రమ సంబంధం విషయాన్ని హీరోయిన్ ఫేర్‌వేల్ ఫంక్షన్‌లో బాహాటంగా చెప్పి అతనికి బుద్ధి చెప్పినట్టు ఫీల్ అవుతుంది. అంటే టిట్ ఫర్ ట్యాట్ గా దర్శకుడు భావించాడు. ఇదేమి లాజిక్కో అర్థం కాదు.

స్త్రీ పురుషుల సంబంధాల విషయంలో సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన కొన్ని తీర్పులు ఎలాంటి వికృత పరిణామాలకు దారితీస్తున్నాయో అందరికీ తెలిసిందే. చట్టాలతో సమాజం బాగుపడిపోతుందనుకోవడం అంత తెలివి తక్కువ తనం మరొకటి లేదు. వ్యక్తిగత శీల నిర్మాణం జరగకుండా ఉన్నతమైన సమాజాన్ని నిర్మించలేం. స్వేచ్ఛపేరుతో కట్టుబాట్లను కాలరాయ మని ప్రోత్సహించే ఈ తరహా సినిమాలతో సమాజా నికి కీడు తప్పితే మేలు జరిగే ఆస్కారమేలేదు.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.60/-



వెల : ₹.250/-



వెల : ₹.50/-

వెల : ₹.200/-



వెల : ₹.275/-



వెల : ₹.100/-

వెల : ₹.499/-



వెల:₹.499/-



వెల :₹.450/-



వెల : ₹.999/-



వెల : ₹.125/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 05

G.PULLA REDDY ENGINEERING COLLEGE

(AUTONOMOUS)

(SPONSORED BY G.PULLA REDDY CHARITIES TRUST - HYDERABAD)

G. Pulla Reddy Nagar, Nandyal Road, KURNOOL – 518007, Ph: 08518-270957,
Fax: 08518-270957, E-mail: principal@gprec.ac.in Website: www.gprec.ac.in

Estd: 1985

gprec
G. PULLA REDDY ENGINEERING COLLEGE (Autonomous)

Inspiring Education for Aspiring Engineers

EAPCET CODE : GPRE

COURSES OFFERED

B.Tech Programmes

1. Civil Engineering (CIV)
2. Computer Science & Engineerign (CSE)
3. CSE-Artificial Intelligence & Machine Learning (CSM)
4. Electronics & Communication Engineering (ECE)
5. Electrical and Electronics Engineering (EEE)
6. Mechanical Engineering (MEC)

M. Tech Programmes

1. Computer Science & Engineering
2. Structural Engineering
3. VLSI & Embedded Systems
4. Automation and Robotics
5. Advanced Manufacturing Technology

PLACEMENTS:

GPREC is proud its Alumni, who are well placed in over 200 national and multi-national organizations in Countries like United States, Canada, U.K., Australia, Germany, France, Japan, Singapore, Malaysia, Ireland, Belgium etc., apart from India.

SCHOLARSHIPS:

- Complete Tuition Fee Waiver for students joining the college with less than 2000 rank in EAPCET.
- 50% Tuition Fee Waiver for students joining the college with less than 3000 rank in EAPCET.

Late Sri G. Pulla Reddy garu
(1920– 2007)

HOSTEL Available for Girls/ Boys

ACCREDITED BY NBA OF AICTE and NAAC (Grade A) of UGC

Founded by late Sri G. Pulla Reddy garu, the college has become one of the Premier Institutes of the state. His munificent grants have helped the college grow into an Institute of Excellence. The EAPCET ranks of the students joining our college bear ample testimony to the reputation of our college in the state.